పెన్ పవర్
తెలంగాణ రౌండప్




# రెండు చోట్ల కూల్చివేతలు..! ఇద్దరిపై కేసులు..!



జగద్గిరిగుట్ట సర్వే నెం.348 ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాన్ని శనివారం కూల్చేసి కేసునమోదు..

## కుత్బుల్లాపూర్ మండలంలో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ కొరడా..!



సర్వే నెం.333, 334 ప్రభుత్వ భూమిలో శుక్రవారం కూల్చేసిన ఫొటో..

- గాజులరామారం సర్వే నెం. 333, 334లో అక్రమ నిర్మాణంలో షేక్ అజహర్‌పై కేసు..
- జగద్గిరిగుట్ట లెనిన్ నగర్,సర్వే నెం.348లో నిర్మించిన ఒక గదిని రెవెన్యూ కూల్చివేత..
- 348లోని అక్రమణ దారుడు మహ్మద్ మెయిన్‌పై కేసు నమోదు..
- ప్రభుత్వ భూముల్లో అక్రమ, నిర్మాణాలపై రెవెన్యూ స్పెషల్ డ్రైవ్..
- కూల్చివేతతో పాటు క్రిమినల్ కేసులు తప్పవని తహశీల్దార్ రాజేష్ హెచ్చరిక..
- రెవెన్యూ హెచ్చరికను బేఖాతర్ చేస్తూ పదే పదే కబ్జాలకు పాల్పడితే పీడీయాక్ట్..

### జగద్గిరిగుట్ట 348లో కూల్చివేత.. కేసు నమోదు..

కుత్బుల్లాపూర్, మండల పరిధి జగద్గిరి గుట్టలోని లెనిన్ నగర్, సర్వే నంబర్ 348లో నిర్మించిన ఒక గదిని రెవెన్యూ అధికారులు శనివారం కూల్చివేశారు.. ఈ అక్రమ నిర్మాణానికి సంబంధించి కబ్జాదారుడు మహ్మద్ మెయిన్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.. ప్రభుత్వ భూములను ఆక్రమించి లేదా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణలో భాగంగా ప్రత్యేక తనిఖీలు కొనసాగుతున్నాయని, అక్రమ నిర్మాణాలు గుర్తించిన వెంటనే కూల్చివేతతో పాటు కేసులు నమోదు చేసి చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు..

**కుత్బుల్లాపూర్ మండలంలో ప్రభుత్వ భూముల్లో ప్లాట్‌లు కొనుగోలు చేసి మోసపోవద్దని తహశీల్దార్ రాజేష్ సూచించారు.. అమాయకులను టార్గెట్ చేసి, ప్రభుత్వ భూములను విక్రయించే భూ కబ్జాదారులను గుర్తించే పనిలో తమ రెవెన్యూ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని తహశీల్దార్ రాజేష్ తెలిపారు.**


పెన్ పవర్
సర్వే నెం.333, 334లో కూల్చివేతలు..!

## ఆత్మీయ సమ్మేళనం..

ఆనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి

వివరాలు 4లో..

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి




# పార్కింగ్ లేదు..! సరైన వసతులు లేవు..!

- రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద పార్కింగ్ సౌకర్యం లేక క్రయవిక్రయదారులు ఇబ్బంది..
- రోడ్డుపైనే వాహనాల పార్కింగ్.. ట్రాఫిక్ జరిమానాలు విధింపుతో ఇబ్బందులు..
- గండిమైసమ్మలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనం అందుబాటులో ఉన్నప్పటికీ..!
- రిజిస్ట్రేషన్ శాఖకు అప్పగించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి..
- జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని,ఖాళీ భవనాన్ని రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కి కేటాయించాలి..!

## కుత్బుల్లాపూర్ రిజిస్ట్రేషన్ కార్యాలయం తరలింపులో జాప్యం ఎందుకు..?

రూ.కోట్లు ఆదాయం తెచ్చే రిజిస్ట్రేషన్ శాఖకు సొంత భవనం కరువైంది..! జీహెచ్ఎంసీ భవనం ఖాళీగా ఉన్నా..! అప్పగింతకు ఎందుకు జాప్యం అవుతుందో అంటూ..? విమర్శలు వస్తున్నాయి.. పార్కింగ్ లేక ప్రజల అవస్థలు పడుతుండగా.. ట్రాఫిక్ జరిమానాలతో అదనపు భారం పడుతుందని, క్రయ విక్రయదారులు గగ్గోలు పెడుతున్నారు.. గండిమైసమ్మ దుండిగల్ తహశీల్దార్ ఆవరణలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనంలోకిన కార్యాలయాన్ని వెంటనే తరలించాలని డిమాండ్ డిమాండ్ చేస్తున్నారు..

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జూలై 4:

-4లో



## ఆహార భద్రత, ఔషధ నియంత్రణ విభాగాలు కలిసి పనిచేయాలి

హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రంలో ఆహార భద్రత(ఫుడ్ సేఫ్టీ), ఔషధ నియంత్రణ(డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్) విభాగాలు కలిసి..సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సంజయ్ జాజు అన్నారు. సచివాలయంలో శనివారం ఆయన సీఎం సలహాదారు కె.రామకృష్ణారావు, డీజీపీ సీవీ.ఆనంద్‌లతో కలిసి ఈ రెండు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 'రాష్ట్రంలో ఆహార భద్రత, ఔషధ నియంత్రణ విభాగాలు సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు వస్తాయి. ఈ మేరకు తగిన ప్రతిపాదనలను వారం రోజుల్లోగా సిద్ధం చేయాలి. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాన్ని అధ్యయనం చేసి మన రాష్ట్రంలో కూడా అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలి. ఆహార భద్రతా ప్రమాణాల అమలు, నాణ్యతపై నిరంతరం తనిఖీలు నిర్వహించాలి. ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి' అని సీఎస్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఎంఓ ముఖ్య కార్యదర్శులు శేషాద్రి, ఎన్.శ్రీధర్, జీఏడీ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీం, అడిషనల్ డీజీ(ఇంటెలిజెన్స్) విజయ్ కుమార్, వైద్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, వైద్యశాఖ కమిషనర్ సంగీత, డ్రగ్ కంట్రోలర్ డీజీ అవినాశ్ మొహంతి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

- రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద పార్కింగ్ సౌకర్యం లేక క్రయవిక్రయదారులు ఇబ్బంది..
- రోడ్డుపైనే వాహనాల పార్కింగ్.. ట్రాఫిక్ జరిమానాలు విధింపుతో ఇబ్బందులు..
- గండిమైసమ్మలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనం అందుబాటులో ఉన్నప్పటికీ..!
- రిజిస్ట్రేషన్ శాఖకు అప్పగించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి..
- జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని,ఖాళీ భవనాన్ని రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కి కేటాయించాలి..!

**రూ.కోట్లు ఆదాయం తెచ్చే రిజిస్ట్రేషన్ శాఖకు సొంత భవనం కరువైంది..! జీహెచ్ఎంసీ భవనం ఖాళీగా ఉన్నా..! అప్పగింతకు ఎందుకు జాప్యం అవుతుందో అంటూ..? విమర్శలు వస్తున్నాయి.. పార్కింగ్ లేక ప్రజలు అవస్థలు పడుతుండగా.. ట్రాఫిక్ జరిమానాలతో అదనపు భారం పడుతుందని, క్రయ విక్రయదారులు గగ్గోలు పెడుతున్నారు.. గండిమైసమ్మ దుండిగల్ తహశీల్దార్ ఆవరణలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనంలోకిన కార్యాలయాన్ని వెంటనే తరలించాలని డిమాండ్ డిమాండ్ చేస్తున్నారు..**

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జూలై 4:**



సూరారంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద, ద్విచక్ర వాహనాల పార్కింగ్ జాతర..

# పార్కింగ్ లేదు..! సరైన వసతులు లేవు..!

## కుత్బుల్లాపూర్ రిజిస్ట్రేషన్ కార్యాలయం తరలింపులో జాప్యం ఎందుకు..?


ప్రస్తుతం రోడ్డు మూసేయడంతో దర్జాగా వాహనాల పార్కింగ్..

ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం సమకూర్చే రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం ఇప్పటికీ సరైన వసతులు లేక అద్దె భవనంలో కొనసాగుతుండడం విమర్శలకు తావిస్తోంది.. కార్యాలయం వద్ద పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో ప్రతిరోజూ వచ్చే క్రయవిక్రయదారులు తమ వాహనాలను రోడ్డుపై నిలిపివేయాల్సి వస్తోంది. దీంతో ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధిస్తుండటంతో ప్రజలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు.. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చే క్రయవిక్రయదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్యాలయం వద్ద పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వాహనాలను రోడ్డుపై నిలిపివేయాల్సి వస్తోంది. దీంతో ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధించడం వల్ల ప్రజలు అదనపు భారాన్ని భరించాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు.. ప్రస్తుతం ఉన్న కార్యాలయం పైఅంతస్తులో ఉండటంతో ప్రజలు మెట్లపైకి ఎక్కాల్సి వస్తోంది. వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని అయితే గండిమైసమ్మలోని ప్రభుత్వ భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉండటంతో ప్రజలకు ఎంతో అనుకూలంగా ఉంటుంది..

### ఖాళీగా ప్రభుత్వ భవనం ఉన్నా..! కేటాయింపు జాప్యం..?

ప్రభుత్వ భవనం అందుబాటులో ఉన్నప్పటికీ దానిని రిజిస్ట్రేషన్ శాఖకు ఎందుకు అప్పగించడం లేదనే ప్రశ్నలు ప్రధానంగా వినిపిస్తున్నాయి. రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులకు ఈ సమస్య కనిపించడం లేదా..? జీహెచ్ఎంసీ కమిషనర్, సంబంధిత జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ ఈ అంశంపై ఎందుకు స్పందించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా జోక్యం చేసుకుని, జీహెచ్ఎంసీ భవనాన్ని అవసరమైన మార్పులు చేసి వెంటనే రిజిస్ట్రేషన్ శాఖకు అప్పగించాలని స్థానికులు, క్రయవిక్రయదారులు కోరుతున్నారు. దీంతో ప్రజల ఇబ్బందులు తొలగడంతో పాటు ట్రాఫిక్ సమస్య కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.

ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం సమకూర్చే రిజిస్ట్రేషన్, ఎక్సైజ్ శాఖలకు ఇప్పటికీ సొంత భవనాలు లేకపోవడం ఆశ్చర్యకరం. ఈ రెండు శాఖలు ప్రభుత్వ ఆదాయానికి ప్రధాన ఆధారాలు. ఈ శాఖల పనితీరు సజావుగా కొనసాగితేనే ప్రభుత్వానికి ఆదాయం సమకూరి, ఉద్యోగులకు జీతాల చెల్లింపులు సక్రమంగా జరుగుతాయి. అందువల్ల ఈ శాఖలకు శాశ్వత భవనాలు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు..

### ఆత్మీయ సమ్మేళనం.. ఆనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండపేటలో పర్యటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. అక్కడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 20 ఏళ్ల క్రితం మిడ్జిల్ జడ్పీటీసీగా రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం ప్రారంభమైన సంగతి తెలిసిందే. జడ్పీటీసీగా తన విజయానికి సహకరించిన వారిని ఇవాళ సీఎం కలిశారు. అనుచరులు, జిల్లా నేతలతో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. తన రాజకీయ అనుచరులను ఆత్మీయంగా పలకరించారు. మిత్రులతో కలిసి ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డితో ఉన్న అనుబంధాన్ని పలువురు గుర్తు చేసుకున్నారు.

## భారాస హయాంలో నీటి ప్రాజెక్టులు ఆగం: మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టులన్నీ భారాస పాలనలోనే ఆగమయ్యాయని రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ సమీపంలోని నెల్లికల్లు ఎత్తిపోతల పథకాన్ని నాగార్జునసాగర్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు జైవీర్‌రెడ్డి, లక్ష్మారెడ్డిలతో కలిసి పరిశీలించారు. అనంతరం సాగర్ విజయవిహార్ సమావేశ మందిరంలో నీటి పారుదలశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. భారాస నాయకులు మేడిగడ్డ బ్యారేజీని కమీషన్ల కోసం నాణ్యత లేకుండా నిర్మించడంవల్లే నేడు అది పనికిరాకుండా పోయిందని..ఇప్పుడు వారు మేడిగడ్డ వద్ద నీటిని నిల్వ చేయాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. మేడిగడ్డ వద్ద ప్రస్తుతం నీటిని నిల్వ చేయలేని పరిస్థితిలో ఉన్నామని..దానివల్లే కన్నెపల్లి పంపింగ్ సాధ్యం కావడం లేదన్నారు. జాతీయ డ్యాం భద్రత(ఎన్డీఎస్ఏ) మార్గదర్శకాల ప్రకారమే బ్యారేజీల నిర్వహణ కొనసాగుతుందని, శాస్త్రీయ పరీక్షల అనంతరం అవసరమైన పునరుద్ధరణ చర్యలు తీసుకుంటామన్నారు. సాగర్ డ్యాం స్పిల్‌వే మరమ్మతులకు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నెల్లికల్లు ఎత్తిపోతల పథకం పనులను వచ్చే వేసవి నాటికి పూర్తిచేసి నీటిని అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, ప్రభుత్వాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ చుట్టూ స్కైవాక్....

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. హుస్సేన్‌సాగర్‌ను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు దాని చుట్టూ సర్క్యులర్ స్కైవాక్ నిర్మించాలని నిర్ణయించింది. స్కైవాక్ ద్వారా బుద్ధుడి విగ్రహాన్ని కొత్త కోణంలో వీక్షించే అవకాశం కల్పించనుంది. అదే సమయంలో నాగార్జునసాగర్ బుద్ధవనం, ఫణిగిరి, నేలకొండపల్లి వంటి బౌద్ధ క్షేత్రాలను అభివృద్ధి చేసి ప్రత్యేక టూరిజం ప్యాకేజీలు తీసుకురావాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. హైదరాబాద్ ప్రజలకు, పర్యాటక ప్రేమికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నగరంలోని హుస్సేన్‌సాగర్‌ను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రేవంత్ రెడ్డి సర్కార్ కీలక అడుగు వేస్తోంది. ఇప్పటికే బోటింగ్ సౌకర్యంతో సందర్శకులను ఆకట్టుకుంటున్న హుస్సేన్‌సాగర్‌కు మరింత ప్రత్యేక ఆకర్షణను జోడిస్తూ సరస్సు చుట్టూ ఆధునిక సర్క్యులర్ స్కైవాక్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న ఈ స్కైవాక్ ద్వారా సందర్శకులు హుస్సేన్‌సాగర్ మధ్యలోని ప్రపంచ ప్రసిద్ధ ఏకశిల బుద్ధ విగ్రహాన్ని సరికొత్త కోణంలో వీక్షించే అవకాశం పొందనున్నారు. సాయంత్ర వేళల్లో సరస్సు అందాలు, నగర వెలుగులు, బుద్ధ విగ్రహం ఒకే వేదికపై కనిపించేలా ఈ ప్రాజెక్టును రూపొందించనున్నట్లు సమాచారం. దీంతో హైదరాబాద్ టూరిజానికి మరో కొత్త గుర్తింపు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇదే సమయంలో నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని కూడా అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. అక్కడ అంతర్జాతీయ బుద్ధ మ్యూజియం, హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. బుద్ధుడి జీవిత ఘట్టాలను ప్రతిబింబించే శిల్పాలు, మహాస్థూపం, ఇతర ఆకర్షణలను మరింత విస్తరించి పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం 274 ఎకరాల్లో విస్తరించిన బుద్ధవనాన్ని మరింత ఆధునికంగా తీర్చిదిద్దనున్నారు. అంతేకాకుండా ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో భారీ మట్టి బౌద్ధ స్తూపం నిర్మించేందుకు కూడా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. అలాగే ఫణిగిరి, బుద్ధవనం, నేలకొండపల్లి, హైదరాబాద్ హుస్సేన్‌సాగర్ బుద్ధ విగ్రహాన్ని కలుపుతూ ప్రత్యేక బౌద్ధ పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. వీకెండ్ టూరిజాన్ని ప్రోత్సహించేలా ఒక రోజు, రెండు రోజుల ప్రత్యేక పర్యాటక ప్యాకేజీలను కూడా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. దేశీయ పర్యాటకులతో పాటు విదేశాల నుంచి వచ్చే బౌద్ధ యాత్రికులను ఆకర్షించేలా ప్రత్యేక బౌద్ధ, జైన టూరిజం సర్క్యూట్లను రూపొందించనుంది. ఈ ప్రాజెక్టులు అమలైతే రాష్ట్రంలో పర్యాటక రంగానికి కొత్త ఊపు రావడంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది.


02

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

శుభాకాంక్షలు యాడ్స్

కేవలం

యాడ్ 300/-

'పోస్టుకార్డు సైజు '


'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి


## సిద్దిపేట కు రేవంత్ రెడ్డి గ్రహణం పట్టింది: మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



**హైదరాబాద్ పెన్ పవర్:** హరీష్ రావు మాట్లాడుతూ వచ్చేది మన ప్రభుత్వమే సిద్దిపేట అభివృద్ధి వంద కిలోమీటర్ల వేగం తో ప్రగతి పరుగులు పెట్టిస్తా మీ అందరి తలరాత మారాలి అంటే కెసిఆర్ అనే గీత పెట్టుకోవాలి. అ గీత నే మీ భవిష్యత్ మారుస్తుంది సిద్దిపేట లో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆత్మీయ సమ్మేళనం లో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఈ సందర్బంగా హరీష్ రావు మాట్లాడుతు. రియల్ ఎస్టేట్ ఒక పెద్ద వ్యాపారం. రియల్ ఎస్టేట్ బాగుంటే దానికి అనుబంధంగా ఎన్నో రంగాలు బాగుంటాయి రియల్ ఎస్టేట్ రంగం బాగా నడిస్తే ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ ఆదాయం పెరుగుతుందని, అలాగే సిమెంట్, స్టీల్, టైల్స్, శానిటరీ, మార్బుల్స్ వంటి అనేక రంగాలకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. వందలాది వ్యాపారాలు సజావుగా సాగుతాయి.కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మొత్తం వ్యవస్థ కుప్పకూలిపోయింది. మీరందరూ ఇంతకుముందు ఎంత ఉత్సాహంగా ఉండేవారు! కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిపోయిందని, దాని ప్రభావంతో చిన్న వ్యాపారాలు,టీ హోటళ్లు, దుకాణాలు,ఇతర అనుబంధ వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఇది ఒక్క సిద్దిపేట పరిస్థితి కాదు. రాష్ట్రం మొత్తం ఇదే పరిస్థితి. హైదరాబాద్‌లో చూసినా ఇదే, కరీంనగర్‌లో చూసినా ఇదే,నల్గొండలో చూసినా ఇదే, మహబూబ్‌నగర్‌లో చూసినా ఇదే, నిజామాబాద్‌లో చూసినా ఇదే పరిస్థితి.ఎక్కడ చూసినా వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. దుకాణాలు నడవడం లేదు. షాపులకు గిరాకీ లేదు. వ్యాపారం పూర్తిగా దెబ్బతింది.రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆర్థిక ఇబ్బందులతో వాహనాల ఈఎంఐలు కూడా చెల్లించలేక, ఫైనాన్స్ సంస్థలు వాహనాలు స్వాధీనం చేసుకుంటున్నారు. కుటుంబాలు పిల్లల ఫీజులు చెల్లించలేక, కొందరు పట్టణాలు వదిలి గ్రామాలకు వెళ్లి వ్యవసాయం చేసుకునే పరిస్థితి వచ్చింది అంటే జీవితమే రివర్స్ అయిపోయింది.

## మాజీ సీఎం కొణిజేటి రోశయ్యకు ఘన నివాళులు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 93వ జయంతి సందర్భంగా పిడుగురాళ్ల పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ నందు గల రోశయ్య కాంస్య విగ్రహానికి పట్టణానికి చెందిన ఆర్యవైశ్య నాయకులు, రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు కనిగిరి శ్రీనివాసరావు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కనిగిరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రిగా కొణిజేటి రోశయ్య అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ శ్రీనివాసరావు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలిగిరి శ్రీనివాసరావు తో పాటు పార్టీ సీనియర్ నాయకులు కొత్త సాంబశివరావు, కుటుంబరావు, పలువురు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

## పొంచి ఉన్న సూపర్ ఎల్నినో... ఆహార భద్రతకు ముప్పు తప్పదా?

**హైద్రాబాద్ జులై 4: పెన్ పవర్:** వాతావరణ పరిస్థితులు అంతకంతకు అధ్వానంగా మారుతున్నాయి. నిపుణులు 'తీవ్రస్థాయి సూపర్ ఎల్నినో ముప్పు పొంచి ఉండంటూ హెచ్చరిస్తున్నారు. ఇండియా ఇప్పటికే దాని ప్రతికూల ప్రభావాలకు గురవుతోంది. పైగా ఈ ఏడాది రుతువవన వర్షపాతం దీర్ఘకాలిక నగటులో 90శాతమే ఉంటుందని భారత వాతావరణశాఖ అంచనా వేసింది. ఇంతకీ దేశంపై ఎల్నినో ప్రభావం ఎలా ఉండనుంది? దాన్ని సమర్థంగా ఎదుర్కోవడమెలా? వసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో కొన్నాళ్లకిందట తటస్థంగా ఉన్న 'ఎల్నినో-నదరన్ అసిలేషన్' పరిస్థితులు ఎల్నినో పరిస్థితులుగా మారుతున్నట్లు ప్రభుత్వం అంచనా వేసింది. మన దేశంలో నైరుతి రుతుపవనాల కాలంలో ఎల్నిు పరిస్థితులు ఏర్పదేందుకు అవకాశం ఉన్నట్లు భారత ఉష్ణమండల వాతావరణ అధ్యయన సంస్థ (ఐఐటీఎం), భారత వాతావరణ శాఖ(ఐఎండీ) పేర్కొన్నాయి. ఇతర అంతర్జాతీయ వాతావరణ నమూనాల అంచనాలూ ఇదే సూచిస్తున్నాయి. ప్రస్తుతం హిందూ మహాసముద్రంలో కనిపిస్తున్న తటస్థ ద్విధ్రువ త(ఐవోడీ) పరిస్థితులు రుతుపవనాల కాలంలోనూ కొనసాగవచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అంటే, భారత్లో రుతుపవన కాలంలో ఎలి నినో ఏర్పడి, సెప్టెంబరు వరకు కొనసాగుతుందన్న నూట. దీనివల్ల వర్షపాతం గణనీయంగా తగ్గిపోయే ప్రమాదముంది. అంతవరకు మనం తీవ్రమైన వేడి, పొడి వాతావరణం, అలస్యపు వర్షాలతో కూడిన పరిస్థితులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి.

జీవనోపాధికి గట్టి దెబ్బ పసిఫిక్మహాసముద్రంలో ఏర్పడే ఎల్నినో శీతాకాలం వరకు కొనసాగవచ్చని పలు విదేశీ సంస్థలు సూచిస్తున్నాయి. ఇది మన రుతుపవనాలను తూర్పువైపు పసిఫిక్ మహాసముద్రంలోకి నెట్టే అవకాశం ఉంది. ప్రస్తుత ఉపగ్రహ డేటాను పరిశీలిస్తే, ఈ కదలిక స్పష్టంగా కనిపిస్తోంది. భారత్లో నమోదైన తీవ్రస్థాయి వడగాడ్పులు ఎల్నినో సంకేతాలేనని వాతావరణ నిపుణులు అంటున్నారు. ఈసారి వేసవిలో ఇండియా వివరీతమైన ఉష్ణోగ్రతలను చవిచూసింది. ప్రపంచంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన పది నగరాలు మన దేశంలోనే ఉన్నాయని నివేదికలు తెలిపాయి. భారత ఉపఖండంలో నగటి, రాత్రి ఉష్ణోగ్రతలు రెండూ పెరిగాయి. మరోవైపు, హిమాలయాలకు ఉత్తరాన 2000-2500 కిలోమీటర్ల పొడవైన మేమాల సమూహం ఏర్పడింది. ఇది దక్షిణ దిశగా దూసుకొచ్చి గంగా మైదాన ప్రాంతాల్లో వాతావరణ జీభత్సాన్ని సృష్టించవచ్చు. ఈ వింత వాతావరణ పరిణామాల కారణంగా ఒక్క యూపీలోనే 30కి పైగా జిల్లాలు బలమైన గాలులు, తుపానులు, భారీ వర్షాలను చూశాయి.

# రాజకీయాల్లో క్లాసిక్ 'సిండ్రోమ్'

**హైదరాబాద్, జూలై 4, పెన్ పవర్:** ఎన్నికల ఓటమి అనేది ఎంతటి అగ్రనేతలకైనా ఐదేళ్ల పాటు కమ్మేసిన అధికార అహాన్ని దించి, ఒకేసారి కళ్లు తెరిపిస్తుందనేది అక్షరాలా నిజం. నిన్నటివరకు ముఖ్యమంత్రులుగా, పవర్‌ఫుల్ మంత్రులుగా చక్రం తిప్పిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రస్తుతం ఒకే విధమైన పశ్చాత్తాప ప్రకటనలు చేయడం తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తాము అధికారంలో ఉన్నప్పుడు పార్టీని, తమను నమ్ముకుని జెండాలు మోసిన గ్రౌండ్ లెవెల్ కార్యకర్తలను తీవ్రంగా నిర్లక్ష్యం చేశామని, వారిని కలవకుండా దూరం పెట్టామని ఇద్దరు నేతలూ బహిరంగంగానే అంగీకరిస్తున్నారు. మళ్లీ మమ్మల్ని గెలిపించండి.. భవిష్యత్తులో అన్నీ మీ చేతుల మీదుగానే చేయిస్తాం.. మీరే మా సర్వస్వం అంటూ తాడేపల్లి, తెలంగాణ భవన్ వేదికలుగా క్యాడర్‌కు సరికొత్త హామీలు ఇస్తున్నారు. రాజకీయాల్లో ఇదొక క్లాసిక్ 'సింద్రోమ్'. అధికారం చేతిలో ఉన్నప్పుడు ఇటు జగన్ మోహన్ రెడ్డి కి కేవలం తన కోటరీ నేతలు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులేసర్వస్వంగా కనిపించారని పార్టీ నేతలు అంటూంటారు. అటు కేటీఆర్, కేసీఆర్ కూడా ప్రగతి భవన్ దాటి కార్యకర్తల గోడు వినే తీరిక లేకపోయింది. నాడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు చేసిన అరాచకాలు, అవినీతిని గ్రౌండ్ లెవెల్ కార్యకర్తలు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్దామన్నా కనీసం అపాయింట్‌మెంట్ దొరకని పరిస్థితి ఉండేది. కానీ, ఎప్పుడైతే జనం ఈ రెండు పార్టీలకూ ప్రతిపక్ష హోదా ఇచ్చికూర్చోబెట్టారో.. అప్పుడు వీరికి మళ్లీ కార్యకర్త ' అనే దేవుడు గుర్తొచ్చాడు. కేటీఆర్ నియోజకవర్గాల వారీగా సమీక్షలు పెడుతూ కార్యకర్తలను నిర్లక్ష్యం చేశామని..మరోసారి అలా జరగనివ్వబోమని అంటున్నారు. జగన్ మోహన్ రెడ్డి కూడా నేరుగా ఇదే మాట చెబుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా కార్యకర్తలను ట్రీట్ చేయడం అనేది అన్ని రాజకీయపార్టీల నైజం. ఓడినప్పుడు నువ్వే నా ప్రాణం అనే లీడర్లు.. గెలవగానే నువ్వెవరో నేను గుర్తుపట్టను అన్నట్లు వ్యవహరిస్తారు. ఇక్కడ లాజికల్‌గా ఆలోచించాల్సిన ప్రశ్న ఒకటి ఉంది. ఒకవేళ భవిష్యత్తులో వీరు మళ్లీ గెలిచి అధికారంలోకి వస్తే.. ఇప్పుడు చెప్తున్నట్లు అన్నీ కార్యకర్తల చేతుల్లోనే పెట్టగలరా? అంటే అది ముమ్మాటికీ అసాధ్యం, కేవలం ఒక మాయమాట మాత్రమే. ఎందుకంటే, ఏ రాజకీయ పార్టీఅయినా సరే.. క్షేత్రస్థాయి కార్యకర్తలకు, లోకల్ లీడర్లకు పూర్తిస్థాయిలో అధికారాలు బదిలీ చేస్తే, వారు స్థానికంగా చేసే పంచాయితీల వల్లే ప్రభుత్వానికి తీవ్రమైన వ్యతిరేకత వస్తుందని అధినాయకత్వం ఎప్పుడూ భయపడుతుంది. అందుకే, అధికారంలోకి రాగానే లీడర్లు మళ్లీ అధికార యంత్రాంగం ని ఆశ్రయిస్తారు, కార్యకర్తలను గేట్ల అవతలే ఉంచుతారు.దీనికి నిజమైన విరుగుడు.. కేవలం ఎన్నికల ఓటమి తర్వాత సానుభూతి కోసం పశ్చాత్తాప ప్రకటనలు చేయడం కాదు. క్రమశిక్షణతో కూడిన క్యాడర్ మైండ్ సెట్‌ను పార్టీ విధానాల ప్రకారం మొదటి నుంచీ తయారు చేయాలి. అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రభుత్వ పథకాలు, ప్రజా సమస్యలపై పోరాడేలా కార్యకర్తలకు శిక్షణ ఇవ్వాలే తప్ప.. అధికారాన్ని కేవలం ప్రత్యర్థులపై పగ సాధింపు కోసమో, వ్యక్తిగత సంపాదన కోసమో వాడుకునేలా క్యాడర్‌నురెచ్చగొట్టకూడదు. ఎప్పుడైతే పార్టీ సిద్ధాంతాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తారో.. అప్పుడు పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు అహంకారంతో వీగిపోతాయి, ఓడిపోయాక ఇలాగే లెంపలేసుకోవాల్సి వస్తుందని ఇటీవల పరిణామాలు గుర్తు చేస్తున్నాయి. జగన్, కేటీఆర్ లాంటి అగ్రనేతలు చేస్తున్న ఈ కార్యకర్తల జపం కేవలం ప్రస్తుతం చెల్లాచెదురవుతున్న తమ ఓటు బ్యాంకును, వలసపోతున్న క్యాడర్‌ను కాపాడుకునేందుకు వేస్తున్న రాజకీయ ఎత్తుగడ . కేవలం మాటలతో కాకుండా నిజంగానే పార్టీ నిర్మాణాన్ని మార్చి, ద్వితీయ శ్రేణి నాయకత్వానికి సరైన గౌరవం ఇస్తేనే.. రాబోయే ఎన్నికల్లో ఈ పశ్చాత్తాప ప్రకటనలకు కనీస మైలేజ్ లభిస్తుందని అనని రాజకీయ పార్టీల కార్యకర్తల భావన. ఇది వైసీపీ, బీఆర్ఎస్ సమస్య కాదు. అన్నిపార్టీలది. అందరూ నేర్చుకోవాల్సిందే.

# క్యాంపు కార్యాలయాలు కథేంటీ

**హైదరాబాద్, జూలై 4, పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ పార్టీ మధ్య రాజకీయ వైరం రోజురోజుకు ముదిరి పాకాన పడుతోంది. రేవంత్ విమర్శలు చేయడం.. భారత రాష్ట్ర సమితి నాయకులు ప్రతి విమర్శలు చేయడం.. పోటాపోటీగా సవాళు విసురుకోవడం.. ఇలా ఈ రెండు పార్టీల మధ్య రాజకీయ వివాదం సాగుతోంది. రేవంత్ రెడ్డి క్యాంప్ ఆఫీసుల వ్యవహారం రాజకీయ, అధికారవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి ముఖ్యమంత్రులు సచివాలయం నుంచి పనిచేస్తారు. వెసులుబాటు కోసం క్యాంప్ ఆఫీస్‌లు ఏర్పాటు చేసుకుంటారు. సహజంగా ఇంటినే క్యాంప్ ఆఫీస్‌గా మార్చుకున్న ముఖ్యమంత్రులు అనేక మంది ఉన్నారు. కానీ.. రేవంత్ రెడ్డి ఏకంగా ఐదు క్యాంపు కార్యాయాలయాలు ఏర్పాటు చేసుకోవడంపై రాజకీయ విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. భారత ప్రధాన మంత్రి మోదీకి సైతం ఇన్ని క్యాంపు కార్యాలయాలు లేవని సీనియర్ అధికారులు గుర్తు చేస్తున్నారు. మోదీకి న్యూ ఢిల్లీలో అధికారిక నివాసంతోపాటు క్యాంప్ కార్యాలయం ఒకటి ఉన్నది. కానీ.. తెలంగాణలో రేవంత్ రెడ్డికి సచివాలయంలో ప్రత్యేక కార్యాలయంతోపాటు.. జూబ్లీహిల్స్ నివాసంలో క్యాంప్ కార్యాలయం ఉంది. ఈ రెండూ కాకుండా జూబ్లీహిల్స్ డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం (ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ)లో ఒక కార్యాలయం నిర్మించారు. ఇక బంజారాహిల్స్ పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సైతం ఒక కార్యాలయం ఏర్పాటు చేశారు. తాజాగా రంగారెడ్డి జిల్లాలో నిర్మించ తలపెట్టిన భారత్ ఫ్యూచర్ సిటీలో ఒక కార్యాలయం ఏర్పాటు చేయడం గమనార్హం. అంటే.. మొత్తంగా ఆయనకు ఐదు అధికారిక కార్యాలయాలు ఉన్నాయి.రేవంత్ రెడ్డి ఇటీవల కాలంలో భారత రాష్ట్ర సమితి మీద విమర్శల జోరు పెంచారు. ప్రతి సభలోను గణాంకాలతో సహా విమర్శలు చేస్తున్నారు. వీటికి గులాబీ పార్టీలో కీలక నేతగా ఉన్న కేటీఆర్ గట్టిగానే కౌంటర్ ఇస్తున్నారు. అయితే ఇటీవల కేటీఆర్ ఒక కీలక ఆరోపణ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని కేటీఆర్ తీవ్రస్థాయిలో ఎండగట్టారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాదాపు 200 కోట్లు ఖర్చుతో కొత్త క్యాంపు కార్యాలయం నిర్మిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్ నగరంలో ఇప్పటికే ప్రగతిభవన్ ఉందని.. అది అందుబాటులో ఉండగానే రేవంత్ రెడ్డి 200 కోట్లతో కొత్త కార్యాలయాన్ని నిర్మిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. కేవలం కొత్త భవనం చుట్టూ రక్షణ గోడ నిర్మించడానికి 19 కోట్లు ఖర్చు పెడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు.. అంతేకాకుండా ముఖ్యమంత్రి తన సతీమణితో కలిసి కొత్త భవనంలోకి అర్ధరాత్రి పూట గృహప్రవేశం చేశారని కేటీఆర్ ఆరోపించారు. అంత అర్ధరాత్రి పూట దొంగచాటుగా వెళ్లాల్సిన అవసరం ఏముందని కేటీఆర్ రేవంత్ రెడ్డిని ఉద్దేశించి విమర్శించారు.గతంలో కూడా గులాబీ పార్టీకి అనుకూలంగా పనిచేసే సోషల్ మీడియా విభాగాలు రేవంత్ రెడ్డి నిర్మిస్తున్న భవనానికి సంబంధించిన ఫోటోలను బయటపెట్టాయి. అప్పట్లో కూడా గులాబీ పార్టీ రేవంత్ రెడ్డి నిర్మిస్తున్న భవనం మీద విమర్శలు చేసింది. అసలు ఎందుకు ఈ స్థాయిలో భవన నిర్మించాలో చెప్పాలని డిమాండ్ చేసింది.

మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావుకు కూడా ఇన్ని క్యాంప్ కార్యాలయాలు అప్పట్లో లేవని సీనియర్ అధికారులు అంటున్నారు. ఆయనను మించి రేవంత్ రెడ్డి క్యాంప్ ఆఫీసులను ఏర్పాటు చేసుకుంటున్నారని పేర్కొంటున్నారు. ఆయన వెసులుబాటు రీత్యా ఎక్కడికక్కడ క్యాంపు కార్యాలయాలు పెట్టుకున్నా.. అక్కడి సమీక్షలకు వెళ్లటానికి సీనియర్ అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రేవంత్ రెడ్డి ఏ పూట ఎక్కడ ఉంటారు? ఏ సమావేశం ఎక్కడ పెడతారు? అనే ఆదుర్దాను.. ఉన్నతాధికారులతో పాటు ఆయనను కలవాలనుకునే నాయకులు సైతం నిత్యం ఎదుర్కొంటున్నారని సీనియర్ అధికారుల చర్చించుకుంటున్నారు. ఎక్కడ సమీక్ష ఉంటే అక్కడికి అధికారులు కట్టగట్టుకుని పోవాల్సి వస్తున్నదని అంటున్నారు. పైగా నిత్యం ఈ కార్యాలయాల్లో మెయింటనెన్స్ సైతం ఉంటుందని గుర్తు చేస్తున్నారు. ఇన్ని బదులు.. సచివాలయం లేదా అధికారిక క్యాంప్ కార్యాలయంలో సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తే ప్రభుత్వ నిధుల ఆదాతో పాటు మంత్రులు, ఉన్నతాధికారుల సమయం ఆదా అవుతుందని ఒక రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వ్యాఖ్యానించారు.

**మోదీకి రెండే కార్యాలయాలు..**

న్యూఢిల్లీ రైసినా హిల్స్ సేవాతీర్థ్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి అధికారిక కార్యాలయం ఉంది. లోక కళ్యాణ్ మార్గ్‌లో ప్రధాన మంత్రి అధికారిక నివాసం (క్యాంప్ ఆఫీసు) ఉంది. ఈ రెండు తప్ప అదనంగా ఆయనకు ఎక్కడా కార్యాలయాలు లేవు. తెలంగాణకు రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కే చంద్రశేఖర్ రావుకు కూడా సచివాలయం ఆరో అంతస్తులో కార్యాలయం ఉంది. బేగంపేటలోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్ (ప్రగతి భవన్) అధికారిక నివాసం ఉండేది. తన పదవీకాలంలో సచివాలయం బదులు ఎక్కువగా ప్రజా భవన్‌లోనే మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ ఉండేవారు. ఇది సచివాలయానికి సమీపంలో ఉండటంతో ఉన్నతాధికారులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులకు అంతగా ఇబ్బంది ఉండేది కాదని ఒక రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వ్యాఖ్యానించారు. మిగతా సమయం ఎక్కువగా సిద్దిపేట జిల్లాలోని ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో గడిపేవారు.కేసీఆర్ వ్యవహార శైలిపై గడీల పాలన అంటూ విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి.. ముఖ్యమంత్రి అయిన తర్వాత సచివాలయానికి వస్తారని చాలా మంది అధికారులు భావించారు. కానీ దానికి భిన్నంగా పరిస్థితులు ఉన్నాయన్న చర్చలు వినిపిస్తున్నాయి. అది కూడా ఏకంగా ఐదు కార్యాలయాల నుంచి విధులు నిర్వహిస్తుండటంపై రాజకీయ పరిశీలకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయంలోని ఆరో అంతస్తులో సీఎం రేవంత్ రెడ్డికి కార్యాలయంతోపాటు.. సీఎంవో అధికారులకు ప్రత్యేక చాంబర్లు ఏర్పాటు చేశారు. కానీ.. మంత్రివర్గ సమావేశాలు ఉన్నప్పుడు తప్ప ఇతర సమయాల్లో సీఎం సచివాలయానికి రావడం లేదు. మరో విశేషం ఏమిటంటే.. కనీసం వారానికి ఒకటి రెండుసార్లు కూడా రాకపోయినా.. ఆరో అంతస్తులో సాధారణ పౌరులు, మీడియా ప్రతినిధులకు ప్రవేశాన్ని నిషేధించడంపై మీడియా వర్గాల్లో తరచూ చర్చ సాగుతోంది. ముందస్తు అనుమతులు ఉంటే తప్ప ప్రవేశం లేకుండా చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో సీ బ్లాక్‌లో సీఎం కార్యాలయానికి ప్రజా ప్రతినిధులు, సాధారణ పౌరులు, అధికారులు, మీడియా ప్రతినిధులు వెళ్లి వస్తుండేవారు. కానీ.. ఇప్పుడు అటు వైపు వెళ్లడం అసాధ్యంగా మారింది.

**మాజీ సీఎం కేసీఆర్ బాటలోనే రేవంత్ రెడ్డి...**

నూతన సచివాలయం నిర్మాణం చేసిన తరువాత కేసీఆర్ హయాంలో అమలు అయిన విధానాలనే రేవంత్ రెడ్డి కూడా కొనసాగిస్తుండటంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణ ప్రజలే కాదు.. పార్టీ కార్యకర్తలు, నాయకులు సైతం తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ హయాలో గడీల పాలన, నియంత, ఫామ్‌హౌస్ సీఎం అని పలు రకాలుగా విమర్శించి మనం చేస్తున్నది ఏమిటి? అంటూ పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు అంతర్గత సంభాషణల్లో మండిపడుతున్నారు. ప్రగతి భవన్ ముందు రోడ్డుపై ఉన్న ఇనుప కంచెను బద్దలు చేశామని చెప్పుకొంటున్న రేవంత్ రెడ్డి... సచివాలయం, మిగతా కార్యాలయాల్లో చేస్తున్నదేమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యమంత్రిగా మంత్రులు, ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలి. అలా కాకుండా ఏ రోజు ఏ సమయంలో ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితిని తీసుకువచ్చారనే అభిప్రాయాలు ఐఏఎస్ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఒకరోజు పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, మరో రోజు ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్, జూబ్లీహిల్స్ అధికారిక నివాసంలో సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే పరిపాలన కొనసాగిస్తే గత సీఎం కేసీఆర్ మాదిరి అపఖ్యాతి పాలు కావడం ఖాయమని, ప్రజలకు సమాధానం చెప్పుకోలేని దుస్థితి ఎదురవుతుందని నాయకులు వాపోతున్నారు. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా క్యాంప్ కార్యాలయాల పై స్పష్టమైన నిర్ణయం తీసుకుని అందరికీ అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని కోరుతున్నారు.మళ్లీ ఇప్పుడు కేటీఆర్ రంగంలోకి దిగి గృహప్రవేశం చేశారని రేవంత్ రెడ్డి మీద ఆరోపణలు చేసిన నేపథ్యంలో.. కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా కౌంటర్ ఇస్తుందో చూడాలి. ఒకవేళ భవనం నిర్మించకపోతే కాంగ్రెస్ పార్టీ ఈ పాటికే ఎదురుదాడి చేసేది. కానీ కాంగ్రెస్ పార్టీ నిశ్శబ్దంగా ఉందంటే ఏదో జరుగుతోందనే అనుకోవాలని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# చిన్నారుల కోసం పెద్ద హృదయం... ‘గిఫ్ట్ ఆఫ్ లైఫ్’ ఇనిషియేటివ్ హైలైట్!

**హైదరాబాద్ పెన్ పవర్:** సిద్దిపేట జిల్లా కొండపాకలోని శ్రీ సత్యసాయి సంజీవని సెంటర్ ఫర్ చైల్డ్ హార్ట్ కేర్ హాస్పిటల్‌లో ఒక అద్భుతమైన మానవీయ వేడుక జరిగింది. నిరుపేద చిన్నారులకు ఏకంగా 500 ఉచిత గుండె ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ‘గిఫ్ట్ ఆఫ్ లైఫ్’ కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు, టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ ముఖ్య అతిథులుగా హాజరై, చిన్నారులతో సరదాగా గడుపుతూ అందరిలోనూ కొండంత ధైర్యాన్ని నింపారు.





**కొండపాకలో ‘గిఫ్ట్ ఆఫ్ లైఫ్’ వేడుక:**
శ్రీ సత్యసాయి సంజీవని ఆసుపత్రి నిరుపేద కుటుంబాల్లోని గుండె జబ్బులతో బాధపడుతున్న పిల్లల పాలిట ఒక దేవాలయంగా మారింది. రూపాయి ఖర్చు లేకుండా 500 మంది చిన్న పిల్లలకు గుండె సర్జరీలు పూర్తి చేయడం ఒక పెద్ద రికార్డు. ఈ మైల్‌స్టోన్‌ను సెలబ్రేట్ చేయడానికి నిర్వహించిన ఈ ప్రోగ్రామ్‌లో హరీష్ రావు, విజయ్ దేవరకొండ సందడి చేశారు. ఇద్దరూ కలిసి హాస్పిటల్ అంతా తిరిగి రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

**పిల్లల పెయింటింగ్‌కు ఫిదా:**
హాస్పిటల్‌లో ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న చిన్నారులతో హరీష్ రావు, విజయ్ దేవరకొండ చాలా ఆప్యాయంగా మాట్లాడారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ కాసేపు సరదాగా గడిపారు. ఈ క్రమంలో ఒక చిన్నారి స్వయంగా వేసిన అందమైన పెయింటింగ్‌ను చూసి వీరిద్దరూ ఫిదా అయిపోయారు. ఆ పాప టాలెంట్‌ను మెచ్చుకుంటూ స్పెషల్‌గా అభినందించారు. ఈ దృశ్యాలు అక్కడ ఉన్న వారి హృదయాలను హత్తుకున్నాయి.

**సర్టిఫికెట్ల అందజేత:**
ఆపరేషన్ చేయించుకుని పూర్తిగా కోలుకున్న చిన్నారులకు హరీష్ రావు, విజయ్ దేవరకొండ చేతుల మీదుగా “గిఫ్ట్ ఆఫ్ లైఫ్” సర్టిఫికెట్లను, బహుమతులను అందజేశారు. మళ్లీ కొత్త జీవితాన్ని పొందిన ఆ పిల్లల ముఖాల్లోని ఆనందం, వారి తల్లిదండ్రుల కళ్లలోని కృతజ్ఞతా భావం చూసి అతిథులు సైతం ఎమోషనల్ అయ్యారు.

**సత్యసాయి ట్రస్ట్‌పై ప్రశంసల జల్లు:**
ఈ సందర్భంగా హరీష్ రావు మరియు విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. సమాజానికి ఎంతో గొప్ప సేవ చేస్తున్న శ్రీ సత్యసాయి సంజీవని హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌ను, డాక్టర్ల బృందాన్ని మనస్ఫూర్తిగా అభినందించారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిరుపేద పిల్లలకు ఉచితంగా ప్రాణదానం చేయడం దేవుడి సేవతో సమానమని వారు కొనియాడారు. భవిష్యత్తులో ఈ హాస్పిటల్‌కు తమ వంతు సహాయసహకారాలు ఎప్పుడూ ఉంటాయని హరీష్ రావు తెలిపారు. ఇక విజయ్ మాట్లాడుతూ..ఓ వ్యక్తి నిర్ణయం వల్ల ఎన్నో గొప్ప పనులు జరుగుతాయి. ‘నేను సత్య సాయి బాబ గారి మొదలు పెట్టిన స్కూల్ లో చదువుకున్నాను ,అందుకే ఇంత స్థాయి లో వున్నాను అని ,ఇలా హెల్ప్ చేయటం ఇంతోమందికి సహాయం చేయటం గొప్ప కార్యక్రం’ అని తమ వంతు సహాయం ఉంటుందని తెలిపారు.
రాజకీయాల్లో ఫుల్ యాక్టివ్‌గా ఉండే హరీష్ రావు, సినిమాలతో బిజీగా ఉండే రౌడీ హీరో విజయ్ దేవరకొండ.. ఇలా ఒక మంచి కాజ్ కోసం కలిసి రావడం నిజంగా అభినందనీయం. వీరి రాకతో హాస్పిటల్‌లో ఉన్న చిన్నారులకు, వారి కుటుంబాలకు ఎంతో మానసిక ధైర్యం లభించింది. ఇక 500 గుండె ఆపరేషన్లు పూర్తి చేసుకుని సక్సెస్‌ఫుల్‌గా దూసుకుపోతున్న ఈ సంస్థ ముున్ముందు మరెంతో మంది చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆశిద్దాం..

# హైదరాబాద్ ఐటీ ఉద్యోగుల్లో కొత్త ట్రెండ్.. “మాఫియా నైట్స్”తో ఒత్తిడికి చెక్




**హైదరాబాద్ పెన్ పవర్:** బయట నుంచి చూసేవారికి ఐటీ ఉద్యోగం అంటే హై-ఫై లైఫ్‌స్టైల్, భారీ జీతాలు మాత్రమే కనిపిస్తాయి. కానీ లోపల ఉండే ఉద్యోగులకు మాత్రమే తెలుసు ఆ డెడ్‌లైన్లు, టార్గెట్లు, కంటిన్యూస్ మీటింగ్‌లు, కార్పొరేట్ పాలిటిక్స్ తెచ్చే మానసిక ఒత్తిడి ఎలాంటిదో.. నిత్యం కంప్యూటర్ స్క్రీన్లకు అతుక్కుపోయి మెదడుకు తీవ్రమైన పనిచెప్పే టెక్కీలు.. ఆ స్ట్రెస్‌ను దూరం చేసుకోవడానికి ఒకప్పుడు జిమ్‌లు, వీకెండ్ ట్రిప్‌లు, పబ్‌లను ఆశ్రయించేవారు. అయితే ఇప్పుడు హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో సరికొత్త ట్రెండ్ నడుస్తోంది. అదే “మాఫియా నైట్స్”. కేవలం వీకెండ్స్‌లోనే కాకుండా.. వర్క్ అవర్స్ ముగిసిన తర్వాత కూడా ఈ సరికొత్త గేమ్ సెషన్లు టెక్కీలను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి.

**ఇంతకీ ఏంటి ఈ “మాఫియా నైట్స్”?**
పేరు వినగానే ఇదేదో క్రైమ్ నెట్‌వర్క్ అనుకుంటే పొరపాటే.. ఇది పూర్తిగా మైండ్ గేమ్‌లతో కూడిన ఒక సోషల్ గ్రూప్ యాక్టివిటీ. సాధారణంగా 10 నుండి 24 మంది వరకు సభ్యులు ఒక గ్రూప్‌గా ఏర్పడి ఈ గేమ్ ఆడుతుంటారు. ఇందులో పాల్గొనే ప్రతి ఒక్కరికీ కొన్ని ప్రత్యేకమైన కల్పిత పాత్రలను కేటాయిస్తారు. మాఫియా డాన్ , గ్యాంగ్ అంటూ వీరు రహస్యంగా గ్రూప్‌లోని ఇతరులను ఎలిమినేట్ చేయడానికి ప్లాన్ చేస్తారు. పోలీస్ , డిటెక్టివ్ లంటూ మాఫియా ముఠా ఎవరో కనిపెట్టే బాధ్యత వీరిది. డాక్టర్ రోల్ అనేది బాధితులను కాపాడే పాత్ర. సాధారణ పౌరులు తమ లాజికల్ థింకింగ్‌తో అసలైన నేరస్థులను పట్టుకోవాల్సి ఉంటుంది. ఒకరిపై ఒకరు అనుమానాలు వ్యక్తంచేస్తూ, ఒకరినొకరు బ్లఫ్ చేసుకుంటూ, తీవ్రమైన చర్చలు, లాజికల్ ఆర్గ్యుమెంట్లతో ఈ గేమ్ సాగుతుంది. ఇందులో గెలుపోటముల కంటే.. ఆడే విధానం, అందులో ఉండే సస్పెన్స్ అందరికీ పిచ్చ పిచ్చగా నచ్చేస్తున్నాయి.

**నైపుణ్యాలకు పదును.. నెట్‌వర్కింగ్‌కు ప్లస్**
ఈ గేమ్ కేవలం టైమ్‌పాస్ వినోదం మాత్రమే కాదు.. ఐటీ ఉద్యోగుల్లోని వ్యక్తిగత నైపుణ్యాలను మెరుగుపరచడానికి కూడా ఉపయోగపడుతోందని నిపుణులు చెబుతున్నారు. ఈ గేమ్ ఆడటం వల్ల టీమ్‌వర్క్ ,కమ్యూనికేషన్ పెరుగుతుంది. సహోద్యోగులతో లేదా కొత్త వ్యక్తులతో సమర్థవంతంగా మాట్లాడటం, టీమ్‌గా పనిచేయడం అలవాటవుతుంది. అవతలి వ్యక్తి అబద్ధం చెబుతున్నాడా, నిజం చెబుతున్నాడా అని వారి బాడీ లాంగ్వేజ్ ఆధారంగా పరిశీలించే నైపుణ్యం పెరుగుతుంది. గంటల తరబడి కోడింగ్, ప్రెజెంటేషన్ల మధ్య నలిగిపోయే మైండ్‌కు ఇది పూర్తి విరామాన్ని ఇచ్చి, ఒత్తిడిని మాయం చేస్తుంది.

**ఐటీ హబ్‌లలో జోరుగా ఈవెంట్స్**
ప్రస్తుతం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, మాదాపూర్ వంటి ప్రధాన ఐటీ కేంద్రాల్లో ఈ “మాఫియా నైట్స్” ట్రెండ్ జోరుగా సాగుతోంది. కొందరు ఐటీ ఉద్యోగులు తమ ఫ్రెండ్స్ సర్కిల్‌తో ప్రైవేట్‌గా కెఫేలలో లేదా ఫ్లాట్స్‌లో ఈ గేమ్స్ అరేంజ్ చేసుకుంటుంటే.. మరికొందరు ప్రొఫెషనల్ ఈవెంట్ ఆర్గనైజర్ల ద్వారా ఈ సెషన్లలో జాయిన్ అవుతున్నారు.
పెరుగుతున్న ఈ డిమాండ్‌ను బట్టి హైదరాబాద్‌లో ప్రత్యేకంగా “మాఫియా నైట్ క్లబ్స్”, కమ్యూనిటీ గ్రూప్స్ కూడా వెలుస్తున్నాయి. వారాంతాల్లో ఎలాంటి ఆల్కహాల్, లౌడ్ మ్యూజిక్ లేకుండా.. కేవలం మాటలు, నవ్వులు, మైండ్ గేమ్‌లతో హెల్తీగా ఎంజాయ్ చేయడానికి ఇదొక బెస్ట్ ప్లాట్‌ఫామ్‌గా మారిందని టెక్కీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
మొత్తానికి ఐటీ ఉద్యోగుల్లో మానసిక ఆరోగ్యం పై అవగాహన పెరుగుతున్న తరుణంలో.. ఇలాంటి వినోదాత్మక, సామాజిక కార్యక్రమాలు మెరుగైన ఫలితాలను ఇస్తున్నాయి. ప్రస్తుతం ఐటీ రంగానికి పరిమితమైన ఈ “మాఫియా నైట్స్” ట్రెండ్, మెల్లమెల్లగా ఇతర రంగాల ఉద్యోగులను, యువతను సైతం ఆకట్టుకుంటూ నగరంలో ఒక కొత్త సోషల్ కల్చర్‌కు తెరలేపుతోంది.

# కాంగ్రెస్ లో యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు చిచ్చు

**నల్గొండ, జూలై 4, పెన్ పవర్:** యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ నూతన ట్రస్ట్ బోర్డు నియామక వ్యవహారం తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర దుమారం రేపుతోంది. బుధవారం ప్రభుత్వం ప్రకటించిన ఈ బోర్డు నియామకాలు పార్టీ అంతర్గత విభేదాలను ఒక్కసారిగా రోడ్డుపైకి తెచ్చాయి. ఉమ్మడి నల్గొండ జిల్లా సీనియర్ నేతలను, పార్టీ సొంత క్యాడర్‌ను సంప్రదించకుండా ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాలపై గాంధీభవన్‌తో పాటు సోషల్ మీడియా వేదికగా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారం చివరకు న్యూఢిల్లీలోని పార్టీ అధిష్టానానికి అధికారిక ఫిర్యాదుల రూపంలో చేరడం గమనార్హం.ఈ నియామకాలపై మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఏకంగా ఒక టీవీ ఛానల్ లైవ్‌లోనే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేలను, కీలక నేతలను కనీసం సంప్రదించకుండా ప్రభుత్వం ఈ బోర్డును ఎలా ఖరారు చేస్తుందని ఆయన బహిరంగంగానే తప్పుపట్టారు. ఏళ్ల తరబడి కాంగ్రెస్ జెండా మోసిన ఒరిజినల్ కాంగ్రెస్ నేతలకు ప్రాధాన్యత లేదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీలో హాట్ టాపిక్‌గా మారాయి.మరోవైపు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను సైతం ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయలేదనే ప్రచారం జరుగుతోంది. దేవాలయాల వ్యవహారాలతో నేరుగా సంబంధం ఉండే అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కూడా సంప్రదించకుండానే ఈ జాబితాను ఖరారు చేశారని, దేవాదాయ శాఖ మంత్రిని పక్కనబెట్టడం వల్లే ఈ వివాదం మరింత ముదిరిందని కాంగ్రెస్ అంతర్గత వర్గాల్లో గట్టిగా చర్చ నడుస్తోంది. ప్రభుత్వం, పార్టీల
మధ్య కనీస సమన్వయం లోపించిందనే దానికి ఈ పరిణామాలే నిదర్శనమని విమర్శకులు అంచనా వేస్తున్నారు.ట్రస్ట్ బోర్డులో వినోద్ వెంకటస్వామిని చేర్చడంపై పార్టీ శ్రేణుల్లో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే వారి కుటుంబంలో వివేక్ వెంకటస్వామికి కీలక పదవులు ఉండటం, ఆయన కొడుకు ఎంపీగా విజయం సాధించడం గమనార్హం. ఇలాంటి తరుణంలో మళ్లీ అదే కుటుంబానికి చెందిన వినోద్ వెంకటస్వామికి పవిత్రమైన యాదగిరిగుట్ట బోర్డులో స్థానం కల్పించడం ఏంటని, పార్టీ కోసం రక్తం చిందించిన ఇతర సీనియర్లను ఎందుకు విస్మరించారని కొందరు నేతలు ప్రశ్నిస్తున్నారు.అన్నింటికంటే ముఖ్యంగా, మాజీ బీఆర్ఎస్ ఎంపీ సోదరుడైన సత్యనారాయణ రెడ్డిని ఈ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌గా నియమించడంపై కాంగ్రెస్ పాతకాపులు భగ్గుమంటున్నారు. దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడిన నాయకులను పక్కనబెట్టి, నిన్నగాక మొన్న పార్టీ మారిన వారికి, బీఆర్ఎస్ నేపథ్యం ఉన్నవారికి ఇలాంటి ఉన్నతమైన, ప్రతిష్టాత్మకమైన పదవులు కట్టబెట్టడం ఏంటనే ఆవేదన పార్టీ క్యాడర్‌లో వ్యక్తమవుతోంది.మరోవైపు ప్రముఖ నటుడు చిరంజీవి భార్య కొణిదెల సురేఖను బోర్డు మెంబర్‌గా నియమించడం రాజకీయంగా సరికొత్త వివాదానికి దారితీసింది. ఆంధ్రప్రదేశ్‌తో బలమైన మూలాలు, సంబంధాలు ఉన్న ఆమెను తెలంగాణలోని అత్యంత పవిత్రమైన, ప్రతిష్టాత్మకమైన ఆలయ
బోర్డులో ఎలా నియమిస్తారంటూ సోషల్ మీడియా వేదికగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికతను, తెలంగాణ సెంటిమెంట్‌ను దెబ్బతీసేలా ఈ నిర్ణయం ఉందంటూ కొందరు నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్షాలకు ఆయుధంగా మారేలా ఈ నియామకం ఉందనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది.మొత్తంగా చూస్తే, యాదగిరిగుట్ట ఆలయ బోర్డు నియామకాల వ్యవహారం తెలంగాణ కాంగ్రెస్‌లో పెద్ద చిచ్చే పెట్టింది. అసంతృప్త నేతలకు పార్టీ అధిష్టానం సీరియ స్‌గా తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలుస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో రేగిన మంటలు చల్లారేలా కనిపించడం లేదు. మరి ఈ అంతర్గత సంక్షోభాన్ని ప్రభుత్వం, పార్టీ పెద్దలు ఎలా సర్దుబాటు చేస్తారో వేచి చూడాలి.

# 19 జిల్లాల్లో పత్తి విత్తనాలు ఫ్రీ

**నల్గొండ జూలై 4, పెన్ పవర్:** తెలంగాణలో పత్తి రైతులకు శుభవార్త.. ఉచితంగా విత్తనాల పంపిణీ ప్రారంభమైంది. జాతీయ ఉత్పాదకత పథకంలో 19 జిల్లాల ఎంపిక చేయగా.. రైతు వేదికల్లో పంపిణీ చేయనున్నారు. రైతులకు విత్తనాలతో పాటుగా ప్లాంట్ గ్రోత్ నియంత్రకాలు, మందులు కూడా ఇస్తారు. కేంద్రం 60శాతం, రాష్ట్రం 40శాతం భరించి సబ్సిడీపై ఈ విత్తనాలను ఉచితంగా రైతులకు ఇస్తున్నారు.తెలంగాణలో రైతులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. రాష్ట్రంలోని 19 జిల్లాల రైతులకు ఉచితంగా పత్తి విత్తనాలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఎంసీపీ (జాతీయ పత్తి ఉత్పాదకత పథకం) ఉచితంగా నోటిఫైడ్ బీటీ హైబ్రిడ్ పత్తి విత్తనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రైతులకు పంపిణీ చేయనున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఎంసీపీ పథకం కింద ప్రతిపాదనలు పంపగా.. పత్తి ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచే దిశగా 19 జిల్లాలను విత్తనాల పంపిణీ కోసం ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ కోదండరెడ్డి, విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డిలు అధికారులతో కలిసి పత్తి విత్తనాల ప్యాకెట్లను పంపిణీ చేశారు.
రాష్ట్రంలోని 19 జిల్లాల్లో విత్తనాలు పంపిణీ ప్రారంభిస్తారు. రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నల్గొండ, ఖమ్మం, జనగామ, వరంగల్, నారాయణపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, జోగులాంబ గద్వాల, కరీంనగర్, నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లోని రైతు వేదికల్లో విత్తనాలను పంపిణీ చేస్తారు. ఈ మేరకు రైతులు పత్తి విత్తనాల పంపిణీ విషయాన్ని గమనించాలి.రాష్ట్ర విత్తన సరఫరా సంస్థ ద్వారా ఈ 19 జిల్లాలో ఒక్కో రైతుకు గరిష్ఠంగా 2.5 ఎకరాల చొప్పున విత్తనాలు పంపిణీ చేస్తారు. ఈ లెక్కన చూస్తే మొత్తం 1,27,374 ఎకరాలకు సంబంధించి 50,950 మంది రైతులకు 6.33 లక్షల ప్యాకెట్ల పత్తి విత్తనాలను అందజేయనున్నారు. ఈ పత్తి విత్తనాలకు సంబంధించి.. కేంద్రం 60శాతం, రాష్ట్రం 40శాతం చొప్పున మొత్తం రూ.57.02 కోట్ల సబ్సిడీని భరిస్తున్నాయి. రైతులకు పత్తి విత్తనాలతో పాటుగా ప్లాంట్ గ్రోత్ నియంత్రకాలు, వేప నూనె వంటి మందులను రాయితీపై రైతులకు అందిస్తామని అధికారులు చెబుతున్నారు.
తెలంగాణ ప్రభుత్వం టీఎస్ఎస్వోసీఏ (సీడ్, ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ)లో ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. మొత్తం 19 సీడ్ సర్టిఫికేషన్ అధికారుల పోస్టుల భర్తీ కోసం టీజీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 7 నుంచి ఆగస్టు 12 వరకు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అక్టోబర్‌లో రాతపరీక్ష ఉంటుంది. ఈ ఉద్యోగాల కోసం అభ్యర్థుల వయోపరిమితి 18-44 ఏళ్లు ఉండాలని నిర్ణయించారు. ఈ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకునేవారు ఐసీఏఆర్ గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి అగ్రికల్చర్‌లో డిగ్రీ, సీడ్ టెక్నాలజీ, ప్లాంట్‌బ్రీడింగ్, అగ్రోనామి, ప్లాంట్ సైకాలజీలో పీజీ అగ్రికల్చర్ చదివి ఉండాలని టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌లో పేర్కొంది. టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు ఉన్నాయి.

# పాలమూరు బ్రహ్మోస్ యూనిట్ మూడు గ్రామాల్లో భూమి గుర్తింపు

**మహబూబ్ నగర్, జూలై 4 పెన్ పవర్:** రక్షణ రంగ తయారీలో తెలంగాణకు మరో భారీ అవకాశం తలుపు తడుతోంది. ప్రపంచంలోని వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణుల్లో ఒకటైన బ్రహ్మోస్‌కు సంబంధించిన తయారీ కేంద్రాన్ని మహబూబ్‌నగర్ జిల్లాలో ఏర్పాటు చేసే ప్రతిపాదనపై కదలికలు మొదలైనట్లు సమాచారం. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి, జీనుగురాల గ్రామాల సమీపంలో సుమారు 416 ఎకరాల భూమిని గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు.ఈ ప్రాజెక్టుకు తుది అనుమతులు లభిస్తే, ఇది కేవలం పాలమూరు పారిశ్రామిక ముఖచిత్రాన్నే కాకుండా తెలంగాణ రక్షణరంగ వ్యవస్థలో భారీ మార్పులు తెచ్చే పెద్ద పెట్టుబడిగా మారే అవకాశం ఉంది. ఇప్పటివరకు వ్యవసాయం, వలసలు, సాధారణ పరిశ్రమల చర్చలకే పరిమితమైన పాలమూరు ప్రాంతం.. రక్షణ తయారీ రంగంలో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందే అవకాశాన్ని ఈ ప్రతిపాదన తెచ్చిపెట్టింది.బ్రహ్మోస్ వంటి అత్యంత సున్నితమైన రక్షణ తయారీ ప్రాజెక్టులకు భద్రత, భూమి లభ్యత, రోడ్డు కనెక్టివిటీ, విమానాశ్రయానికి చేరువ, ఇప్పటికే ఉన్న సాంకేతిక పర్యావరణం వంటి అంశాలు కీలకం. దేవరకద్ర ఈ కోణాల్లో అనుకూలంగా ఉందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.ప్రతిపాదిత స్థలం జాతీయ రహదారి 44కి సమీపంలో ఉంది. హైదరాబాద్‌ను బెంగళూరుతో కలిపే ఈ మార్గం దేశంలో అత్యంత ముఖ్యమైన రవాణా కారిడార్లలో ఒకటి. అలాగే శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సుమారు 100 కిలోమీటర్ల దూరంలో ఉండటం కూడా లాజిస్టిక్స్ పరంగా ప్రయోజనకరంగా భావిస్తున్నారు.హైదరాబాద్‌లో రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు సంబంధించిన సంస్థలు ఇప్పటికే బలంగా ఉన్నాయి. ప్రత్యేకించి డిఆర్డిఎల్ పక్కన ఇప్పటికే బ్రహ్మోస్ ఇంటెగ్రేషన్ కాంప్లెక్స్ ఉంది. ఇక్కడ క్షిపణులకు వివిధ వ్యవస్థలతో అనుసంధానించే పని జరుతుంది. అదేకాకుండా, ల్యాబ్స్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, మిధాని, నూూ కార్యకలాపాలు, ప్రైవేట్ ఏరోస్పేస్ కంపెనీలు తెలంగాణకు బలమైన పునాది కల్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు దగ్గరగా, విస్తారమైన భూమి అందుబాటులో ఉండే మహబూబ్‌నగర్‌ను విస్తరణ కేంద్రంగా చూడవచ్చన్న అభిప్రాయం ఉంది.దేవరకద్ర మండలంలోని చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి, జీనుగురాల పరిసరాల్లో భూమిని పరిశీలించినట్లు తెలుస్తోంది. పరిశ్రమల శాఖ స్థాయిలో భూమి గుర్తింపు, ప్రాథమిక సౌకర్యాల పరిశీలన, ప్రాజెక్టు అనుకూలతపై కసరత్తు జరిగినట్లు సమాచారం.భూమి సుమారు 400 నుంచి 416 ఎకరాల మధ్య ఉండొచ్చని చెబుతున్నారు. రక్షణ తయారీ యూనిట్‌కు ప్రధాన ఉత్పత్తి ప్రాంతం మాత్రమే కాకుండా, పరీక్షలు, నిల్వ, భద్రతా వలయం, రవాణా సౌకర్యాలు, అనుబంధ పరిశ్రమల కోసం కూడా విస్తారమైన స్థలం అవసరం అవుతుంది. అందుకే ఇలాంటి ప్రాజెక్టులకు పెద్ద భూప్రాంతం అవసరం అవుతుంది.అయితే ఈ దశలో ప్రాజెక్టు ఇంకా ప్రతిపాదన, స్థల పరిశీలన, అనుమతుల దశలోనే ఉంది. కేంద్ర రక్షణ శాఖ, బ్రహ్మోస్ ఏరోస్పేస్ రాష్ట్ర ప్రభుత్వం స్థాయిల్లో తుది నిర్ణయాలు పూర్తయ్యాకే నిర్మాణంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.బ్రహ్మోస్ యూనిట్ ప్రతిపాదనతో తెలంగాణ రక్షణ తయారీ పటంలో మరింత ప్రాధాన్యం పొందే అవకాశం.బ్రహ్మోస్ అనేది భారత్--రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేసిన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి వ్యవస్థ. భారత , రష్యాకు చెందిను భాగస్వామ్యంతో బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఏర్పడింది. బ్రహ్మపుత్ర, మోస్క్వా నదుల పేర్ల నుంచి ‘బ్రహ్మోస్’ అనే పేరు వచ్చింది.ఈ క్షిపణిని భూమి, సముద్రం, గగనం, జలాంతర్గామి వేదికల నుంచి ప్రయోగించవచ్చు. వేగం, ఖచ్చితత్వం, వివిధ వేదికల నుంచి ప్రయోగించగల సామర్థ్యం కారణంగా బ్రహ్మోస్ భారత రక్షణ వ్యవస్థలో కీలకమైన ఆయుధంగా గుర్తింపు పొందింది.ఇటీవలి సంవత్సరాల్లో బ్రహ్మోస్ కేవలం భారత సైనిక సామర్థ్యానికే కాకుండా, రక్షణ ఎగుమతులకూ ముఖ్యమైన ఉత్పత్తిగా మారింది. ఫిలిప్పీన్స్‌కు బ్రహ్మోస్ వ్యవస్థల ఎగుమతి ఒప్పందం తర్వాత, ఈ క్షిపణి అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా భారత తయారీ సామర్థ్యానికి ప్రతీకగా నిలిచింది. ప్రస్తుతం యూఏఈ కూడా ఈ వ్యవస్థను కొనుగోలు చేయాలనే ఆసక్తితో ఉందనే వార్తలు వస్తున్నాయి.ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో బ్రహ్మోస్ ఇంటిగ్రేషన్ అండ్ టెస్టింగ్ ఫెసిలిటీఇప్పటికే ప్రారంభమైంది. ఆ యూనిట్‌లో అసెంబ్లీ, ఇంటిగ్రేషన్, టెస్టింగ్ వంటి కీలక ప్రక్రియలు జరుగుతున్నాయి. లక్నో యూనిట్ ప్రారంభం తర్వాత బ్రహ్మోస్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, సరఫరా గొలుసును బలపరచడం, దేశీయ రక్షణ తయారీని విస్తరించడం వంటి అంశాలపై కేంద్రం దృష్టి పెట్టింది. తెలంగాణలో కొత్త యూనిట్‌పై చర్చలు జరగడం సహజమైన పరిణామంగా పరిశ్రమ వర్గాలు చూస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్‌లో ఇప్పటికే ఉన్న రక్షణ, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, మెటీరియల్స్, ప్రెసిషన్ ఇంజినీరింగ్ సామర్థ్యాలు ఈ ప్రతిపాదనకు బలం చేకూరుస్తున్నాయి.ప్రాథమిక అంచనాల ప్రకారం ఈ ప్రాజెక్టుకు ప్రారంభ దశలో సుమారు ?500 కోట్ల పెట్టుబడి రావొచ్చని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. రక్షణ తయారీ యూనిట్‌లు సాధారణ పరిశ్రమల కంటే భిన్నంగా ఉంటాయి. భద్రతా ప్రమాణాలు, నాణ్యత పరీక్షలు, ప్రత్యేక పరికరాలు, అధునాతన తయారీ సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరం అవుతాయి.ఈ యూనిట్ ఏర్పడితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,500 నుంచి 2,000 ఉద్యోగాలు రావొచ్చని అంచనా. తయారీ, ఇంజినీరింగ్, నాణ్యత నియంత్రణ, లాజిస్టిక్స్, భద్రత, మెయింటెనెన్స్, పరిపాలన, అనుబంధ సేవల రంగాల్లో ఉపాధి అవకాశాలు ఏర్పడే వీలుంది.దీంతో పాటు చిన్న, మధ్య తరహా అనుబంధ పరిశ్రమలకు కూడా కొత్త అవకాశాలు తెరుచుకోవచ్చు. రక్షణ తయారీ రంగంలో ఒక్క ప్రధాన యూనిట్ వచ్చినా, దానికి సరఫరా చేసే భాగాలు, సామాగ్రి, పరికరాలు, ఎలక్ట్రానిక్స్, ప్యాకేజింగ్, రవాణా వంటి రంగాల్లో స్థానిక వ్యాపారాలకు అవకాశం పెరుగుతుంది.మహబూబ్‌నగర్ జిల్లా చాలా కాలంగా వలసల జిల్లాగా గుర్తింపు పొందింది. సాగునీటి ప్రాజెక్టులు, రోడ్డు కనెక్టివిటీ, హైదరాబాద్‌కు చేరువ, కొత్త పెట్టుబడులతో ఈ ప్రాంతం గత కొన్నేళ్లుగా మార్పు దశలో ఉంది. బ్రహ్మోస్ వంటి హై-టెక్ రక్షణ తయారీ యూనిట్ ఇక్కడికి వస్తే, అది కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాదు.. ప్రాంతీయ అభివృద్ధికి కొత్త మలుపు అవుతుంది.దేవరకద్ర పరిసరాల్లో మౌలిక వసతులు మెరుగుపడే అవకాశం ఉంది. రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా, భద్రతా వ్యవస్థలు, కార్మికులకు నివాసాలు, శిక్షణా కేంద్రాలు, విద్యా సంస్థలు, చిన్న వ్యాపారాలు పెరగొచ్చు. హోటళు ,, రవాణా, రియల్ ఎస్టేట్, సేవా రంగాలకూ దీని ప్రభావం ఉండే అవకాశం ఉంది.

**తెలంగాణకు డిఫెన్స్ క్లస్టర్ అవకాశం**
తెలంగాణ ఇప్పటికే దేశంలోని ముఖ్యమైన ఏరోస్పేస్, డిఫెన్స్ కేంద్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. హైదరాబాద్ పరిసరాల్లో డీఆర్డీఓ ల్యాబ్స్, బీడీఎల్, మిధానీ, ఈసీఐఎల్,హెచ్ ఏఎల్ కార్యకలాపాలు, అంతర్జాతీయ ఏరోస్పేస్ సంస్థల భాగస్వామ్యాలు ఉన్నాయి. ప్రైవేట్ రంగంలో కూడా ప్రెసిషన్ ఇంజినీరింగ్, డ్రోన్స్, ఏరోస్ట్రక్చర్స్, రక్షణ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో సంస్థలు పెరుగుతున్నాయి.ఈ పరిస్థితుల్లో మహబూబ్‌నగర్‌లో బ్రహ్మోస్ యూనిట్ ఏర్పడితే, హైదరాబాద్‌కు దక్షిణంగా కొత్త రక్షణ తయారీ వలయం ఏర్పడే అవకాశం ఉంది. హైదరాబాద్--మహబూబ్‌నగర్--బెంగళూరు మార్గం భవిష్యత్తులో డిఫెన్స్, ఏరోస్పేస్ తయారీకి మరింత కీలకంగా మారవచ్చు.అయితే ఈ ప్రాజెక్టు అమలు విషయంలో ఇంకా కీలక దశలు మిగిలే ఉన్నాయి. భూమి బదలాయింపు, పర్యావరణ అనుమతులు, భద్రతా అనుమతులు, కేంద్ర రక్షణ శాఖ ఆమోదం, బ్రహ్మోస్ ఏరోస్పేస్ తుది నిర్ణయం వంటి అంశాలు పూర్తయ్యాకే ప్రాజెక్టు నిర్మాణ దశకు వెళ్లే అవకాశం ఉంటుంది.రక్షణ రంగ ప్రాజెక్టులు సాధారణ పరిశ్రమల మాదిరిగా వేగంగా ప్రకటించి వెంటనే ప్రారంభించే విధంగా ఉండవు. భద్రత, వ్యూహాత్మక అవసరాలు, సరఫరా వ్యవస్థ, భూమి స్థితి, సాంకేతిక అవసరాలు అన్నీ సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ముందడుగు పడుతుంది.ప్రతిపాదన తుది ఆమోదం పొందితే, ఇది తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో ముఖ్యమైన మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది. ఒకవైపు రాష్ట్రానికి భారీ పెట్టుబడి, మరోవైపు పాలమూరుకు ఉపాధి అవకాశాలు, ఇంకోవైపు దేశ రక్షణ తయారీ సామర్థ్యానికి కొత్త బలం లభించవచ్చు.హైదరాబాద్ ఇప్పటికే సాంకేతిక, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో బలమైన స్థానం సంపాదించింది. ఇప్పుడు ఆ బలం మహబూబ్‌నగర్ దిశగా విస్తరిస్తే, తెలంగాణ రక్షణ తయారీ పటంలో మరింత స్పష్టంగా కనిపించే రోజు దూరంలో ఉండకపోవచ్చు


## విజయనగరంలో రియల్ జోరు...

**విజయనగరం జూలై 4, పెన్ పవర్:** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రానుంది. మరి కొద్ది రోజుల్లోనే ప్రారంభోత్సవంతో జాతికి అంకితం చేయనున్నారు ప్రధాని నరేంద్ర మోడీ. దాదాపు పనులన్నీ పూర్తి కావడంతో ప్రారంభోత్సవానికి ముస్తాబయింది. ఉత్తరాంధ్ర తలరాతను మార్చబోతోంది ఈ విమానాశ్రయం. అయితే ఎయిర్పోర్ట్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. విజయనగరం జిల్లా సరిహద్దులతోపాటు భోగాపురం చుట్టుపక్కల పది కిలోమీటర్ల పరిధిలో భూములతో పాటు ఇళ్ల స్థలాలు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. రియల్ ఎస్టేట్ రంగంలో ఇన్వెస్టర్లు పెట్టుబడి పెట్టేందుకు భారీగా ముందుకు వస్తున్నారు.సాధారణంగా వెంచర్లలో ప్లాట్లు విక్రయిస్తుంటారు. కానీ భోగాపురంలో ఓపెన్ ప్లాట్ల వెంచర్ల స్థానంలో.. సరికొత్తగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కమర్షియల్ విల్లా ప్రాజెక్టులు, లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలు వెలుస్తున్నాయి. ఎయిర్పోర్ట్ కారిడార్ ఆనుకొని ఉన్న జాతీయ రహదారికి ఇరువైపులా.. వందల ఎకరాల్లో ఆధునిక టౌన్షిప్ ల నిర్మాణాలు ఊపందుకున్నాయి. విమానాశ్రయ కార్యకలాపాలు ప్రారంభమైతే.. ఈ ప్రాంతం ఒక పెద్ద ఎకానమిక్ హబ్ గా మారనుంది. ప్రధానంగా ప్రీమియం నివాస గృహాలకు, కమర్షియల్ స్పేస్ కు డిమాండ్ విపరీతంగా పెరిగింది.ఉత్తరాంధ్రలో వలసలు ఎక్కువ. ఆపై చదువుకున్న వారు సైతం విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ముఖ్యంగా గల్ఫ్ దేశాలలో స్థిరపడిన వారు ఉన్నారు. అటువంటి వారంతా భోగాపురం పరిసర ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఉన్నత రంగాల్లో స్థిరపడిన వారు మాత్రం కమర్షియల్ విల్లాలు, లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలు కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు. ప్లాట్ లతోపాటు వెళ్లాలని ముందుగానే బుక్ చేసుకుంటున్నారు. తమ సొంత గడ్డపై అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం పక్కనే స్థిరాస్తి కలిగి ఉండడాన్ని గొప్పగా భావిస్తున్నారు. భవిష్యత్తులో కూడా ధర పెరుగుతుందన్న ఆశతో ఎక్కువ మంది కొనుగోలు చేస్తున్నారు.ఒక్క భోగాపురం మాత్రమే కాదు విజయనగరం జిల్లాలోని రెండు మూడు నియోజకవర్గాలతో పాటు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం లో సైతం రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకుంటుంది భోగాపురం విమానాశ్రయ నిర్మాణంతో. భూములతో పాటు ఇళ్ల స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు కూడా భారీగా జరుగుతున్నాయి. ఉత్తరాంధ్రలోని ఉమ్మడి మూడు జిల్లాలకు ప్రధాన కేంద్రంగా మారనుంది భోగాపురం. భవిష్యత్తులో భోగాపురం ఒక నగరంగా అవతరించనుంది. వారం వారం ఇక్కడి చదరపు గజం ధరలు మారుతుండడంతో స్థానిక రైతులు, భూ యజమానులకు ఊహించని రీతిలో ఆర్థిక ప్రయోజనం చేకూరుతోంది

## డీజీ రైతు బజార్లకు భారీ స్పందన

**విశాఖపట్టణం, జూలై 4 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాంభించిన డీజీ రైతుబజార్లకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. డీజీ రైతు బజార్లలో నామమాత్రంగా డెలివరీ ఛార్జీల వసూలు చేస్తున్నారు. దీంతో వినియోగదారుల నుంచి ఆదరణ పెరుగుతోంది. జూన్ నెలలో ఆర్డర్లు 5,800 దాటాయి.. దీంతో నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో ఈ డీజీ రైతు బజార్లను విస్తరిస్తామని అధికారులు చెబుతున్నారు. విశాఖ మాత్రమే కాదు రాష్ట్రంలోని పలు నగరాలు, పట్టణాలలో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజల కోసం వినూత్న ఆలోచన చేసింది.. ఇంటికే కూరగాయల్ని హోం డెలివరీ చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన నగరాలు, పట్టణాల్లో డీజీ రైతు బజార్లను ప్రారంభించింది. మార్కెటింగ్ శాఖ ప్రారంభించిన ఈ రైతు బజార్లకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. విశాఖపట్నం ఎంవీపీ కాలనీలో గతేడాది డిసెంబర్‌లో రైతు బజార్‌ను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఆ తర్వాత మధురవాడ, గాజువాక, గోపాలపట్నం, నరసింహనగర్‌లో ఏర్పాటు చేశారు. నగరంలోని ఐదు డీజీ రైతుబజార్ల నుంచి జూన్ నెలకు సంబంధించి 5,800కుపైగా హోం డెలివరీలు చేశారు. నగరంలో కేవలం 10 నిమిషాల్లోనే కూరగాయలు చేరవేస్తుండటంతో ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది.డీజీ రైతు బజార్లలో తాజా, నాణ్యమైన కూరగాయలను ప్రజలు అందిస్తున్నారు. కూరగాయల్ని చేరవేసేందుకు డెలివరీ బాయ్స్‌ను నియమించారు.. రోజుకు 12 గంటల పాటూ సేవలు అందిస్తున్నారు. వీరికి నెలకు రూ.19 వేల జీతం ఇస్తున్నారు. డెలివరీ బాయ్స్ ఆర్డర్ రాగానే కూరగాయల్ని గ్రేడింగ్ చేసి హోం డెలివరీ చేస్తున్నారు. ఒకవేళ కూరగాయలు నాణ్యంగా లేకపోతే మళ్లీ మార్చి ఇస్తారు. దీంతో ప్రజల నుంచి ఆదరణ పెరిగిందని చెబుతున్నారు. ఈ డీజీ రైతు బజార్ల నుంచి ఐదు కిలో మీటర్ల వరకు మాత్రమే ఈ సేవలు అందిస్తున్నారు. అందుకే కేవలం 10 నిమిషాల్లోనే కూరగాయాలు వినియోగదారులకు అందుతున్నాయి.కూరగాయలు హోం డెలివరీ చేసినందుకు నామమాత్రపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఒక్కో ఆర్డర్‌కు కిలోమీటర్‌కు రూ.1 డెలివరీ ఛార్జ్.. హ్యాండ్లింగ్ ఛార్జీల కింద రూ.10 వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు రూ.100కు కూరగాయలు ఆర్డర్ పెడితే రూ.115 (రూ.100 కూరగాయలుంఐదు కిలోమీటర్లకు రూ.5 డెలివరీ ఛార్జ్ంహ్యాండ్లింగ్ ఛార్జ్ రూ.10) వసూలు చేస్తారు. ప్రతి రోజూ ఉదయం 7 నుంచి రాత్రి 7గంటల వరకు ఈ డీజీ రైతు బజార్ల సేవలు అందుబాటులో ఉంటాయి. ప్రజల నుంచి మంచి ఆదరణ పెరగడంతో నగరంలోని మరికొన్ని చోట్ల రైతు బజార్లను విస్తరిస్తామని అధికారులు చెబుతున్నారు. కూరగాయలతో పాటుగా నిత్యావసర సరుకులు కూడా అందజేస్తున్నాము అంటున్నారు. డెలివరీ బాయ్స్ కూడా ఈ సేవలపై సంతృప్తితో ఉన్నారు.

## వదిలి పెట్టను.. కోర్టుకు వెళ్తా: కవిత డెసిషన్




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రక్షణ సేన(టీఆర్ ఎస్) అధ్యక్షురాలు కవిత సంచలన ప్రకటన చేశారు. తను పెట్టుకున్న కొత్త పార్టీకి టీఆర్ ఎస్ పేరును నిరాకరిస్తూ.. కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన తాఖీదులపై ఆమె స్పందించారు. ఈ వ్యవహా రాన్ని ఇక్కడితో వదిలేసి లేదని ఆమె స్పష్టం చేశారు. దీనివెనుక కుట్రలు జరుగుతున్నాయని.. గతంలో కోర్టుకు వెళ్లిన తర్వాతే.. తమకు టీఆర్ ఎస్ పేరు వచ్చిందన్నారు. ఇప్పుడు కూడా తాముకోర్టును ఆశ్రయిస్తామని కవిత వెల్లడించారు.

### బీఆర్ ఎస్‌పై పరోక్షంగా..

ఈ సందర్భంగా బీఆర్ ఎస్ పార్టీపై కవిత పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘానికి అభ్యంతరాలు ఎవరు పంపించారో తనకు తెలుసునని కవిత చెప్పారు. ఇవన్నీ.. తాము నిశితంగా పరిశీలిస్తామన్నారు. ఎన్నికల సంఘ ఒత్తిడి చేసినట్టుగా తాము వ్యవహరించలేమన్నారు. పార్టీ విషయంపై తాము ఇప్పటికే పలు వివరణలు ఇచ్చామని కవిత చెప్పారు. అయినప్పటికీ పేరును తిరస్కరించడం సమంజసం కాదని అన్నారు. ఇప్పటికే ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించి విజయం దక్కించుకున్నామని తెలిపిన కవిత.. మరోసారి కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు.

### పేరుతోనే గుర్తింపా?

ఇదిలావుంటే, ఈ మొత్తం వివాదంలో కవిత –పేరు– కోసం పాకులాడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. టీఆర్ ఎస్ పేరుతో నే తనకు మైలేజీ వస్తుందన్న భావనలోనే ఆమె ఉన్నట్టు తెలుస్తోందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం గ్రామీణ స్థాయిలో బీఆర్ ఎస్ కంటే కూడా.. టీఆర్ఎస్ పేరుకే ప్రధానంగా గుర్తింపు ఉంది. ఈ పేరుతోనే ప్రజలకు పార్టీ కూడా పరిచయం అయింది. దీంతో ఇప్పుడు పార్టీ పేరుతోనే ముందుకు సాగాలన్నది కవిత ఆలోచన. అందుకే .. ఆ పేరు కోసమే పట్టుబడుతున్నారన్న వాదన ఉంది. కానీ.. పేరుకంటే కూడా.. ఇమేజే రాజకీయాల్లో నాయకులకు దోహదపడుతుంది. ఈ విషయంలో కవిత పునరాలోచన చేయాలని కొందరు సూచిస్తున్నారు.

# అవినీతిలో భీమిరెడ్డి బాహుబలి

**హైదరాబాద్ పెన్ పవర్:**
ఆయన పేరు భీమిరెడ్డి.. తెలంగాణ పోలీస్ శాఖలో డిఎస్పి. డిజిపి ఆఫీసులో స్టేషనరీ వింగ్లో పనిచేస్తూ ఉంటారు. ఈయన ఇంట్లో తెలంగాణ అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు మొదలుపెట్టారు. భారీగా సోదాలు చేశారు. ఈ సోదాలలో ఏకంగా వందల కోట్ల ఆస్తులను అవినీతి నిరోధక శాఖ అధికారులు గుర్తించారు.పోలీస్ శాఖలో ఈ స్థాయిలో అక్రమ సంపాదన ఉంటుందా అని ఏసీబీ అధికారులు నోటి మీద వేలుసుకుంటున్నారు. అసలు ఇంతటి సంపాదన ఎలా సాధ్యమంటూ ఆశ్చర్యపోతున్నారు. భీమ్ రెడ్డికి మొత్తం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాలలో ఆస్తులు ఉన్నాయి. హైదరాబాద్.. వికారాబాద్.. జహీరాబాద్.. గచ్చిబౌలి.. రంగారెడ్డి.. శంషాబాద్ ప్రాంతాలలో భారీగా ఆస్తులు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ప్రాంతాలలో పోలీసులు ప్రత్యేకంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ తనిఖీల సమయంలో పోలీసులకు ఒక డైరీ లభించింది. ఆ డైరీలో భీమిరెడ్డికి సంబంధించిన బినామీల చిట్టా ఉన్నట్టు సమాచారం. ఆ బినామీలలో దాదాపు 15 మంది దాకా ఉన్నట్టు తెలుస్తోంది.భీమ్ రెడ్డికి సంబంధించిన ఒక బినామీ ఇంట్లో నుంచి ఏసీబీ అధికారులు వేగంగా 40 లక్షల వరకు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా.. ఇతర రాష్ట్రాలలో కూడా భీమిరెడ్డి భారీగా పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది. గచ్చిబౌలి ప్రాంతంలో అత్యంత విలాసవంతమైన బహుళ అంతస్తుల భవనాన్ని తన కూతురి పేరు మీద భీమిరెడ్డి కొనుగోలు చేశారు. బెంగళూరుకు దగ్గరగా ఉన్న ఓ ప్రాంతంలో ఏకంగా ఎకరం భూమి ఉన్నట్టు తెలుస్తోంది. దీని విలువ కూడా భారీగా ఉన్నట్టు సమాచారం. ఓపెన్ ప్లాట్లు.. సాగు భూములు కూడా భీమిరెడ్డి పేరు మీద ఉన్నట్టు తెలుస్తోంది. అంతేకాదు అనేక రకాల ల్యాండ్ డాక్యుమెంట్లను కూడా ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బంగారాన్ని కూడా భారీగా కూడబెట్టినట్టు ప్రచారం జరుగుతోంది.భీమిరెడ్డి అక్రమ సామ్రాజ్యం అత్యంత పెద్దదిగా ఉంది. బ్యాంకు లాకర్లు మాత్రమే కాకుండా.. బినామీ ఖాతాలు కూడా ఉన్నాయి. ఈ ఆస్తులను మొత్తం లెక్కించడానికి ఇంకా రెండు నుంచి మూడు రోజుల వరకు పట్టే అవకాశం ఉంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# సవాళ్ల నుంచి 'రాజీనామా'ల వరకు.. తెలంగాణ రాజకీయం!






**హైదరాబాద్ పెన్ పవర్:** సవాళ్ల నుంచి 'రాజీనామా'ల వరకు.. తెలంగాణ రాజకీయం!.మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన సవాల్‌కు ప్రతిగా.. మాజీ మంత్రి హరీష్‌రావు లేఖ రాశారు. బీఆర్ ఎస్ హయాంలో ఆర్థిక శాఖ మంత్రిగా వ్యవహరించిన ఆయన అప్పట్లో ఎంత అప్పులు చేశారు. తెలంగాణలో రాజకీయాలు రోజుకో విధంగా మలుపులు తిరుగుతున్నాయి. గురువారం రోజు రోజంతా సవాళ్ల రాజకీయం నడి చింది. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ కీలక నాయకుల మధ్య ఈ సవాళ్లు దుమ్మురేపాయి. చర్చలకు సిద్ధమం టూ ఇరు పక్షాల్లోని నాయకులు మాటల మంటలు రేపారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి.. ఇరు పక్షాలను శాంతింప చేసే ప్రయత్నం చేశారు. అయినా.. ఎవరూ వెనక్కి తగ్గలేదు. ఈ క్రమంలోనే హరీష్‌రావును అరెస్టు చేసి తర్వాత వదిలి పెట్టారు. అయితే.. శుక్రవారం నాటికి ఈ వ్యవహారం యూటర్న్ తీసుకుంది.మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన సవాల్‌కు ప్రతిగా.. మాజీ మంత్రి హరీష్‌రావు లేఖ రాశారు. బీఆర్ ఎస్ హయాంలో ఆర్థిక శాఖ మంత్రిగా వ్యవహరించిన ఆయన అప్పట్లో ఎంత అప్పులు చేశారు.. అనే విషయాలను వివరించారు. తమ హయాంలో 4 లక్షల కోట్ల రూపాయలు మాత్రమే అప్పులు చేశామని తెలిపారు. వాటిని కూడా అభివృద్ధి ప్రాజెక్టులకే ఖర్చులు చేశామన్నారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం వారు చేసిన అప్పులను కూడా తమపై రుద్దుతున్నారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం 3.5 లక్షల కోట్లను కేవలం రెండున్నరేళ్లలోనే తీసుకువచ్చిందని హరీష్‌రావు ఆరోపించారు.

కాంగ్రెస్ హయాంలో చేసిన అప్పులను కూడా తమ ఖాతాలో వేస్తున్నారని ఆరోపించిన హరీష్ రావు.. చర్చలకు రాకుండా తప్పించుకున్నప్పుడు సవాళ్లు చేయడం ఎందుకని జూపల్లిని ప్రశ్నించారు. ఇక, ఈ లేఖపై జూపల్లి స్పందిస్తూ.. తాను చెప్పిన విషయాలే నిజమని వ్యాఖ్యానించారు. దీనిలో ఏమాత్రం పసలేదని అన్నారు. తాను చెప్పిన లెక్కలకే కట్టుబడి ఉన్నానని తెలిపారు. ఒకవేళ తన లెక్కలు తప్పని హరీష్‌రావు ఆధారాలతో సహా నిరూపిస్తే.. మంత్రి పదవికి రాజీనామా చేస్తానని తెలిపారు. ఈ విషయంలో మరో మాటేలేదని జూపల్లి వివరించారు.త్యాగాలతో వచ్చిన రాష్ట్రాన్ని సొంత లాభానికి వాడుకున్న చరిత్ర బీఆర్ ఎస్ నేతల సొంతమని జూపల్లి విమర్శించారు. బీఆర్ ఎస్ హయాంలో 8 లక్షల కోట్ల రూపాయలకుపైగానే అప్పులు చేశారని మరోసారి చెప్పారు. ఈలెక్కలు తప్పయితే.. మాజీ సీఎం కేసీఆర్‌తోనే ఆ విషయాన్ని చెప్పించాలని అన్నారు. రాష్ట్రాన్ని, ప్రజల సొమ్మును కూడా దోచుకున్నారని ఆరోపించారు. హరీష్ రావు సవాల్ చేయడమే తప్పు.. దానికి కట్టుబడి ఉండే మనిషి కాదని అన్నారు. బీఆర్ ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల పాలైందని మళ్లీ మళ్లీ చెబుతున్నానని.. కాదని నిరూపిస్తే.. తన పదవికి రాజీనామా చేస్తానని సవాల్ రువ్వారు.

# 2029 నయా పాలసీతో టీడీపీ

**గుంటూరు, జూలై 4, పెన్ పవర్:**
తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి అనేక మంది నాయకులకు రాజకీయంగా ఎదిగే అవకాశాలను కల్పించింది. ఈ పార్టీ నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు మాత్రమే కాకుండా లోక్‌సభ స్పీకర్ కేంద్ర మంత్రులు గవర్నర్లు ముఖ్యమంత్రులువంటి కీలక పదవులను కూడా పలువురు నాయకులు అధిరోహించారు. అందుకే ప్రాంతీయ పార్టీల్లో టీడీపీకి ప్రత్యేక రాజకీయ చరిత్ర ఉందని రాజకీయ వర్గాలు భావిస్తుంటాయి. 2024 ఎన్నికల్లో పార్టీ పెద్ద ఎత్తున యువ నాయకులకు, కొత్త ముఖాలకు అవకాశం కల్పించింది. గ్రామస్థాయి ప్రజాప్రతినిధులుగా పనిచేసిన వారు, పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలు కష్టపడిన నాయకులు కూడా ఈసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వీరిలో చాలామంది ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ నియోజకవర్గాల్లో చురుకుగా పనిచేస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే మరికొందరు మాత్రం ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత ప్రజలకు దూరమవుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో టీడీపీ అధిష్ఠానం తమ పార్టీ ఎమ్మెల్యేల పనితీరును సమగ్రంగా సమీక్షిస్తున్నట్లు సమాచారం. ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పురోగతి, ప్రజల సమస్యలపై స్పందన, పార్టీ కార్యకర్తలతో సమన్వయం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు వంటి అంశాలపై ప్రత్యేకంగా నివేదికలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. టెలికాన్ఫరెన్స్‌లు, సమీక్షా సమావేశాలు, ప్రత్యక్ష చర్చల ద్వారా ఎమ్మెల్యేలకు ఎప్పటికప్పుడు మార్గదర్శకాలు కూడా అందిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.అయితే అన్ని సూచనలు ఇచ్చినా కొందరు ఎమ్మెల్యేల పనితీరులో ఆశించిన మార్పు కనిపించడం లేదని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వివిధ వర్గాల నుంచి వచ్చిన నివేదికలు, క్షేత్రస్థాయి సమాచారం, పార్టీ అంతర్గత పరిశీలన ఆధారంగా కొంతమంది ప్రజాప్రతినిధులపై అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కేవలం హెచ్చరికలతో సరిపెట్టకుండా ఇకపై క్రమశిక్షణ చర్యలపై కూడా దృష్టి పెట్టే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక పెన్షన్ కార్యక్రమానికి ప్రజల్లో మంచి స్పందన లభిస్తోంది. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు సహా వివిధ వర్గాలకు భారీ మొత్తంలో పెన్షన్లు అందిస్తున్న నేపథ్యంలో, వాటి పంపిణీ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు స్వయంగా పాల్గొని ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకత్వం కోరుతున్నట్లు సమాచారం. కానీ కొందరు ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ముఖ్యంగా తొలిసారి గెలిచిన కొంతమంది ఎమ్మెల్యేలలో ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు తగ్గడం, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజలకు వివరించకపోవడం వంటి అంశాలను పార్టీ సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. అవసరమైతే ఆయా నియోజకవర్గాల్లో ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని కూడా ప్రోత్సహించే ఆలోచనలో ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.ఉత్తరాంధ్ర, గోదావరి , కోస్తా ఆంధ్ర , రాయలసీమ ( ప్రాంతాల్లోని కొన్ని నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సమాచారం. ప్రజలతో నిరంతరం మమేకమై పనిచేసే నాయకులకే భవిష్యత్తులో ప్రాధాన్యం ఉంటుందనే సంకేతాలను పార్టీ అధిష్ఠానం ఇస్తోందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

### రెండు ఎమ్మెల్సీలు ఎవరికి

ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సందడి మొదలవ్వబోతోంది. ఈ నెలలో గవర్నర్ నామినేటెడ్ కోటాలో రెండు ఎమ్మెల్సీ పదవులు ఖాళీ అవుతున్నాయి. ఈ నెల 28తో శాసనమండలికి గవర్నర్ కోటాలో ఎన్నికైన శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ జాకియా ఖానం, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు పదవీకాలం పూర్తవుతోంది. ఈ రెండు పదవుల భర్తీపై టీడీపీ అధిష్ఠానం ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ఈ పదవులు ఎవరెవరికి ఇవ్వాలనే అంశంపై కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం. ఎమ్మెల్సీ పదవుల రేసులో టీడీపీ నుంచి పలువురి పేర్లు తెరపైకి వస్తున్నాయి.గవర్నర్ నామినేటెడ్ కోటాలో ఖాళీ అవుతున్న రెండు ఎమ్మెల్సీ పదవుల్లో ఒకదానికి టీడీపీ సీనియర్ నేత వర్ల రామయ్య పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. మరో పదవి రాయలసీమకు కేటాయిస్తారనే టాక్ వినిపిస్తోంది. ఇటీవల ఈ ఇద్దరు నేతలు రాజ్యసభ ఎంపీ పదవులు ఆశించారు.. కానీ కొన్ని సామాజిక సమీకరణాలు, రాజకీయపరమైన అంశాలతో అవకాశం దక్కలేదు. అందుకే వీరిద్దరికి ఎమ్మెల్సీ పదవులు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. వీరిద్దరితో పాటుగా మరికొన్ని పేర్లు వినిపిస్తున్నా.. అధిష్ఠానం ఎవరివైపు మొగ్గు చూపుతుందనే ఆసక్తికరంగా మారింది.టీడీపీ సీనియర్ నేత వర్ల రామయ్య రెండుసార్లు రాజ్యసభకు వెళ్లాలని ఆశపడ్డారు. పార్టీ అధిష్ఠానం కూడా ఆయన పేరును పరిశీలించింది.. కానీ చివరి నిమిషంలో ఆయనకు అవకాశం దక్కలేదు. ఇప్పుడు ఆయన్ను గవర్నర్ కోటాలో శాసనమండలికి పంపించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. రెండో స్థానానికి రాయలసీమకు చెందిన మరో నేత పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఆయన కూడా రాజ్యసభ ఎంపీ పదవి కోసం ప్రయత్నాలు చేశారు.. కానీ అవకాశం దక్కలేదు. అందుకే ఆయన పేరును కూడా పరిశీలిస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఒకవేళ ఆయనకు ఛాన్స్ రాకపోతే రాయలసీమకు చెందిన బీసీ నేతల్లో ఒకరికి పదవి ఇచ్చే అవకాశాలు ఉన్నాయంటున్నారు.వీరిద్దరు మాత్రమే కాదు.. ఎన్నికల తర్వాత నుంచి ఎమ్మెల్సీ పదవుల రేసులో మరికొందరు నేతలు ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా, మాజీ మంత్రి దేవినేని ఉమా, మాజీ ఎమ్మెల్యే పిఠాపురం వర్మ, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌లు కూడా పదవులు ఆశిస్తున్నారు. వంగవీటి రాధాకు ఎమ్మెల్సీ పదవి ఇస్తారని రెండేళ్లుగా ప్రచారం జరుగుతోంది.. కానీ ఆయనకు ఇప్పటి వరకు పదవి దక్కలేదు. వంగవీటి రాధాకు గవర్నర్ నామినేటెడ్ కోటాలో పదవి వస్తుందని కొంతమంది సోషల్ మీడియాలో చర్చించుకుంటున్నారు. ఇక మాజీ మంత్రి దేవినేని ఉమా, మాజీ ఎమ్మెల్యేలు వర్మ, కొమ్మాలపాటి శ్రీధర్‌లు గత ఎన్నికల్లో టికెట్ ఆశించినా దక్కలేదు.. దీంతో వీరు కూడా ఎమ్మెల్సీ పదవులు ఆశిస్తున్నారు. మరి టీడీపీ అధిష్ఠానం ఎవరికి ఛాన్స్ ఇస్తుందన్నది చూడాలి.

# మాడుగుల హల్వా కావాలా...వైసీపీ ఏం చేయాలంటే ?



**హైదరాబాద్ పెన్ పవర్:** అనకాపల్లి జిల్లాలో కీలకమైన సీటుగా మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం ఉంది. ఈ సీటు గొప్పతనం ఏంటి అంటే టీడీపీకి దశాబ్దాలుగా కట్టుబడిపోయింది. టీడీపీ ఆవిర్భవించాక ఏడు సార్లు మాడుగులలో టీడీపీ గెలిచింది. అందులో అయిదు సార్లు రెడ్డి సత్యనారాయణ ఎమ్మెల్యేగా గెలిచి ఎన్టీఆర్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. టీడీపీ ముందు కూడా కాంగ్రెస్ రెండు సార్లు గెలిచింది. ప్రతిపక్షాలు ఇండిపెండెంట్లు ఈ సీట్లో గెలుస్తూ వచ్చారు. ఇక 32 ఏళ్ళ సుదీర్ఘ కాలం తరువాత 2004లో కాంగ్రెస్ మాడుగులలో గెలిచింది. మళ్ళీ 2009లో టీడీపీ గెలిచింది. 2014, 2019లలో వైసీపీ తరఫున బూడి ముత్యాలనాయుడు గెలిచారు. 2024లో మళ్ళీ టీడీపీ జెండా ఎగరేసింది.

**బూడి గట్టిగానే పట్టు :**

ఇక బూడి ముత్యాలనాయుడు జెడ్పీటీసీ నుంచి నేరుగా ఎమ్మెల్యే అయ్యారు. గ్రౌండ్ లెవెల్ లో ఆయనకు మంచి పట్టు జనంతో కలసి తిరగడం స్థానిక సమస్యల మీద అవగాహన వంటివి ఆయనను రెండు సార్లు ఎమ్మెల్యేగా చేసాయి. సామాన్యుడిగా వ్యవహరించడం కూడా ఆయనకు కలసి వచ్చిన మరో అంశం. ఇక 2024లో కూడా ఎమ్మెల్యేగా వరసగా గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని బూడి అనుకుంటున్న నేపథ్యంలో సడెన్ గా ఆయన్ని అనకాపల్లి ఎంపీగా జగన్ నిలబెట్టి ఆయన కుమార్తె జెడ్పీటీసీ అయిన బూడి అనూరాధకు మాడుగుల ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. దాంతో తండ్రీ కుమార్తె ఇద్దరూ ఓటమి పాలు అయ్యారు.

**ఈసారి చాన్స్ ఉందా :**

ఇక మాడుగులలో చూస్తే టీడీపీ నుంచి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన సీనియర్ నేత. అయినప్పటికీ ఆయన చూపు ఎక్కువగా పెందుర్తి మీద ఉంది. అది ఆయన సొంత సీటు దాంతో 2029 లో తన కుమారుడిని అక్కడ నిలబెట్టి రాజకీయ వారసుడిగా తీర్చిదిద్దాలని చూస్తున్నారు. మాడుగుల టీడీపీలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ఉన్నారు. అలాగా ఇతర నేతలు కూడా ఉన్నారు. వీరంతా ఎవరికి వారుగా వచ్చే ఎన్నికల్లో సీటు కోసం ప్రయత్నం చేస్తున్నారు. మాడుగులలో టీడీపీ పరిస్థితి ఇలా ఉంటే వైసీపీ విషయం తీసుకుంటే బూడి నెమ్మదించారు అని అంటున్నారు.

**జగన్ దిశా నిర్దేశం :**

ఇటీవల తాడేపల్లి వెళ్ళిన బూడి ఆయన కుమార్తె అనూరాధలకు పార్టీని పటిష్టం చేయమని జగన్ దిశా నిర్దేశం చేశారు అని అంటున్నారు. టీడీపీకి బలమైన స్థావరంగా ఉన్న మాడుగులలో గెలవడం అంటే వైసీపీకి కత్తి మీద సాము అని అంటున్నారు. పార్టీ బాగా యాక్టివ్ కావాల్సి ఉందని అంటున్నారు. అంతే కాదు బూడి ముత్యాలనాయుడు వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి అయితేనే వైసీపీకి మళ్ళీ పూర్వ వైభవం వస్తుందని అంటున్నారు. అయితే ఆయన తన కుమార్తె అనూరాధకు టికెట్ ఇప్పించుకోవాలని చూస్తున్నారు అని అంటున్నారు. అందుకే ఆయన రాజకీయంగా కొంత చురుకు తగ్గించారు అని కూడా అంటున్నారు. అయితే జనాల్లో మాత్రం బూడి పట్ల అభిమానం సానుభూతి ఉన్నాయని ఆయన కనుక పోటీకి దిగితే టీడీపీకి టఫ్ గా ఉంటుందని అంటున్నారు. ఆయన ప్లేస్ లో కుమార్తెని నిలబెడితే మాత్రం సైకిల్ స్పీడ్ అందుకుంటుందని కూడా అంటున్నారు. మరి ఈ విషయంలో వైసీపీ అధినాయకత్వం ఎలా ఆలోచిస్తుంది అన్నది చూడాల్సి ఉంది అని అంటున్నారు. మాడుగుల హల్వా కావాలంటే వైసీపీ చేయాల్సింది బోలెడు ఉందని కూడా సూచనలు వస్తున్నాయి.

# మారుతోన్న రాయలసీమ

**కర్నూలు, జూలై 4, పెన్ పవర్:**

రాయలసీమ నుంచి ఎంతోమంది ముఖ్యమంత్రులు వచ్చారు. రాయలసీమ కేంద్రంగా ఎందరో రాజకీయాలు చేశారు. కానీ ఆ స్థాయిలో రాయలసీమ మాత్రం అభివృద్ధి చెందలేదు. కానీ కూటమి వచ్చిన తరువాత రాయలసీమ రూపురేఖలు మారుతున్నాయి. దశాబ్దాలుగా కేవలం కాగితాలకే పరిమితమై, రాజకీయ శంకుస్థాపనల డ్రామాతో విసిగిపోయిన కడప స్టీల్ ప్లాంట్ వ్యవహారంలో ఎట్టకేలకు ఒక బలమైన ముందడుగు పడింది. కడప స్టీల్ ప్లాంట్ కు శ్రీకారం చుట్టనున్నారు. ఇది కేవలం కొబ్బరికాయలు కొట్టే మరో సాంప్రదాయక భూమి పూజ కాదు. పక్కాగా నిర్మాణ పనుల ప్రారంభోత్సవం. జిందాల్ ఆధ్వర్యంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ తొలి దశ ఉత్పత్తిని అత్యంత వేగంగా అందుబాటులోకి తెచ్చేలా ఒక లక్ష్యాన్ని పెట్టుకున్నారు. ఇది నిజంగా రాయలసీమ చరిత్రలో సువర్ణ అధ్యాయం. ఒకప్పుడు ఫ్యాక్షన్ రాజకీయాలతో వివాదాల మయంగా మారిన రాయలసీమ.. ఇప్పుడు పారిశ్రామికంగా.. రాయల పరిశ్రమల సీమగా రూపాంతరం చెందుతూ ఉండడం శుభపరిణామం. ఉత్పత్తి రంగానికి సంబంధించిన పరిశ్రమలు రాయలసీమలో ఏర్పాటు అవుతున్నాయి. అయితే ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా నిలబెట్టడంలో శ్రీ సిటీ కీలక పాత్ర పోషించింది. గ్లోబల్ కంపెనీలకు క్యారాఫ్ అడ్రస్ గా మారింది. గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ జరుగుతున్న పరిశ్రమల జాతర ఒక ఎత్తు అయితే.. ఇటీవల ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ రంగాల్లో వచ్చిన పెట్టుబడులు మరో ఎత్తు. రాయల్ ఎన్ఫీల్డ్, హీరో మోటో కార్ప్ వంటి దిగ్గజ సంస్థలు రాయలసీమలో వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో తమ ప్లాంట్లను నిర్మించాయి. వేలాదిమంది స్థానిక యువతకు, గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పించాయి. గతంలో వచ్చిన కియా మోటార్స్ అనంతపురం జిల్లాలో పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించింది. అయితే ప్రస్తుతం శ్రీ సిటీ ఉమ్మడి చిత్తూరు జిల్లా పారిశ్రామిక వైభవానికి సరికొత్త కేంద్రంగా మారింది. అన్నింటికీ మించి రాయలసీమ గ్రీన్ ఎనర్జీ రంగంలో దేశంలోనే టాప్ హబ్ గా మారింది. కర్నూలు, నంద్యాల జిల్లాలో గ్రీన్ కో, ఆర్సలర్ మిట్టల్, ఐరఈడిఏ భాగస్వామ్యంతో ప్రపంచంలో అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టులు వేగం గా రూపుదిద్దుకుంటున్నాయి. గతంలో వెనుకబడిన ప్రాంతంగా.. కరువు సీమగా ముద్రపడిన రాయలసీమ.. ఇప్పుడు పరిశ్రమలకు స్వర్గధామంగా మారింది. అటు బెంగళూరు ఐటి, ఆటోమొబైల్ క్యారిడర్.. ఇటు చెన్నై పోర్టులకు కనెక్టివిటీ ఉండడంతో రాయలసీమ కు ప్లస్ పాయింట్ గా నిలుస్తోంది. ప్రధానంగా ఖనిజ సంపద, ఇనుప ఖనిజం, సున్నపురాయి నిల్వలు భారీ సిమెంట్, స్టీల్ పరిశ్రమలకు బలమైన పునాదులుగా మారాయి. బలమైన రాజకీయ సంకల్పం, స్థిరమైన పారిశ్రామిక విధానాలతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుండడంతో రాయలసీమ పారిశ్రామిక అభివృద్ధి సాధ్యం అవుతుంది.

**మంటపెట్టిన జిందాల్ ట్వీట్**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఎప్పుడు ఏ టర్న్ తీసుకుంటాయో ఊహించడం చాలా కష్టం. నిన్నటి వరకూ ఓ లెక్కన సాగిన రాజకీయం.. నేటి ఉదయానికి మరోలా మారిపోతుంది. అధికార టీడీపీ కూటమి, విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మధ్య సాగుతున్న పొలిటికల్ వార్‌లో.. "క్రెడిట్" అనే అంశం చాలా కీలకంగా మారుతోంది. ఏ అభివృద్ధి కార్యక్రమానికి సంబంధించి అయినా మేమంటే మేమే కారణమనే వైఖరి పార్టీలలో కనిపిస్తోంది. మొన్నటి గూగుల్ డేటా సెంటర్ మొదలుకుని.. నేటి కడప స్టీల్ ప్లాంట్ వరకూ పొలిటికల్ పార్టీలు ఈ" క్రెడిట్"ను తమకు అనుకూలంగా మార్చుకునే పనిలో ఉండగా.. ఆయా పార్టీల మద్దతుదారులు సోషల్ మీడియాలో వీటిని హోరెత్తిస్తున్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సీఎం చంద్రబాబు ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రెండు దశాబ్దాల రాయలసీమ ప్రజల కల ఈరోజు నెరవేరిందన్నారు. సున్నపురాళ్లపల్లిలో జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభించి ఈ కలను నిజం చేశామని ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వంలో కేవలం శంకుస్థాపనలతో సరిపెట్టి ప్రజలను మభ్యపెడితే... మేం పనులు మొదలుపెట్టి రాయలసీమ స్టీల్ ప్లాంటుకు వాస్తవరూపం ఇస్తున్నామని పనిలోపనిగా వైసీపీపైనా విమర్శలు చేశారు. 2028 నాటికి కడప స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభిస్తామన్నారు చంద్రబాబు. కడపలో స్టీల్ ప్లాంట్ పనుల ప్రారంభంపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్.. సజ్జన్ జిందాల్, జేఎస్ డబ్ల్యూ స్టీల్ బృందానికి అభినందనలు తెలిపారు. రాయలసీమ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకమైన మైలురాయిగా జగన్ అభివర్ణించారు. యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొంటూ ట్వీట్ చేశారు. ఎన్నో ఏళ్ల కృషి, ప్రణాళిక అనే పునాదులపై ఇలాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు నిర్మితమవుతాయన్న వైఎస్ జగన్.. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే కడప స్టీల్ ప్లాంట్ ప్రాజెక్టుకు కీలకమైన పునాదులు వేశామన్నారు. పర్యావరణ అనుమతులు, నీటి కేటాయింపు, భూముల కేటాయింపు, రహదారుల అనుసంధానం వంటి మౌలిక సదుపాయాల కోసం భూమిని అందించామన్నారు. ఈ కారణాలతోనే ప్రాజెక్టు వేగంగా కదిలిందన్న జగన్.. కూటమి ప్రభుత్వం రెండేళ్లుగా ఈ ప్రాజెక్టు పనులు నిలిపివేసిందని ఆరోపించారు. ఇప్పటికైనా పనులు ప్రారంభం కావటం సంతోషకరమంటూ జేఎస్‌డబ్ల్యూ యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. మరోవైపు జగన్ చేసిన ట్వీట్‌కు సజ్జన్ జిందాల్ రిప్లై ఇచ్చారు." మీ శుభాకాంక్షలకు ధన్యవాదాలు, జగన్ గారు..మీ ప్రభుత్వ హయాంలో లభించిన ప్రారంభ అనుమతుల నుంచి నేటి ఈ ప్రారంభోత్సవం వరకు సాగిన ఈ ప్రయాణం నిరంతర కృషికి నిదర్శనం. ఈ ప్రాంత యువత, కుటుంబాల కోసం ఈ ప్రాజెక్ట్‌ను వేగంగా పూర్తి చేయడానికి మేము కట్టుబడి ఉన్నాము." అంటూ జిందాల్ ట్వీట్ చేశారు. సజ్జన్ జిందాల్ ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో టీడీపీ వర్సెస్ వైసీపీగా మారుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన అనుమతుల ద్వారానే కడప స్టీల్ ప్లాంట్ సాధ్యమైందని స్వయంగా జిందాల్ చెప్పారని వైసీపీ మద్దతుదారులు ట్వీట్లు చేస్తున్నారు. జగన్ హయాంలో వేగంగా ఇచ్చిన అనుమతులతోనే ఈ ప్రాజెక్టు కల సాకారమవుతోందని.. టీడీపీ ప్రభుత్వం క్రెడిట్ చోరీకి పాల్పడుతోందని విమర్శిస్తున్నారు. అయితే కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి కావాల్సిన నీరు, కరెంట్, రహదారులు వంటి మౌలిక వసతులు అభివృద్ధి చేసి.. పనులు ప్రారంభమయ్యేలా చేసింది చంద్రబాబు ప్రభుత్వమని టీడీపీ శ్రేణులు కౌంటరిస్తున్నాయి.

# మావిగన్ పై ధర్మాన ఆగ్రహం..

**శ్రీకాకుళం, జూలై 4, పెన్ పవర్:**

రాజకీయాల్లో ఒక వెలుగు వెలిగారు కొందరు నాయకులు. కానీ ఏపీలో రాజకీయాలు మారిపోవడంతో వారి బాధ అంతా కాదు. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీలో రాష్ట్రస్థాయి నేతలుగా చలామణి అయ్యారు. చాలా స్వేచ్ఛగా రాజకీయాలు చేశారు. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంట్రీ తో చాలామంది నేతల తలరాతలు మారిపోయాయి. రాజకీయాల్లో ఉన్నామంటే ఉన్నాం అన్నట్టు వారి వ్యవహార శైలి ఉంది. పదవులు సైతం ఉన్నా అధికారం వెలగబెట్టలేని పరిస్థితి వారిది. ముఖ్యంగా జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాలతో వారు సతమతం అవుతున్నారు. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లే క్రమంలో పలుచన అవుతున్నారు. రాజధానుల అంశానికి సంబంధించి జగన్మోహన్ రెడ్డి వైఖరితో విసిగి వేసారి పోతున్నారు కొంతమంది సీనియర్లు. అటువంటి వారిలో ధర్మాన ప్రసాద రావు ముందుంటారు. జగన్మోహన్ రెడ్డి నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉండే ధర్మాన.. అదే జగన్మోహన్ రెడ్డి కింద పని చేయాల్సి వచ్చింది. ప్రత్యామ్నాయం లేకపోవడంతో జగన్ విధానాలను సమర్థించాల్సి వచ్చింది. ఇప్పుడు అవే చేటు తెస్తున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో మంత్రిగా వ్యవహరించారు ధర్మాన ప్రసాదరావు.

తొలి మూడేళ్లు ఆయనకు మంత్రి పదవి దక్కలేదు. దీంతో మౌనమునిగా మారిపోయారు. మంత్రి పదవి ఇచ్చేసరికి యాక్టివయ్యారు. జగన్మోహన్ రెడ్డి మంచితనాన్ని చాటి చెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆయనకు విశాఖ పాలన రాజధాని అస్త్రం దొరికింది. గ్రామాల్లో ఏకంగా సభలు ఏర్పాటు చేసి జగన్మోహన్ రెడ్డి ఉత్తరాంధ్ర కోసం విశాఖను రాజధానిగా చేర్చారని.. ఆయన రుణం తీర్చుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలను నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ ప్రజలు ఆ మాటలను విశ్వసించలేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించలేదు. అయితే జగన్మోహన్ రెడ్డి మావిగన్ స్టాండ్ తీసుకోవడంతో ధర్మాన ప్రసాదరావు లాంటివారు డిఫెన్స్ లో పడిపోయారు. వాస్తవానికి 2014 ముందు ధర్మాన ప్రసాదరావు కాంగ్రెస్ పార్టీ నేతగా ఉంటూ.. ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారు. ఆయన చెప్పే మాటకు విశ్వాసం, విశ్వసనీయత ఉండేది. మంచి వాగ్ధాటితో ప్రజా సమస్యలకు పరిష్కారం చూపగల నాయకుడిగా పేరు ఉండేది. ఎప్పుడైతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి.. జగన్మోహన్ రెడ్డి విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం.. అవి ఎప్పటికప్పుడు మారిపోతుండడంతో ధర్మాన ప్రసాదరావు

వ్యక్తిత్వాన్ని డ్యామేజ్ చేసేలా చేశాయి. వాస్తవానికి ధర్మాన ప్రసాదరావు జగన్మోహన్ రెడ్డి నాయకత్వాన్ని విభేదిస్తారన్న కామెంట్ ఉంది. జగన్ వైఖరిని పెద్దగా ఇష్టపడరని కూడా అనుచర వర్గం చెబుతుంటారు. తప్పనిసరి పరిస్థితుల్లో.. గత్యంతరం లేని స్థితిలో జగన్ పంచన చేరారు అని కూడా కామెంట్స్ ఉన్నాయి. కానీ అదే జగన్ విధానాలను బలంగా బలపరిచి ధర్మాన ప్రసాదరావు మరింత బలహీనం అయ్యారు. విశాఖ రాజధాని విషయంలో అతి చేశానని.. మావిగన్ స్టాండ్ తో జగన్మోహన్ రెడ్డి దారుణంగా దెబ్బతీశారన్న ఆవేదనతో ఉన్నారట ధర్మాన. చూడాలి ధర్మాన ఎలా ముందుకు వెళ్తారో..

# రాజధాని చుట్టూ మరోసారి రగడ..

**విజయవాడ, జూలై 4, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అంశం మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారింది. రాజధాని అభివృద్ధిని వేగవంతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుండగా, ప్రతిపక్షం నుంచి వస్తున్న రాజకీయ వ్యాఖ్యలు కొత్త చర్చలకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా రాజధాని భవిష్యత్తుపై వస్తున్న ప్రకటనలు పెట్టుబడిదారులు, వ్యాపార వర్గాలు, ప్రజల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ) అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గతంలో నిలిచిపోయిన అనేక అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభించడంతో పాటు, దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నాలు ప్రభుత్వం కొనసాగిస్తోంది. మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య కేంద్రాలు, విద్యా సంస్థల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. అయితే ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన "మావిగన్" వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు కారణమయ్యాయి. ఈ ప్రకటనతో రాజధాని అంశం మరోసారి ప్రధాన రాజకీయ అజెండాగా మారింది. ఈ పరిణామాలు అమరావతి అభివృద్ధిపై ప్రభావం చూపే అవకాశం ఉందని కొందరు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పెట్టుబడుల విషయంలో అనిశ్చితి నెలకొనే అవకాశం ఉందని కొందరు భావిస్తున్నారు. ప్రస్తుతం అమరావతిలో పరిశ్రమలు, ఐటీ సంస్థలు, వ్యాపార సంస్థలు పెట్టుబడులపై ఆసక్తి చూపుతున్నాయి. కానీ రాజధానిపై తరచూ రాజకీయ వివాదాలు కొనసాగితే కొంతమంది పెట్టుబడిదారులు నిర్ణయాలు వాయిదా వేసే పరిస్థితి ఏర్పడవచ్చని పరిశీలకులు చెబుతున్నారు. పెట్టుబడులకు స్థిరమైన వాతావరణం చాలా అవసరమని వారు సూచిస్తున్నారు. రియల్ ఎస్టేట్ రంగంపై కూడా ఈ తరహా రాజకీయ చర్చల ప్రభావం ఉండొచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో రాజధాని అంశంపై వచ్చిన వివిధ నిర్ణయాల కారణంగా నిర్మాణ రంగం మందగించిన పరిస్థితులు కనిపించాయి. ప్రస్తుతం తిరిగి నిర్మాణ కార్యకలాపాలు వేగం పుంజుకుంటున్న సమయంలో మరోసారి అనిశ్చితి ఏర్పడితే అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రభావం పడే అవకాశాన్ని కొందరు ప్రస్తావిస్తున్నారు. అమరావతి పరిసర ప్రాంతాల్లో వ్యాపార కార్యకలాపాలు కూడా క్రమంగా విస్తరిస్తున్నాయి. కొత్త సంస్థలు, సేవా రంగ సంస్థలు, వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభమవుతున్నాయి. ఇలాంటి సమయంలో రాజకీయ ప్రకటనలు వ్యాపార నిర్ణయాలపై ప్రభావం చూపకుండా ప్రభుత్వం విశ్వాసాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, ప్రజల్లో నమ్మకాన్ని మరింత బలపరిచే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతున్నాయనే సందేశాన్ని స్పష్టంగా చేరవేయడం, రాజధాని నిర్మాణంపై దీర్ఘకాలిక ప్రణాళికలను ప్రజలకు వివరించడం కూడా కీలకమని చెబుతున్నారు. మొత్తంగా చూస్తే అమరావతి అంశం కేవలం రాజకీయ చర్చకు మాత్రమే పరిమితం కాకుండా రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో ముడిపడి ఉంది. అందువల్ల రాజకీయ విభేదాల కంటే అభివృద్ధి, స్థిరత్వం, ప్రజల విశ్వాసానికి ప్రాధాన్యం ఇచ్చే నిర్ణయాలే రాష్ట్ర భవిష్యత్తుకు మరింత ఉపయోగకరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**విజయసాయిరెడ్డి సలహాలు**

ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి వర్సెస్ మావిగన్ చర్చ తెరపైకి వచ్చింది. 2029 ఎన్నికల్లో మావిగన్ ఎజెండాతో ప్రజల్లోకి వెళతామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వ్యాఖ్యలతో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. కూటమి పార్టీలు కూడా అప్పుడు మూడు రాజధానులు, ఇప్పుడు మావిగన్ పేరుతో ప్రజల్ని మోసం చేస్తున్నారని జగన్‌కు కౌంటర్ ఇస్తున్నాయి. తాజాగా అమరావతి వర్సెస్ మావిగన్ అంశంపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి స్పందించారు. ఈ రెండు అంశాలపై తన అభిప్రాయాలను చెప్పుకొచ్చారు. టీడీపీ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మాత్రమేనని చెబుతోందని.. వైఎస్సార్‌సీపీ మావిగన్ అంటోందని.. ఒక బాధ్యత కలిగిన ఒక పౌరుడిగా రెండు రాజకీయపార్టీలు చేస్తున్న భిన్న అర్థరహిత వాదనలు చూసిన తర్వాత తన అభిప్రాయాలను అందరితో పంచుకుంటున్నాను అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిని ఎక్కడ ఏర్పాటుచేయాలనే అంశంపై గతంలో శివరామకృష్ణన్ కమిటీ ఇచ్చిన నివేదికను వీరంతా ఎందుకు పక్కన పెట్టారని ప్రశ్నించారు విజయసాయిరెడ్డి. 2014లో రాష్ట్ర విభజన జరిగిందని.. 12 ఏళ్లు అవుతున్నా సరే ఇంకా రాజధాని ఎక్కడ ఉండాలనే చర్చ జరుగుతోందని.. ఇది అందరూ సిగ్గుపడాల్సిన విషయమన్నారు. రాష్ట్రం విడిపోయిన 15 ఏళ్ల తర్వాత.. అంటే 2029లో మరోసారి సార్వత్రిక ఎన్నికలు రానున్నాయని.. ఆ ఎన్నికల్లో కూడా రాజధాని ఎక్కడ ఉండాలో ప్రజలు మరోసారి నిర్ణయించాలా అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో రాజధాని పేరుతో చేస్తున్న ఈ పొలిటికల్ ఫుట్‌బాల్ మ్యాచ్‌ను ఆపేయాల్సిన బాధ్యత అన్ని పార్టీల మీదా ఉందా? లేదా? అన్నారు. అమరావతిలో మొదటి విడతలో ల్యాండ్ పూలింగ్‌కు రైతులకు భూములు ఇచ్చారని.. కానీ ఇప్పటికీ వారికి ప్లాట్లు అప్పగించలేదని, అసలు కేటాయింపులు చేయలేదని.. దీనిని ఎలా సమర్థించుకుంటారని.. లక్ష ఎకరాలు రాజధానికి ఏం చేసుకుంటారని ప్రశ్నించారు విజయసాయిరెడ్డి. వీజీటీఎం కాన్సెప్ట్ (విజయవాడ--గుంటూరు--తెనాలి--మంగళగిరి) విభజన చట్టంలోనే ఉందని.. ఈ ప్రాంతం అంతటికీ రాజధాని భవనాలను విస్తరిస్తే అందులో పోయేది ఏం ఉంటుందని ప్రశ్నించారు విజయసాయి. ప్రధానంగా రాజధాని నిర్మాణం పేరుమీద అవినీతి జరుగుతోందని.. కూటమి ప్రభుత్వం రాజధాని కోసం ఏకంగా రూ.50 వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నార విజయసాయి. అమరావతిలో జరుగుతున్న ప్రతి నిర్మాణంలో భారీగా నిర్మాణ వ్యయాన్ని పెంచి చూపించారని ఆరోపించారు. దీన్ని బట్టి రాజధానిలో అవినీతికి పథకం వేస్తున్నారని.. అందుకే అమరావతి అనే అందమైన పేరు పెట్టారన్నారు. అమరావతిని దేవతల రాజధాని అంటూ బ్రహ్మాండమైన అబద్ధపు బ్రాండింగ్ ఇచ్చారన్నారు. నేరుగా అధికారంలో ఉన్న వారు ఈ దేవతల రాజధాని బ్రాండింగ్ వాడుకుంటూ 25 నుంచి 30 శాతం డబ్బును లంచాలుగా తీసుకుంటున్నారని ఆరోపించారు. వాస్తవానికి అమరావతిలో ఉన్న అమరేశ్వరుడి ఆలయం, బుద్ధ విగ్రహం ఉన్న అమరావతికి.. ఇప్పుడు నిర్మాణం చేస్తున్న బిల్డింగులు ఉన్న ప్రాంతం 50 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. అమరావతి దైవ క్షేత్రం, కృష్ణమ్మ ప్రవహిస్తున్న క్షేత్రం అయితే.. ఈ అమరావతి అవినీతి పారుతున్న క్షేత్రం అని ఘాటుగా స్పందించారు.'అమరావతి బిల్డింగుల నిర్మాణానికి ఏకంగా రూ 50 వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పుడు అందులో 25--30 శాతం అవినీతికి ఆస్కారం కనిపిస్తున్నప్పుడు.. ఈ అవినీతిని మనమంతా ప్రజలుగా మొదట ప్రశ్నించాలి. అంటే ఇది దాదాపు 15 వేల కోట్ల లంచాల మేతకు వేసిన పథకం. మరి ఈ విషయాన్ని వదిలేసి మావిగన్ అనటం వల్ల ప్రయోజనం ఏమిటి? మరో మూడేళ్ళలో జరిగిపోయే నిర్మాణాలన్నీ ఏం చేద్దాం? రాజధానిని నిర్మించటం అంటే అవినీతికి బాగా ఆస్కారం ఉన్న బిల్డింగులు ఏ పార్టీ కట్టాలి... ఎంత కమీషన్లు కొట్టాలి అన్నది కాదు కదా?. కాబట్టి, అమరావతి పేరిట జరుగుతున్న అవినీతి యజ్ఞాన్ని ప్రజలందరి తరఫున ప్రశ్నిస్తూ, ఎస్కలేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో అవినీతిని సవాలు చేస్తూ త్వరలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాను' అంటూ విజయసాయిరెడ్డి ట్వీట్ చేశారు.

# ఢిల్లీలో రూ.105 కోట్లతో సరికొత్త ఏపీ భవన్..!

**విజయవాడ, జూలై 4, పెన్ పవర్:**

దేశ రాజధాని న్యూఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతిష్టను చాటేలా సరికొత్త ఏపీ భవన్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. విభజన అనంతరం సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ భవన నిర్మాణ ప్రక్రియను కూటమి ప్రభుత్వం వేగవంతం చేసింది. అక్షరాలా రూ.105 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ నూతన భవనాన్ని నిర్మించనున్నారు. ఢిల్లీకి వచ్చే రాష్ట్ర పౌరులకు, ప్రజాప్రతినిధులకు మరియు అధికారులకు అత్యుత్తమ సేవలు అందించేలా, అన్ని రకాల అత్యాధునిక వసతులతో ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు. ఈ నూతన ఏపీ భవనాన్ని సుమారు 2.5 లక్షల చదరపు అడుగుల భారీ విస్తీర్ణంలో నిర్మించనున్నారు. ఇది కేవలం ఒక అతిథి గృహంగానే కాకుండా, ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సంబంధించిన పూర్తి స్థాయి పరిపాలన మరియు ఆతిథ్య కేంద్రంగా సేవలందించనుంది. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన దౌత్యపరమైన సమావేశాలు, పారిశ్రామికవేత్తలతో చర్చలు, మరియు సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించుకునేలా ఇందులో కాన్ఫరెన్స్ హాళ్లు, వీఐపీ లాంజ్‌లు మరియు ప్రత్యేక కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రతిష్టాత్మక భవన నిర్మాణ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన 'నేషనల్ బిల్డింగ్స్ కన్స్ట్రక్షన్ కార్పొరేషన్' కి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్పగించింది. ప్రభుత్వ నిర్మాణ రంగంలో అంతర్జాతీయ ప్రమాణాలతో భవనాలను నిర్మించడంలో ఎన్‌బీసీసీకి మంచి గుర్తింపు ఉంది. ఈ కేంద్ర సంస్థ ఆధ్వర్యంలో ఎలాంటి లోపాలు లేకుండా, నిర్ణీత కాలవ్యవధిలోనే అత్యంత నాణ్యతతో కూడిన హంగులతో ఈ నూతన ఏపీ భవన్ నిర్మాణం పూర్తి కానుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన 12 ఏళ్ల తర్వాత, ఢిల్లీలోని ఏపీ భవన్ ఆస్తుల పంపిణీకి సంబంధించి తెలంగాణ ప్రభుత్వంతో సాగిన సుదీర్ఘ వివాదానికి కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. ఇరు రాష్ట్రాల మధ్య కుదిరిన చారిత్రాత్మక ఒప్పందం ప్రకారం.. ఏపీ వాటాగా వచ్చిన భూమిలోనే ఈ సరికొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## టికెట్ భక్తుడిది.. సెక్యూరిటీ 'జెడ్ ప్లస్' రేంజ్ ది.. అమర్ నాథ్ యాత్ర భద్రత ఈ లెవల్ మరీ..




భక్తులారా... మీ లగేజీ సర్దుకోండి.. జేబులో ఐడెంటిటీ కార్డులు పెట్టుకోండి.. వీలైతే కాస్త ధైర్యాన్ని కూడా ప్యాక్ చేసుకోండి. ఎందుకంటే, అమర్‌నాథ్ యాత్ర–2026కు వెళ్లే భక్తుల కోసం కేంద్ర ప్రభుత్వం ఈసారి మామూలు ఏర్పాట్లు చేయలేదు. ఎంతలా అంటే మీరు ప్రయాణించే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కితే... మీ పక్క సీట్లోనో, లేక తలుపు పక్కనో అత్యాధునిక తుపాకీ పట్టుకుని బ్లాక్ కమాండోలు దర్శనమిస్తారు. అవును.. మీరు చదివింది నిజమే! 'రైలు ప్రయాణం ప్రశాంతంగా సాగాలి' అనే కాన్సెప్ట్‌ను కాస్త సీరియస్‌గా తీసుకున్న రైల్వే శాఖ, రక్షణ శాఖలు కలిసి జమ్మూ–శ్రీనగర్ వందే భారత్ రైల్లో ప్రత్యేక 'కోరాస్' కమాండోలను రంగంలోకి దించాయి.

**సీట్లో కూర్చుంటే... సైడ్ లో కమాండో**

సాధారణంగా రైళ్లలో టికెట్ చెక్ చేసే టీటీఈలు, లేదా లాఠీ పట్టుకున్న ఆర్పీఎఫ్ పోలీసులు కనిపిస్తేనే మనం అలర్ట్ అయిపోతాం. కానీ, ఇప్పుడు వందే భారత్ కోచ్‌లలోకి అడుగుపెడితే... హాలీవుడ్ యాక్షన్ సినిమాల్లో లాగా కమాండోలు సంచరిస్తున్నారు. రైలు లోపల, ఎంట్రీల దగ్గర, ఇంపార్టెంట్ కోచ్‌లలో వీరు మోహరించారు. అధునాతన ఆయుధాలు ధరించి, కళ్లకు నల్ల అద్దాలు పెట్టుకుని వీరు తిరుగుతుంటే... ప్రయాణికులు భయం కంటే కూడా ఎక్కువ "సినిమాటిక్ ఫీల్" పొందుతున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. నెటిజన్లు కూడా "అబ్బా... ఏం సెక్యూరిటీ బాబోయ్!" అంటూ లైకులు, షేర్లతో రచ్చ రచ్చ చేస్తున్నారు. భద్రత ఎంత పెరిగిందంటే... రైలు విండో గుండా బయటకి చూస్తే ప్రకృతి అందాల కంటే ఎక్కువగా నిఘా పరికరాలే కనిపిస్తాయేమో..

**మల్టీ–లేయర్ సెక్యూరిటీ.. ఉగ్రవాదులకు మైండ్ బ్లాక్**

అమర్‌నాథ్ యాత్ర అనగానే ఉగ్రవాదుల బెదిరింపులు, ముప్పులు కామనే కదా. అందుకే ఈసారి మన అధికారులు ఒక అడుగు ముందుకు వేసి 'మల్టీ–లేయర్ సెక్యూరిటీ' అనే మాయాజాలాన్ని సృష్టించారు. అంటే, ఒక ఉగ్రవాది పొరపాటున కూడా రైలు వైపు చూద్దామన్నా... ఈ నాలుగు లేయర్ల భద్రతను దాటుకుని రావడం దేవుడెరుగు, కనీసం స్టేషన్ లోపలికి అడుగు పెట్టడం కూడా ఇంపాజిబుల్ అని అధికారులు గట్టిగానే నమ్ముతున్నారు.

**యాత్ర సేఫ్.. ప్రయాణం సూపర్ ఫాస్ట్**

దేశం నలుమూలల నుంచి వచ్చే వేలాది మంది భక్తులు జమ్మూ నుంచి శ్రీనగర్ వరకు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో వేగంగా, లగ్జరీగా ప్రయాణించడమే కాకుండా, ఇప్పుడు ఈ కమాండోల రక్షణలో 'జెడ్ ప్లస్' కేటగిరీ వీఐపీ ఫీలింగ్‌ను కూడా ఎంజాయ్ చేయవచ్చన్నమాట. మొత్తానికి కేంద్ర ప్రభుత్వం భక్తుల భద్రత విషయంలో ఎలాంటి కాంప్రమైజ్ కావడం లేదని క్లియర్‌గా అర్థమవుతోంది. అధికారులు ప్రతి నిమిషం పరిస్థితులను రివ్యూ చేస్తూ.. అంతా ప్రశాంతంగా సాగేలా చూస్తున్నారు. కాబట్టి భక్తులారా.. ఇక భయాలు పక్కన పెట్టి... "హర హర మహాదేవ్" అంటూ వందే భారత్ ఎక్కేయండి. మీ ప్రయాణాన్ని ఎంజాయ్ చేయండి.. కాకపోతే కమాండోల తుపాకులను చూసి కాస్త డిసిప్లిన్‌గా ఉండడం మాత్రం మర్చిపోకండి..

## పైరసీకి చెక్... కేంద్రం కఠిన చర్యలు, టెలిగ్రామ్‌కు షాక్!



టెలిగ్రామ్ వేదికగా సాగుతున్న సినిమాలు, ఓటీటీ కంటెంట్ పైరసీపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అక్రమ నెట్‌వర్క్‌ను పూర్తిగా అరికట్టేందుకు ఐటీ మరియు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖలు కలిసి టెలిగ్రామ్ సంస్థకు గట్టి షాక్ ఇస్తూ అధికారికంగా నోటీసులు జారీ చేశాయి. కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌లను లీక్ చేస్తున్న ఛానళ్లను తక్షణమే తొలగించాలని, దీనిపై తీసుకున్న కఠిన చర్యలకు సంబంధించి 15 రోజుల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని మోదీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**టెలిగ్రామ్‌కు కేంద్రం 15 రోజుల డెడ్‌లైన్:**

పెద్ద ఎత్తున కాపీరైట్ ఉన్న కంటెంట్, ప్రీమియం సినిమాలు మరియు వెబ్ సిరీస్‌లు లింకుల రూపంలో టెలిగ్రామ్‌లో సర్క్యులేట్ అవ్వడాన్ని అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు.ఇక కేవలం లింకులను బ్లాక్ చేయడం మాత్రమే కాదు.. అసలు పైరసీని అడ్డుకునేందుకు ఎలాంటి కట్టుదిట్టమైన వ్యవస్థను రూపొందించారో వివరిస్తూ 15 రోజుల్లోగా 'యాక్షన్ టేకెన్ రిపోర్ట్' ఇవ్వాలని టెలిగ్రామ్‌కు డెడ్‌లైన్ విధించారు.

**క్రియేటర్ల ఆర్థిక వ్యవస్థకు భారీ నష్టం:**

టెలిగ్రామ్ గ్రూపులు, బాట్‌లు మరియు ఛానళ్ల ద్వారా జరుగుతున్న ఈ పైరసీ వల్ల చిత్ర పరిశ్రమతో పాటు ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, ప్రొడ్యూసర్లు, డిస్ట్రిబ్యూటర్లు మరియు క్రియేటర్స్ ఆర్థికంగా కోట్లలో నష్టపోతున్నారని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇక సినిమాటోగ్రాఫ్ చట్టం ప్రకారం.. భారతదేశంలో సినిమా పైరసీ అనేది కేవలం సివిల్ తప్పు మాత్రమే కాదు, ఇది ఒక తీవ్రమైన నేరపూరిత చర్య అని గుర్తు చేసింది.

**మేమే చెప్పేదాకా కాదు.. ముందే అడ్డుకోండి:**

ప్రభుత్వం ఒక్కో పైరసీ ఛానల్‌ని గుర్తించి చెప్పే వరకు టెలిగ్రామ్ వేచి చూడకూడదు అని కేంద్ర మంత్రిత్వ శాఖ తేల్చి చెప్పింది. కేవలం ఇక ఏదైనా ఫిర్యాదు వచ్చినప్పుడు మాత్రమే స్పందించే పద్ధతి కాకుండా.. అసలు పైరసీ కంటెంట్ అప్‌లోడ్ అవ్వకుండా మీ వ్యవస్థను ముందే అలర్ట్ చేయాలని హెచ్చరించింది. పదే పదే తప్పులు చేసే అడ్మిన్లు, గ్రూపులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేసింది.

**గతంలోనే 3 వేలకు పైగా ఛానల్స్ క్లోజ్:**

ఈ పైరసీ నెట్‌వర్క్‌పై ప్రభుత్వం గతంలోనే ఉక్కుపాదం మోపింది. అక్రమంగా కంటెంట్ ప్రసారం చేస్తున్న సుమారు 3,142 టెలిగ్రామ్ ఛానళ్లను, వందలాది వెబ్‌సైట్లను గతంలోనే ఐటీ చట్టం ద్వారా నిలిపివేయించారు. ఇక ఐటీ రూల్స్ 2021 ప్రకారం ఒక మధ్యవర్తిగా తగిన జాగ్రత్తలు పాటించాల్సిన పూర్తి బాధ్యత టెలిగ్రామ్ యాజమాన్యానిదేనని, నిబంధనలు పాటించకపోతే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని కేంద్రం హెచ్చరించింది. భారతదేశంలో సినిమా, ఓటీటీ రంగాన్ని కాపాడేందుకు కేంద్రం తీసుకున్న ఈ కఠిన నిర్ణయం ఇండస్ట్రీలో సరికొత్త చర్చకు దారితీసింది. ప్రభుత్వం ఇచ్చిన ఈ 15 రోజుల గడువులోగా టెలిగ్రామ్ తన సెక్యూరిటీ ఫిల్టర్లను ఎలా బలోపేతం చేస్తుందో చూడాలి. ఇక ఏదేమైనా, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ లేటెస్ట్ యాంటీ–పైరసీ స్టెప్ వల్ల ఇకపై టెలిగ్రామ్‌లో దొంగచాటుగా సినిమాలు చూసే వారికి గట్టి బ్రేకులు పడటం ఖాయంగా కనిపిస్తోంది..

## బొమ్మల చాటున గంజాయి దందా..!



ఈజీ మనీ కోసం స్మార్ట్ థింకింగ్. అంతకు మించి హైరిస్క్ చేసేందుకు కూడా వెనకాడట్లేదు కేటుగాళ్లు. పైకి అమాయకుల్లా కనిపిస్తూ..రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులు అన్నట్లుగా కలరింగ్ ఇస్తూ..తెరవెనుక పెద్ద దందాకే తెరలేపుతున్నారు. ఈ మధ్య రాజస్థాన్‌లో బయటపడిన గంజాయి దందా పోలీసులకు..నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో ఆఫీసర్లనే షాకింగ్‌కు గురి చేసింది. కష్టపడకుండా రాత్రికి రాత్రే కోటీశ్వరులు అయిపోవాలనే ఆశతో, రంగురంగుల బొమ్మల ముసుగులో రూ.లక్షల గంజాయి వ్యాపారం చేస్తూ..అడ్డంగా బుక్కై..కటకటాల పాలైంది గంజాయి ముఠా. బొమ్మల వ్యాపారుల వేషంలో గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న నలుగుర్ని అరెస్ట్ చేశాక..విచారణలో తెలిసిన విషయాలు యావత్ రాజస్థాన్‌ను ఉలిక్కిపడేలా చేసింది.

**1500 కి.మీ చేజ్..రూ.75 లక్షల విలువైన గంజాయి సీజ్**

పిల్లలు ఆడుకునే బొమ్మలు అమ్ముకుంటూ తిరుగుతుంటారు. పైకి ఏమీ తెలియనట్లుగా నటిస్తూ..కన్నింగ్ మైండ్‌కు పనిచెప్తూ..రోజుకో చోట వ్యాపారం చేసుకొని బతుకుతున్నట్లు కనిపిస్తారు. ట్రైన్ జర్నీనే సేఫ్‌గా ఫీలై..ఒక్కో రోజు ఒక్కో జిల్లాలో గంజాయి సప్లై చేయడం వారి వర్కింగ్ స్టైల్. అలా బొమ్మల వ్యాపారం పేరుతో గంజాయి రవాణా చేస్తున్న ముఠాపై రాజస్థాన్ నార్కోటిక్ బ్యూరోకు పక్కా ఇన్ఫర్మేషన్ చేరింది. కానీ వాళ్లు ఎలా ఉంటారో తెలియదు. కానీ గంజాయి ముఠా ఆటకట్టించాలని ఫిక్స్ అయిన పోలీసులు, నార్కోటిక్ అధికారులు..టీమ్‌లు విడిపోయి సెర్చ్ ఆపరేషన్ చేశారు. సినీ ఫక్కీలో దాదాపు 1,500 కిలోమీటర్ల పాటు నిందితులను వెంబడించి..బారన్ జిల్లాలోని ముండియార్ టోల్ గేట్ దగ్గర అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్‌లో సుమారు రూ.75 లక్షల విలువైన 150 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

**దండుపాళ్యం సినిమాను మించిన ట్విస్ట్**

బొమ్మల వ్యాపారం ముసుగులో గంజాయి ట్రాన్స్‌పోర్ట్ చేస్తున్న నలుగురిని అరెస్ట్ చేసి విచారించాక పోలీసులే అవాక్కయారట. మహిళలు, పిల్లలతో కలిసి బొమ్మల వ్యాపారుల్లా ప్రయాణిస్తూ, అయ్యోపాపం అనే ముఖాలు..కానీ గంజాయి తరలించడమే జీవనోపాధిగా పెట్టుకున్నట్లు విచారణలో తేలింది. రాజస్థాన్‌లోని కోటా, జైపూర్, భరత్‌పూర్ ఏరియాల్లో పెద్దఎత్తున గంజాయి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. సమాచారం అందగానే అధికారులు ఒడిశాకు చేరుకోగా, నిందితులు అప్పటికే ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌కు వెళ్లారు. వెంటనే అక్కడికి చేరుకున్న నార్కోటిక్ అధికారులు, స్మగ్లర్లు ట్రైన్‌లో ప్రయాణిస్తున్నట్లు తెలుసుకుని..అదే రైలులో వారిని సీక్రెట్‌గా ఫాలో అయ్యారు. రైలు దిగగానే పికప్ వెహికల్‌లో ఎక్కి వెళ్తున్న నిందితులను..ముండియార్ టోల్ గేట్ దగ్గర చేజ్ చేసి పట్టుకున్నామని అధికారులు చెప్పారు. వారి దగ్గర 50 ప్యాకెట్లలో దాచిన దాదాపు 150 కిలోల గంజాయి బయటపడింది. సీజ్ చేసిన మాదకద్రవ్యాల విలువ రూ.75 లక్షలు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

**బొమ్మలు అమ్మిన డబ్బుతో గంజాయి వ్యాపారం**

ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బొమ్మలు అమ్ముతూ సంపాదించిన డబ్బుతో..గంజాయిని వ్యాపారాన్ని స్టార్ట్ చేసిందట ఈ ముఠా. కేవలం రూ.2వేల మొదలుపెట్టిన అక్రమ యాపారం కాస్త..లక్షల రూపాయల బిజినెస్‌గా మార్చినట్లు తేలింది. అయితే ఎక్కడైనా తనిఖీల్లో పట్టుబడితే తాము బొమ్మల వ్యాపారులమని చెప్పి తప్పించుకోవడం వీళ్లకు వెన్నతో పెట్టిన విద్య అంటున్నారు అధికారులు. ఇలా పలుసార్లు చెకింగ్స్‌లో దొరికి..తమకేం తెలియదని..బొమ్మలు అమ్ముకుని బతుకుతామని చెప్పి ఎస్కేప్ అయిన సందర్భాలు ఉన్నాయని నిందితులు విచారణలో ఒప్పకోవడంతో..వీరి వెనుక ఎవరైనా ఉండి ఈ దందా చేయిస్తున్నారా అని ఆరా తీస్తున్నట్లు నార్కోటిక్ అధికారులు చెబుతున్నారు. సులభంగా డబ్బులు సంపాదించడం కోసం..బొమ్మల వ్యాపారం ముసుగులో గంజాయి దందాలోకి దిగిన ఈ ముఠా..ఫైనల్‌గా జైలు పాలు అయింది.

## ఖమేనీ పక్కనే ఏడాదిన్నర చిన్నారి శవపేటిక.. టెహ్రాన్‌లో హృదయాలను కలిచివేస్తున్న దృశ్యాలు




ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీకి నిర్వహిస్తున్న తుదివీడ్కోలు కార్యక్రమాలు దేశవ్యాప్తంగా తీవ్ర భావోద్వేగాలను రేకెత్తిస్తున్నాయి. గ్రాండ్ మొసల్లా ప్రాంగణంలో ప్రజల సందర్శనార్థం ఖమేనీ పార్థివదేహాన్ని ఉంచగా.. ఆయన పక్కనే ఉంచిన ఏడాదిన్నర వయసున్న చిన్నారి శవపేటిక అందరినీ కంటతడి పెట్టిస్తోంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న చిత్రాల ప్రకారం.. ఆ చిన్నారి ఖమేనీ 14 నెలల మనవరాలు జహ్రా మొహమ్మది గోల్పాయెగాని అని తెలుస్తోంది. జాతీయ జెండాతో కప్పిన చిన్న శవపేటిక పక్కనే ఆమె ఫొటోను ఉంచడంతో అక్కడికి వచ్చిన ప్రజలు తీవ్ర భావోద్వేగానికి గురవుతున్నారు. ఫిబ్రవరి 28న జరిగిన అమెరికా––ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఖమేనీతో పాటు ఆయన కుటుంబ సభ్యులు కూడా ప్రాణాలు కోల్పోయినట్లు ఇరాన్ వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటనలో జహ్రాతో పాటు ఆమె తల్లి, మరికొందరు కుటుంబ సభ్యులు కూడా మరణించినట్లు సమాచారం. అప్పటి నుంచి భద్రపరచిన పార్థివదేహాలను ఇప్పుడు ఆరు రోజుల పాటు ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఖమేనీ భౌతికకాయాన్ని ఇరాన్ జాతీయ జెండాతో కప్పి, ఆయన ధరించే నల్ల టర్బన్‌ను సంప్రదాయబద్ధంగా తలవద్ద ఉంచారు. కుటుంబ సభ్యుల పార్థివదేహాలను కూడా ప్రత్యేక శవపేటికల్లో ఆయన పక్కనే ఏర్పాటు చేశారు. అందులో చిన్నారి జహ్రా శవపేటిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచినా, అదే సమయంలో అత్యంత విషాదకర దృశ్యంగా మారింది. ఈ కార్యక్రమానికి ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాకర్ ఘలిబాఫ్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి సహా పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. చిన్నారి శవపేటికను చూసిన పలువురు నేతలు, అధికారులు భావోద్వేగాన్ని ఆపుకోలేక కన్నీరు పెట్టుకున్నట్లు స్థానిక మీడియా తెలిపింది. గ్రాండ్ మొసల్లా వద్దకు దేశ నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. గేట్లు తెరవగానే వేలాది మంది ఒకేసారి లోపలికి చేరుకుని ఖమేనీకి తుదివీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా అమెరికా వ్యతిరేక నినాదాలు మార్మోగాయి. ప్రతీకారాన్ని సూచించే ఎరుపు జెండాలు ప్రదర్శించిన కొందరు ఆందోళనకారులు అమెరికాపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై కూడా తీవ్ర వ్యాఖ్యలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించడం చర్చనీయాంశంగా మారింది.

ఇరాన్ ప్రభుత్వ అంచనా ప్రకారం ఈ ఆరు రోజుల సంతాప కార్యక్రమాల్లో వివిధ దశల్లో దాదాపు రెండు కోట్ల మంది పాల్గొనే అవకాశం ఉంది. భారత్, రష్యా, పాకిస్థాన్, టర్కీ సహా సుమారు 100 దేశాల ప్రతినిధులు ఈ కార్యక్రమాలకు హాజరైనట్లు సమాచారం. భారీ జనసందోహాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సోమవారం వరకు ఖమేనీ పార్థివదేహాన్ని టెహ్రాన్‌లో ఉంచి,

అనంతరం పవిత్ర నగరమైన ఖోమ్‌కు తరలించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆ తర్వాత కర్బలా, నజాఫ్ ప్రాంతాల మీదుగా ప్రత్యేక సంతాప యాత్ర నిర్వహించి, చివరగా గురువారం ఆయన స్వస్థలమైన మష్హద్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ పరిణామాలతో ఇరాన్ అంతటా విషాద ఛాయలు అలుముకున్నాయి. ముఖ్యంగా ఖమేనీ పక్కనే ఉంచిన చిన్నారి జహ్రా శవపేటిక ప్రపంచవ్యాప్తంగా ప్రజల హృదయాలను కలిచివేస్తున్న దృశ్యంగా మారింది.

## షాకింగ్ : ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్నారుల లైంగిక వేధింపుల కంటెంట్




**ఇన్‌స్టాగ్రామ్‌లో అశ్లీల కంటెంట్...**

ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ బీబీఐ కథనం ప్రకారం ఇన్‌స్టాగ్రామ్‌లో అశ్లీల కంటెంట్‌ను ప్రోత్సహిస్తూ యాడ్స్ ప్లే అయ్యాయి. ఆ వీడియోలో చిన్నారుల వీడియోలు ఉండటం గమనార్హం. ఏకంగా చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ కీ వర్డ్స్ తో ఆ యాడ్ ప్లే అయ్యింది. మీరు పిల్లలకు సంబంధించిన వీడియోలు చూడాలి అంటే ఈ లింక్ లో చూడవచ్చు అంటూ టెలిగ్రామ్ లింక్‌ను ఇన్‌స్టాగ్రామ్ ఇవ్వడం జరిగింది. దీంతో చైల్డ్ అబ్యూజ్ కంటెంట్‌ను ఇన్‌స్టాగ్రామ్ నేరుగా సపోర్ట్ చేస్తుందని, ప్రమోట్ చేస్తుందని, డబ్బులు చెల్లించి ఆ వీడియో చూడమని తమ యూజర్లకు చెబుతుంది అంటూ ఇన్‌స్టాగ్రామ్ పై విమర్శలు వస్తున్నాయి. ఈ విషయాన్ని బీబీసీ ప్రతినిధులు మెటా ఇండియా ప్రతినిధులను ప్రశ్నించిన సమయంలో సరైన సమాధానం రాలేదు. బీబీసీ ఈ విషయమై ఇచ్చిన కథనం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యింది.

ఇండియాలో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ కంటెంట్ విషయంలో స్వీయ నియంత్రణ పాటించడం లేదు. ప్రభుత్వ విధి విధానాలకు అనుగుణంగా కూడా వ్యవహరించడం లేదు. సోషల్ మీడియాలో కొందరు చైల్డ్ అబ్యూజ్ వీడియోలు షేర్ చేయడం మనం చూస్తూనే ఉన్నాం. వాటిని కొన్ని సార్లు వెంటనే తొలగించడం, కొన్ని సార్లు లేట్‌గా తొలగించడం జరుగుతుంది. అయితే ఇన్‌స్టాగ్రామ్‌లో పెయిడ్ యాడ్స్ ద్వారా చైల్డ్ అబ్యూజ్ కంటెంట్ షేర్ కావడం ఇప్పుడు చర్చనీయాంశం అయ్యింది. సాధారణ యూజర్లు షేర్ చేసే కంటెంట్ విషయంలో ఇన్‌స్టాగ్రామ్‌కు సంబంధం ఉండక పోవచ్చు. కానీ ఆ వీడియో కమ్యూనిటీ గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా లేకుంటే తొలగించే అవకాశం ఉంటుంది. కానీ స్వయంగా ఇన్‌స్టాగ్రామ్ డబ్బులు తీసుకుని యాడ్స్ రూపంలో ఆ కంటెంట్‌ను షేర్ చేయడం ఎంత వరకు కరెక్ట్ అంటూ ఇప్పుడు ప్రశ్న.

**ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్...**

ఇప్పటికే బీబీసీ కథనంకు స్పందించిన కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మెటాకు సమన్లు జారీ చేయడం జరిగింది. చైల్డ్ అబ్యూజ్ యాడ్స్‌కు ఎలా అనుమతి ఇచ్చారు అనే విషయంపై వివరణ ఇవ్వాలంటూ మెటా అధికారులకు అశ్విని వైష్ణవ్ సమన్లు ఇచ్చాడు. అయితే మెటా ఇండియా ఇప్పటి వరకు ఈ విషయమై స్పందించేందుకు ఆసక్తి చూపించలేదు. అయితే ప్రభుత్వం ఇచ్చిన సమన్లకు మాత్రం మెటా నుంచి త్వరలోనే సమాధానం వచ్చే అవకాశం ఉంది. ఇలాంటి తప్పిదాలు జరుగుతూ ఉంటాయని, మళ్ళీ ఇలాంటి తప్పిదాలు జరగకుండా తమ సిస్టంలో మార్పులు చేస్తామని మెటా ప్రభుత్వంకు ఇచ్చే సమాధానంలో ఉండవచ్చు అని నిపుణులు చెబుతున్నారు. కానీ ఇప్పటి వరకు జరిగిన తప్పిదం విషయంలో మెటా ఎలాంటి చర్యలు తీసుకుంటుంది, ఎలాంటి శిక్ష అనుభవిస్తుందని కొందరు ప్రశ్నిస్తున్నారు.

**మెటాకు సమన్లు జారీ...**

సాధారణంగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పెయిడ్ యాడ్ పోస్ట్ కావాలంటే చాలా గైడ్ లైన్స్‌ను దాటుకుని రావాల్సి ఉంటుంది. అన్ని గైడ్ లైన్స్ దాటే సమయంలో చైల్డ్ అబ్యూజ్ కంటెంట్‌కి సంబంధించిన యాడ్ అని దాన్ని గుర్తించడంలో ఎలా విఫలం అయ్యారని బిబిసీ ప్రతినిధులు ప్రశ్నించారు. అందుకు మెటా ప్రతినిధుల నుంచి సమాధానం లేదు. మాడరేషన్ టెక్నాలజీ ఆమోదం పొందిన తర్వాత మాత్రమే ఇన్‌స్టాగ్రామ్‌లో ఏ యాడ్ అయినా పడుతుంది. అలాంటిది అంత సులువుగా యాడ్ ఎలా వచ్చిందని ప్రశ్నించిన సమయంలో మొదట ఆ యాడ్ తమ గైడ్ లైన్స్‌కి అనుగుణంగానే ఉందని కంపెనీ ప్రతినిధులు చెప్పినట్లు బీబీసీ తమ కథనంలో పేర్కొంది. అయితే ప్రభుత్వం తీవ్రంగా స్పందించడంతో అప్పుడు యాడ్ ను తొలగించి వివరణ ఇచ్చిందని, టెలిగ్రామ్‌లోనూ ఇలాంటి వీడియోలు ఉండటంపై కేంద్ర ఐటీ శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది.

టెలిగ్రామ్ వివరణ ఇస్తూ అలాంటి కంటెంట్‌ను షేర్ చేసే వారి అకౌంట్స్‌ను బ్లాక్ చేస్తున్నామని, ఇప్పటి వరకు 2.75 లక్షల గ్రూప్స్, యూజర్స్‌ను తొలగించినట్లుగా టెలిగ్రామ్ ప్రతినిధులు తెలియజేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ముందు ముందు ఇలాంటి కంటెంట్ యాడ్స్ రాకుండా ఉండేందుకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సామాన్యులు అంటున్నారు.

అమెరికా-ఇజ్రాయెల్ దాడుల తొలిరోజే ఫిబ్రవరి 28న ఇరాన్ సర్వోన్నత నేత అలీ ఖమేనీ హతమయ్యారు. "రోర్ ఆఫ్ ద లయన్" పేరిట జరిగిన ఉమ్మడి సైనిక చర్యలో ఖమేనీ అధికార నివాసంపై జరిగిన వైమానిక దాడుల్లో ఆయనతోపాటు రక్షణ మంత్రి అజీజ్ నసీర్జాదే, రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్, భద్రతా మండలి కార్యదర్శి సహా దేశ సైనిక-రాజకీయ నాయకత్వం మొత్తం సర్వనాశనమైంది. హర్మూజ్ జలసంధి మూసివేత, గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై ప్రతీకార దాడుల ద్వారా ఇరాన్ ప్రతిస్పందించినా, పతనం అంచుకు చేరుకున్న ఈ జిహాదీ ఎగుమతి రాజ్యానికి మరో జిహాదీ ఎగుమతి రాజ్యమైన పాకిస్తాన్ ఆపన్నహస్తం అందించడం విశేషం! ఏప్రిల్ 11-12 తేదీల్లో ఇస్లామాబాద్‌లో అమెరికా-ఇరాన్ చర్చలకు వేదిక సమకూర్చింది పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, సైన్యాధిపతి అసీమ్ మునీర్ నేతృత్వంలోని బృందం. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలో 300మంది సభ్యులతో కూడిన అమెరికా బృందం, పార్లమెంటు స్పీకర్ ఖలీబాఫ్ నేతృత్వంలోని 70మంది ఇరాన్ బృందం మధ్య 21 గంటలపాటు జరిగిన ఈ చర్చలు తుది ఫలితానికి రాకపోయినా, జూన్ 12న ఒక ఒప్పంద ముసాయిదాకు రెండు పక్షాలూ అంగీకరించాయి. చివరకు జూన్ 17న ఫ్రాన్స్‌లోని వర్సైల్స్ ప్యాలెస్ నుంచి ట్రంప్, టెహ్రాన్‌నుంచి అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ రిమోట్‌గా సంతకం చేసిన "ఇస్లామాబాద్ మెమోరాండం" 60 రోజుల కాల్పుల విరమణను ఖరారు చేసింది. ఈ ఒప్పందం ఇరాన్‌పై చమురు ఆంక్షలను తాత్కాలికంగా ఎత్తివేసి, హర్మూజ్ జలసంధిని తెరిచి, అణు కార్యక్రమంపై నిర్ణయాత్మక అంశాలను భవిష్యత్తు చర్చలకు వాయిదా వేసింది. అంటే ఇరాన్‌కు ఊపిరి పీల్చుకునే వ్యవధి, అనుకూల షరతులు రెండూ దక్కాయి. ఇది ఎలా సాధ్యమైందో ఇప్పటికీ స్పష్టత లేదు. ఇస్లామాబాద్-రావల్పిండి స్థాపిత వ్యవస్థలో నిగూఢమైన దుష్టత్వాన్ని ఉపాధ్యక్షుడు వాన్స్ గ్రహించలేకపోవడం వల్లనా, లేక ట్రంప్ కుటుంబానికి పాకిస్తాన్ వ్యవస్థతో ఉన్న వ్యాపార బంధాలవల్లనా అన్నది శాంతి పొగమంచు వీడాకగానీ తేలదు. అయితే, కొన్ని నెలల క్రితమే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ట్వీట్ (ఇరాన్ ఎప్పుడూ యుద్ధంలో గెలవలేదు, కానీ చర్చల్లో ఓడిపోలేదు) మరోసారి రుజువైందనుకోవాలి.

మొత్తానికి, దేశంలో అధికారం ఎవరి చేతుల్లో ఉందో ప్రపంచానికి చాటిచెప్పడంలో టెహ్రాన్‌లోని మతాధిపత్య పాలకవర్గం విజయం సాధించింది. యుద్ధం అధికారికంగా ముగియకముందే, జూలై 4నుంచి 9 వరకు జరుగుతున్న అంత్యక్రియల కార్యక్రమాలను ఇరాన్ తన అజేయతను ప్రదర్శించే వేదికగా మలచుకుంది. తొలి రెండు రోజులు తెహ్రాన్‌లోని గ్రాండ్ మొసల్లాలో పార్థివదేహం ప్రజాదర్శనం కోసం ఉంచగా, జూలై 6న అంత్యయాత్ర, జూలై 9న ఖమేనీ జన్మస్థలమైన మషద్‌లో అంతిమ సంస్కారాలు జరగనున్నాయి. కొత్త సర్వోన్నత నేత, హతమైన నేత తనయుడైన మొజ్తబా ఖమేనీ, తండ్రి అంత్యక్రియలకు హాజరుకావడం లేదు. తీవ్ర భద్రతా ముప్పు కారణంగానే ఇది జరుగుతోందని ప్రభుత్వం చెబుతున్నా, తండ్రి హత్యానంతరం ఆయన బహిరంగంగా కనిపించకపోవడం, గాయాలనుంచి కోలుకున్నారా? లేదా? అన్న ప్రశ్నలు కూడా ఇందుకు కారణమని భావిస్తున్నారు. ఏమైనా, మతాధిపతులు ప్రపంచ దేశాల గుర్తింపు పొందారడనంలో సందేహం లేదు.

## శోకంలో సవాల్!

పాకిస్తాన్, రష్యా, చైనా అధినేతలతోపాటు దాదాపు వంద దేశాలనుంచి ప్రతినిధులు, ఎనిమిది దేశాధినేతలు, పన్నెండు దేశాల పార్లమెంటు స్పీకర్లు అంత్యక్రియలకు హాజరవుతుండటమే ఇందుకు నిదర్శనం!

ఈ సందర్భంలో భారత్ కూడా ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాన్ని పంపింది. బిహార్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) సయ్యద్ అతా హసేన్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి పబిత్రా మార్గరీటా.. ఖమేనీ అంతిమ దర్శనానికి హాజరైన ఈ బృందం, భారత ప్రభుత్వం, ప్రజల తరపున సంతాపం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీని వ్యక్తిగతంగా ఆహ్వానించినప్పటికీ, జూలై 6-11 తేదీల్లో తూర్పు ఆసియా-ఓషియానియా పర్యటన ముందస్తుగా ఖరారైన కారణంగా భారత్ ప్రతినిధి బృందాన్ని పంపే నిర్ణయం తీసుకుంది. ఈ బృందంలో ఒకరు షియా ముస్లిం కావడం గమనార్హం. ఒక దేశాధినేత మరణానికి ప్రతినిధిని పంపడం దౌత్య మర్యాదగానే పరిగణించాల్సినా, అంతకుమించి ముందుకెళితే ఇజ్రాయెల్‌తోపాటు, దశాబ్దాలుగా మతాధిపత్య పాలకవర్గం పోషిస్తున్న ఉగ్రవాద మిత్రపక్షాలపట్ల బెంబేలెత్తుతున్న మధ్యప్రాచ్య ముస్లిం దేశాలతోనూ మన సంబంధాలు దెబ్బతినే ప్రమాదముంది. ప్రోటోకాల్‌గా కాకుండా రాజకీయ ఆమోదముద్రగా అర్థమయ్యే ఏ సంజ్ఞ అయినా వ్యూహాత్మకంగా తీవ్ర నష్టాన్ని కలిగించగలదు. రక్షణ సహకారం, గూఢచార భాగస్వామ్యం, వ్యవసాయం, నవకల్పన, ఉగ్రవాద వ్యతిరేక పోరాటంవంటి రంగాల్లో విస్తరించిన అత్యంత సన్నిహిత భద్రతా-సాంకేతిక భాగస్వామ్యాలలో ఇజ్రాయెల్‌తో ఉన్నది ఒకటి. అదేస్థాయిలో గల్ఫ్ ప్రాంత అరబ్ దేశాలతోనూ భారత్ రాజకీయ, ఆర్థిక సంబంధాలు విస్తరిస్తున్నాయి. ఇంధన భద్రత, వాణిజ్యం, పెట్టుబడులతోపాటు అక్కడ పనిచేస్తున్న లక్షలాది భారతీయుల సంక్షేమానికి ఈ దేశాలు కీలక భాగస్వాములుగా మారాయి. ఇజ్రాయెల్-పాలస్తీనా వివాదంలోగానీ, గల్ఫ్ దేశాల మధ్య ఘర్షణల్లోగానీ ఏ పక్షంవైపు మొగ్గు చూపకుండా, అన్ని పక్షాలతోనూ సమాన స్థాయిలో సంబంధాలు కొనసాగించడం భారత్ దౌత్యనీతికి మూలస్తంభంగా నిలిచింది. పోటీ ప్రయోజనాలున్న శక్తుల మధ్య ఏ ఘర్షణలోనూ చిక్కుకోకుండా, ఏకకాలంలో అందరితో సంబంధాలు కొనసాగించే సమతూకాన్ని సాంప్రదాయకంగా భారత విదేశాంగ విధానం అనుసరిస్తూ వచ్చింది. ఇటీవలి సైనిక ఘర్షణల నేపథ్యంలో, ఇజ్రాయెల్ ఈ ఇస్లామాబాద్ మెమోరాండంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ లెబనాన్‌లో తన సైనిక కార్యకలాపాలను కొనసాగించిన నేపథ్యంలో, ఈ సమతూకాన్ని కాపాడుకోవడం మరింత సవాలుగా మారనుంది. అందుకే భారత ప్రతినిధి బృందం స్వరూపం, పర్యటన చుట్టూ వెలువడే సందేశాలను టెహ్రాన్‌తో పాటు జెరూసలేం, వాషింగ్టన్, రియాద్, అబుదాబీ వంటి ప్రాంతీయ రాజధానులన్నీ నిశితంగా గమనిస్తాయి. పశ్చిమాసియాలో దీర్ఘకాలిక వ్యూహాత్మక ప్రయోజనాలను కాపాడుకోవాలంటే, దౌత్య మర్యాదను రాజకీయ మొగ్గుచూపుతో గందరగోళపరచకుండా స్పష్టమైన విభజన రేఖను నిలుపుకోవడం భారత్‌కు అనివార్యం!!

---

### పనికొచ్చే పలుకు



## అది కదా.. అసలు జీవితం!

లోకం కోసం ముసుగు వేసుకుని బతకడం కంటే, మన అసలు స్వరూపంతోనే జీవించడం మిన్న. సమాజం మెప్పు కోసం వ్యక్తిత్వాన్ని మార్చుకునే ఈ రోజుల్లో, హాలీవుడ్ దిగ్గజ నటి బెట్ డేవిస్ చెప్పిన ఒక మాట ప్రస్తుత కాలానికి సరిగ్గా సరిపోతుంది. "మనం కాని వ్యక్తిలా నటిస్తూ అందరి ప్రేమను పొందడంకంటే, మనలా మనం ఉంటూ కొందరి ద్వేషాన్ని ఎదుర్కోవడం ఎంతో మేలు. కొన్నిసార్లు సరైన వ్యక్తుల నుంచి వచ్చే వ్యతిరేకత, మీ విలువను తెలియజేస్తుంది" అని బెట్ డేవిస్ పేర్కొన్నారు.

నటన కంటే నిజాయితీకే ఎక్కువ విలువ ఉంటుందని ఈ హాలీవుడ్ లెజెండ్ బలంగా నమ్మారు. మన అసలైన వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడం వల్ల సమాజంలో గౌరవం, ఆత్మవిశ్వాసంతో పాటు నిజమైన బంధాలు ఏర్పడతాయని ఆమె జీవితం నిరూపించారు.

ప్రజాదరణ కంటే మనస్సాక్షిగా బతకడమే ముఖ్యమన్నది ఆమె మాటల్లోని అంతరార్థం. చాలామంది సమాజంలో గుర్తింపు కోసం, ఇతరులను ఇంప్రెస్ చేయడం కోసం తమ ప్రవర్తనను, అభిప్రాయాలను మార్చుకుంటారు. ఇలా వచ్చే గుర్తింపు తాత్కాలికం మాత్రమే, ఎందుకంటే అది ఒక అబద్ధంమీద ఆధారపడి ఉంటుంది.

ఈ వ్యాఖ్యలోని రెండోభాగం మరింత లోతైనది. నిజాయితీ, ధైర్యం, విలువలులేని వ్యక్తులు మిమ్మల్ని ద్వేషిస్తున్నారంటే, మీరు ఒక మంచి ఆశయంవైపు నిలబడ్డారని అర్థం. అందరూ మనల్ని మెచ్చుకోవాలని అనుకోవడంకంటే, మన ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడమే నిజమైన విజయం.

నేటి డిజిటల్ యుగానికి ఎందుకు అవసరం?


లైకులు, కామెంట్ల కోసం ప్రాకులాడే నేటి సమాజంలో ఈ మాటలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. స్కూల్, ఆఫీస్ లేదా సోషల్ మీడియాలో రిజెక్షన్‌కు భయపడి చాలామంది తమ అసలైన వ్యక్తిత్వాన్ని దాచేస్తున్నారు. బాహ్య హంగులకే లోకం ప్రాధాన్యమిస్తున్న ఈ రోజుల్లో.. నిజమైన బంధాలు కేవలం నిజాయితీతోనే ఏర్పడతాయని బెట్ డేవిస్ గుర్తుచేశారు. లోకం ఏమనుకుంటుందో అనే భయాన్ని వీడి, మన సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే ధైర్యాన్ని ఈ వ్యాఖ్యలు ఇస్తాయి.

ఈ సూత్రాన్ని జీవితంలో ఎలా పాటించాలి?

బెట్ డేవిస్ చెప్పిన ఈ జీవన సూత్రాన్ని అలవర్చుకోవడానికి కొన్ని మార్గాలున్నాయి. మిమ్మల్ని మీరు పూర్తిగా అంగీకరించండి, మీలోని ప్రత్యేకతను గౌరవించండి. ఇతరులకు గౌరవిస్తూనే, మీ మనసులోని నిజాన్ని ధైర్యంగా చెప్పండి. కేవలం ఇతరులను ఆకట్టుకోవడం కోసమే నటించడం ఆపేయండి. మీ అసలైన వ్యక్తిత్వాన్ని ప్రేమించే వారితోనే స్నేహం చేయండి. విమర్శలు ఎదురైనా మీ ఆశయాలను, సిద్ధాంతాలను వదులుకోవద్దు. నిర్మాణాత్మక విమర్శలకు, అనవసరపు వ్యక్తిగత దూషణలకు మధ్య తేడాను గుర్తించండి. పాపులారిటీకంటే ఆత్మగౌరవానికే మొదటి ప్రాధాన్యం ఇవ్వండి. నిరంతర ఆత్మపరిశీలనతో ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోండి. వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో నిజాయితీగా వ్యవహరించండి. మీలా మీరు జీవించడమే నిజమైన విజయమని నమ్మండి. నిజాయితీగా జీవించే వారికి కొందరి ద్వేషం తప్పకపోవచ్చు, కానీ అది వారి ఆత్మగౌరవానికి తగిలిన గాయం కాదు, ధరించిన పతకం. మీలా మీరు నిలబడగలిగితే, ప్రేమైనా ద్వేషమైనా అది నిజమైనదే అవుతుంది.

---

# భగ్గుమంటున్న భూగోళం!




ప్రపంచవ్యాప్తంగా 2026 వేసవి చరిత్రలోనే అత్యంత తీవ్రమైన ఉష్ణ సంవత్సరంగా నిలిచిపోతోంది. మే చివర్లో మొదలైన తొలి వడగాడ్పు యూరప్‌ను కుదిపేసింది. బెల్జియం, చెక్ రిపబ్లిక్, డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీ, హంగేరీ, ఇటలీ, నెదర్లాండ్స్, పోలండ్, రొమేనియా, స్పెయిన్, బ్రిటన్‌లలో ఉష్ణోగ్రతా రికార్డులు ఒక్కొక్కటిగా బద్దలయ్యాయి. మే, వసంతకాలంలో ఎన్నడూ నమోదుకాని అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాతావరణ మార్పుల కారణంగా మధ్య యూరప్ వేసవి ముందుగానే మొదలవుతోంది. జూన్ 17న మొదలైన రెండో, మరింత తీవ్రమైన వడగాడ్పు ఫ్రాన్స్‌లో 1947 తర్వాత అత్యంత వేడి రోజును నమోదు చేసింది. కొన్నిచోట్ల ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల సెల్సియస్‌ను దాటాయి. జర్మనీ, చెక్ రిపబ్లిక్, స్లొవేకియా, హంగేరీలు తమ చరిత్రలోనే అత్యధిక ఉష్ణోగ్రతలను చవిచూశాయి. జూన్ 21నుంచి యూరప్‌వ్యాప్తంగా 1,300కు పైగా అదనపు మరణాలు నమోదైనట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. అమెరికాలోనూ దాదాపు 15 కోట్లమంది వేడి హెచ్చరికల పరిధిలో ఉన్నారు. వాషింగ్టన్‌లో జులై 4న ఉష్ణోగ్రత 1919 నాటి రికార్డును బద్దలుకొట్టేలా కనిపిస్తోంది. ఇక భారత్‌లో పరిస్థితి మరింత ఆందోళనకరం. ఏప్రిల్ చివర్లో ప్రపంచంలోని 50 అత్యంత వేడి నగరాలన్నీ భారత్‌లోనే నమోదవడం అపూర్వ పరిణామం. ఉత్తరప్రదేశ్‌లోని బండా పట్టణంలో ఏప్రిల్ 27న 46 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. తెల్లవారుజామున సైతం ఉష్ణోగ్రత గణనీయంగా తగ్గలేదు. మే నెలలో దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ కొత్త రికార్డులు నెలకొల్పింది. మే 21న గరిష్ఠ డిమాండ్ 270 గిగావాట్లను దాటింది. ఈ నేపథ్యంలోనే చైనాలో ఖరీదైన ఏసీలకు ప్రత్యామ్నాయంగా వినూత్నమైన "మిస్టింగ్ క్లౌడ్" వ్యవస్థలు ప్రజాదరణ పొందుతున్నాయి. ఎత్తైన భవనాలపై ఏర్పాటు చేసిన హై ప్రెజర్ నాజిల్స్ సూక్ష్మ తుంపర్లను గాల్లోకి వెదజల్లడం ద్వారా చుట్టుపక్కల వీధులను చల్లబరుస్తున్నాయి. ఆరుబయట ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల సెల్సియస్ ఉన్నప్పుడు కూడా ఈ వ్యవస్థ గాలి, ఉపరితల ఉష్ణోగ్రతలను 5-8 డిగ్రీల మేర తగ్గించగలగడం విశేషం. చైనా నగరాలు, పార్కులు, కూడళ్లు, బస్టాప్‌లలో ఇప్పటికే విస్తృతంగా వాడుకలో ఉన్న ఈ చౌక పద్ధతి, ప్రపంచవ్యాప్తంగా వేడి తీవ్రమవుతున్న వేళ అనేక నగరాల దృష్టిని ఆకర్షిస్తోంది.

ఈ తీవ్ర ఉష్ణ పరిస్థితులకు మూలకారణం మానవ కార్యకలాపాలవల్ల పెరుగుతున్న భూతాపమేనని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. శిలాజ ఇంధనాల దహనమే ప్రాణాంతక వడగాడ్పుల పెరుగుదలకు ప్రధాన కారణమని, స్వల్పస్థాయి తాపన సైతం విపరీత వేడిని ఘాతీయంగా (ఎక్స్‌పొనెన్షియల్‌గా) పెంచుతుందని పరిశోధకులు చెబుతున్నారు. 1976లో ఇలాంటి వడగాడ్పు రావాలంటే పగటిపూట ఉష్ణోగ్రతలు 3.5 డిగ్రీల మేర తక్కువగా ఉండేవని, 2003 నాటికి కూడా 2 డిగ్రీల మేర తక్కువ ఉండేదని ఒక అధ్యయనం స్పష్టం చేసింది. యూరప్ ప్రపంచంలోనే వేగంగా వేడెక్కుతున్న ఖండంగా నిలవడం గమనార్హం. ప్రపంచ సగటుకు రెట్టింపు వేగంతో ఇక్కడ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ అధిపతి హెచ్చరించారు. భారత్ విషయానికొస్తే, గత దశాబ్ద కాలంలో వడగాడ్పుల వ్యవధి క్రమంగా పెరుగుతూ వస్తోందని, రాత్రిపూట ఉష్ణోగ్రతలు కూడా స్థిరంగా పెరుగుతున్నాయని వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ముఖ్యంగా తేమ శాతం పెరగడం ప్రమాదకరంగా మారింది. శరీరం చెమట ద్వారా చల్లబడే సహజ ప్రక్రియకు ఎక్కువ తేమ అడ్డంకిగా మారి, మామూలుగా భరించగలిగే ఉష్ణోగ్రతలు సైతం ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయి. దీనికితోడు నగరాల్లో కాంక్రీటు నిర్మాణాలు, పచ్చదనం కొరతవల్ల ఏర్పడే "అర్బన్ హీట్ ఐలాండ్" ప్రభావం అదనపు భారంగా మారుతోంది. ఇది నగర ఉష్ణోగ్రతలను చుట్టుపక్కల ప్రాంతాల కన్నా 4-7 డిగ్రీల మేర పెంచుతోంది. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ప్రపంచవ్యాప్తంగా వివిధ నగరాలు వేర్వేరు మార్గాలు అనుసరిస్తున్నాయి. యూరప్‌లో అమెరికా తరహాలో కూలింగ్ సెంటర్లు, స్ప్రే పార్కులు, నీటి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. వృద్ధులు, నిరాశ్రయులువంటి బలహీన వర్గాలకు ప్రత్యేక సహాయక చర్యలు చేపడుతున్నారు. భారత్‌లో సంప్రదాయ శీతలీకరణ పద్ధతులైన జాలీలు, మట్టి కుండలు, నీడనిచ్చే వసారాలను ఆధునిక భవన నిర్మాణ నిబంధనల్లో చేర్చాలన్న సూచనలు వస్తున్నాయి. వడగాడ్పులను విపత్తుల చట్టం కింద అధికారికంగా గుర్తించాలన్న డిమాండ్లు కూడా ఊపందుకుంటున్నాయి. చైనా అనుసరిస్తున్న మిస్టింగ్ వ్యవస్థ ఇలాంటి తక్కువ ఖర్చుతో కూడిన, స్థానికంగా అమలు చేయగల పరిష్కారాలకు మంచి ఉదాహరణ. సంప్రదాయ ఏసీలతో పోలిస్తే ఇది తక్కువ విద్యుత్‌ను వినియోగిస్తుంది, రోడ్లు తడిసిపోయే ప్రమాదం లేకుండా నీరు, పంపులు, నాజిల్స్‌తోనే పనిచేస్తుంది. అయితే నీటి కొరత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ పద్ధతి సాధ్యాసాధ్యాలపై నిపుణుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.

రాబోయే కాలంలో వడగాడ్పులు మరింత తరచుగా, తీవ్రంగా, దీర్ఘకాలికంగా మారనున్నాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. కేవలం భూతాప నియంత్రణ చర్యలతోనే సరిపెట్టుకోకుండా, నగరాలు ఇప్పటికే మారుతున్న వాతావరణానికి అనుగుణంగా తమను తాము మలచుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టమవుతోంది. కూల్ రూఫ్‌లు, పచ్చదనం విస్తరణ, నీటి వనరుల పరిరక్షణవంటి దీర్ఘకాలిక పట్టణ ప్రణాళికలతోపాటు, స్వల్పకాలిక ఉపశమన మార్గాలైన మిస్టింగ్ వ్యవస్థలు, కూలింగ్ సెంటర్లు వంటివి సమాంతరంగా అమలు చేయడం ద్వారానే ఈ సంక్షోభాన్ని కొంతమేర తట్టుకోగలమని నిపుణుల అభిప్రాయం. వేడి కారణంగా కార్మిక ఉత్పాదకత గణనీయంగా పడిపోతుండటం, వ్యవసాయ దిగుబడులపై ప్రభావం చూపుతుండటం ఆర్థిక వ్యవస్థలకు కూడా ప్రమాద ఘంటికలే. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు వడగాడ్పు కార్యాచరణ ప్రణాళికలకు మరింత నిధులు కేటాయించడం, స్థానిక స్థాయిలో దుర్బలత్వ పటాలను రూపొందించడం, బాధ్యతలను స్పష్టంగా నిర్దేశించడం చేయాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో సాధారణ ప్రజలు కూడా నీటిని ఆదా చేసుకుంటూనే వడదెబ్బ నుంచి తమను తాము రక్షించుకునే జాగ్రత్తలు తీసుకోవడం, పరస్పర సహకారంతో బలహీన వర్గాలను ఆదుకోవడం అవసరం. చైనా అనుసరిస్తున్న తుంపర మేఘాలవంటి సృజనాత్మక, తక్కువ ఖర్చు పరిష్కారాలు మిగతా దేశాలకూ ఒక మార్గదర్శకంగా నిలవగలవు. చివరకు, భూతాపాన్ని పెంచుతున్న శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించుకోకుండా, కేవలం అనుకూల చర్యలతోనే ఈ సమస్యను శాశ్వతంగా అధిగమించలేమన్న వాస్తవాన్ని ప్రపంచదేశాలు గుర్తించాల్సిన తరుణమిది!! ■

---




అద్భుతమైన విజయాలు సాధించేవారు 'నలుగురూ ఏమనుకుంటారో అని అస్సలు ఆలోచించరు. సమాజం దీనిని లోపంగా చూసినా.. అదే వారికి అతి పెద్ద బలం. సాధారణ వ్యక్తులు అవతలివారిని ఇబ్బంది పెడుతున్నామేమో లేదా మనల్ని చూసి నవ్వుతారేమో అని భయపడి వెనకడుగు వేస్తారు. కానీ నాయకులు తమకు కావాల్సిన దానికోసం మొండిగా, సిగ్గు పడకుండా ప్రయత్నిస్తూనే ఉంటారు. నలుగురి మెప్పు కోసం ఆరాటపడడం ఆపేయండి. వారి కళ్లలో వెలుగు కోసం కాదు, మీ కలల్లో వెలుగు కోసం ప్రయాణించండి. మెప్పు కోరుకునేవాడు అనుచరుడిగానే ఉంటాడు. మార్గం వేసుకునేవాడే నాయకుడవుతాడు. మీ నిర్భయత్వమే మీ నిజమైన బలం అని నిరూపించుకోండి.

-మహాదేవ

---

### వింతల్లో వింతలు

## కృత్రిమ తప్పిదం!




కృత్రిమ మేధతో సాంకేతిక నాయకత్వ స్థానాన్ని అందుకోవాలని భావించిన దక్షిణాఫ్రికాకు అదే సాంకేతికత చుక్కెదురైంది. ప్రజాభిప్రాయ సేకరణకు విడుదల చేసిన జాతీయ ఏఐ విధాన ముసాయిదాలో 67 అకడమిక్ ఉల్లేఖనాల్లో కనీసం ఆరు కల్పిత జర్నల్ వ్యాసాలను ఏఐ సృష్టించి చేర్చిందని బయటపడింది. దక్షిణాఫ్రికా వార్తా సంస్థ న్యూస్24 దీన్ని బట్టబయలు చేయడంతో ప్రభుత్వం ఇరకాటంలో పడింది. కమ్యూనికేషన్స్ మంత్రి సోల్లీ మలాట్సీ ఈ విధానాన్నే ఉపసంహరించుకున్నారు. సరైన పరిశీలన లేకుండా ఏఐ ఉల్లేఖనాలను చేర్చడం వల్లే ఈ తప్పిదం జరిగిందని, ఇది కేవలం సాంకేతిక పొరపాటు కాదని, పత్రం విశ్వసనీయతనే దెబ్బతీసిందని అంగీకరించారు. ఏఐ వినియోగంపై నిరంతర మానవ పర్యవేక్షణ ఎంత కీలకమో ఈ ఉదంతం రుజువు చేసిందని పేర్కొన్న మంత్రి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, సవరించిన విధానాన్ని మళ్లీ ప్రజాభిప్రాయానికి ఉంచుతామని ప్రకటించారు.

# ఈ ఆహారాలు తింటే రోగనిరోధక శక్తి డబుల్

మన శరీరంలో రెండో మెదడు ఎక్కడ ఉంటుందో తెలుసా? అది మన పొట్ట. పొట్ట ఆరోగ్యంగా ఉంటేనే మన మూడ్ బాగుంటుంది. అన్ని పనులు సజావుగా చేయడానికి శరీరం కూడా సహకరిస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. చివరికి చర్మం కూడా కాంతివంతంగా మెరుస్తుంది. కానీ ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలు ప్రతి ఒక్కరినీ వేధిస్తున్నాయి. వీటన్నింటికీ ప్రధాన కారణం మనం తీసుకునే ఆహారంలో ఒక ముఖ్యమైన అంశం తగ్గిపోవడమే. అదే 'ఫైబర్' (పీచు పదార్థం). ప్రముఖ గ్యాస్ట్రో స్పెషలిస్ట్ డాక్టర్ పాల్, మన వంటింట్లో దొరికే సాధారణ పదార్థాలతోనే పొట్టను ఎలా క్లీన్ చేసుకోవచ్చో వివరించారు. ఆయన సూచించిన ఆ ఐదు సూపర్ ఫుడ్స్ ఏంటి? ఫైబర్ అనేది జీర్ణవ్యవస్థకు ఒక క్లీనర్ లాగా పనిచేస్తుంది. ఇది మనం తిన్న ఆహారం సాఫీగా కదలడానికి సహాయపడటమే కాకుండా, మన పొట్టలో ఉండే మంచి బ్యాక్టీరియాకు ఆహారాన్ని అందిస్తుంది. ఫైబర్ అందించడంలో వేయించిన శనగలు అగ్రస్థానంలో నిలుస్తాయి. ప్రతి 100 గ్రాముల శనగలలో సుమారు 17 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఇందులో ఉండే ఇన్‌సోల్యూబుల్ ఫైబర్, ప్రోటీన్ మిమ్మల్ని ఎక్కువ సేపు ఆకలి వేయకుండా ఉంచుతాయి. వీటిని చిరుతిండిగా నేరుగా తీసుకోవచ్చు లేదా సలాడ్లలో కలుపుకోవచ్చు. మన ఇళ్లలో సాధారణంగా వాడే నల్ల మినుములలో ఒక కప్పుకు 16 గ్రాముల ఫైబర్ లభిస్తుంది. ఇందులో కరిగే, కరగని ఫైబర్స్ రెండూ ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, మన పొట్టలోని మంచి బ్యాక్టీరియాను పోషిస్తాయి. పప్పు మఖానీ లేదా అన్నంలో కలిపి తీసుకోవడం వల్ల గుండెకు కూడా మేలు జరుగుతుంది. చియా విత్తనాలు ఇప్పుడు సూపర్ ఫుడ్‌గా ప్రాచుర్యం పొందాయి. కేవలం రెండు టేబుల్ స్పూన్ల చియా విత్తనాల్లో 10 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఇవి పొట్టలోకి వెళ్ళగానే జెల్ లాగా మారి జీర్ణక్రియను సులభతరం చేస్తాయి. బ్లడ్ షుగర్ లెవల్స్ స్థిరంగా ఉండటానికి కూడా ఇవి తోడ్పడతాయి. డాక్టర్ పాల్ వీటిని పెరుగుతో కలిపి తీసుకోవాలని సూచిస్తున్నారు. చూడటానికి చాలా చిన్నవిగా ఉన్నా, రాస్ప్‌బెర్రీస్ ఫైబర్ పవర్‌హౌస్‌లు. ఒక కప్పు రాస్ప్‌బెర్రీస్‌లో 8 గ్రాముల ఫైబర్ లభిస్తుంది. ఇవి మంచి బ్యాక్టీరియాకు మద్దతు ఇవ్వడమే కాకుండా, శరీరానికి కావాల్సిన యాంటీ ఆక్సిడెంట్లను అందిస్తాయి. వీటిని స్మూతీలలో లేదా ఓట్స్‌లో కలిపి తీసుకోవచ్చు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆరోగ్యాన్ని ఇచ్చే పండు జామ. ఇందులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. మలబద్ధకంతో బాధపడేవారికి ఇది ఒక దివ్యౌషధంలా పనిచేస్తుంది. రోజూ

ఒక జామ పండు తినడం వల్ల జీర్ణవ్యవస్థ మొత్తం శుభ్రపడుతుంది. ఆరోగ్యకరమైన పొట్టే సంతోషకరమైన జీవితానికి ఆధారం. డాక్టర్ పాల్ సూచించిన ఈ ఐదు పదార్థాలను మీ రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల జీర్ణ సమస్యల నుండి శాశ్వత ఉపశమనం పొందవచ్చు. ఇవి కేవలం మీ పొట్టనే కాకుండా, మీ పూర్తి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.



## ప్యాకేజీ ఫుడ్‌తో క్యాన్సర్ ముప్పు!



ఆధునిక జీవనశైలిలో మనకు సమయం దొరకడమే కష్టమవుతోంది. అందుకే త్వరగా తయారయ్యే ఇన్స్టంట్ ఫుడ్స్, ప్యాక్ చేసిన పానీయాలు, ఎక్కువ కాలం నిల్వ ఉండే ఆహార పదార్థాల వైపు అందరం మొగ్గు చూపుతున్నాం. కానీ మనం సౌకర్యవంతంగా భావిస్తున్న ఈ ఆహారమే మన ప్రాణాల మీదకు తెచ్చే ప్రమాదం ఉందని మీకు తెలుసా?ఆహారం పాడవకుండా, ఎక్కువ కాలం తాజాగా ఉంచేందుకు కంపెనీలు వాడే కొన్ని కెమికల్స్.. నిశ్శబ్దంగా మన శరీరంలో క్యాన్సర్ కణాలను పెంచుతున్నాయని తాజా అంతర్జాతీయ పరిశోధనలో తేలింది. ముఖ్యంగా మహిళల్లో వచ్చే రొమ్ము క్యాన్సర్, పురుషుల్లో వచ్చే ప్రోస్టేట్ క్యాన్సర్‌లకు ఈ నిల్వ కారకాలే ప్రధాన శత్రువులని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలు ఆ ప్రమాదకరమైన ప్రిజర్వేటివ్స్ ఏంటి? ఫ్రాన్స్‌లోని 'యూనివర్సిటీ పారిస్ సిటీ' పరిశోధకులు సుమారు 1,05,260 మందిపై సుదీర్ఘ కాలం పాటు జరిపిన అధ్యయన ఫలితాలను 'ది బిఎమ్?జె (ఃఓఏ)' జర్నల్‌లో ప్రచురించారు. ప్యాక్ చేసిన ఆహారాల్లో వాడే 17 రకాల ప్రిజర్వేటివ్స్ గురించి వారు పరిశీలించగా, అందులో కొన్ని సాధారణ కెమికల్స్ క్యాన్సర్ రిస్క్‌ను విపరీతంగా పెంచుతున్నట్లు గుర్తించారు. పొటాషియం సోర్బేట్: ఇది మొత్తం క్యాన్సర్ ముప్పును 14 శాతం, రొమ్ము క్యాన్సర్ ముప్పును 26 శాతం పెంచుతున్నట్లు తేలింది.సోడియం నైట్రైట్: మాంసం నిల్వ ఉంచేందుకు వాడే ఈ కెమికల్ వల్ల ప్రోస్టేట్ క్యాన్సర్ వచ్చే అవకాశం 32 శాతం ఎక్కువగా ఉంది.పొటాషియం నైట్రేట్: దీని వల్ల రొమ్ము క్యాన్సర్ ముప్పు 22 శాతం పెరుగుతోంది.సల్ఫైట్లు: ఆహారంలో వీటి పరిమాణం ఎక్కువైతే సాధారణ క్యాన్సర్ రిస్క్ 12 శాతం పెరుగుతుంది.అసిటేట్లు: ఇవి రొమ్ము క్యాన్సర్ ముప్పును 25 శాతం పెంచుతాయని పరిశోధనలో వెల్లడైంది. ఆహారం నిల్వ ఉండటానికి వాడే ఈ రసాయనాలు మన శరీరంలోని రోగనిరోధక శక్తిని దెబ్బతీస్తాయి. ఇవి శరీరంలో ఇన్ఫ్లమేషన్ (వాపు)ను పెంచి, క్యాన్సర్ కణాలు వృద్ధి చెందడానికి అనువైన వాతావరణాన్ని కల్పిస్తాయి. సహజమైన యాంటీ ఆక్సిడెంట్ ప్రిజర్వేటివ్స్ పెద్దగా నష్టం చేయకపోయినా.. సోడియం ఎరిథోర్బేట్ వంటి కొన్ని రసాయనాలు మాత్రం అనారోగ్యానికి కారణమవుతున్నాయి.

## రాత్రి భోజనానికి ఏది ప్రయోజనకరం




రాత్రి పూట అన్నం తింటే బాగుంటుందా? లేదా రోటీ తింటే బాగుంటుందా? అనే ప్రశ్న తలెత్తుతుంటుంది. రాత్రి పూట ఈ రెండింటిలో ఏదీ తీసుకుంటే మంచిది? వీటి శరీరానికి ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయి? దీనిపై నిపుణులు కీలక విషయాలు వెల్లడించారు. రాత్రి భోజనంలో అన్నం తినాలా లేక రోటీ తినాలా అనేది తరచుగా ప్రజలను కలవరపెట్టే ప్రశ్న. నిపుణులు సమాధానం మీ జీవనశైలి, జీర్ణ సామర్థ్యం, ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుందని అంటున్నారు. రెండూ పోషకమైనవి. కానీ కొన్ని తేడాలు ఏ విందు ఎంపిక ఉత్తమమో నిర్ణయిస్తాయి. పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం.. రోటీ కంటే బియ్యం వేగంగా జీర్ణమవుతాయి. రాత్రిపూట జీర్ణశక్తి బలహీనంగా ఉంటుంది. అందుకే బియ్యం శరీరంపై ఎక్కువ ఒత్తిడిని కలిగించదు. తెల్ల బియ్యం తేలికగా ఉంటుంది. అలాగే కడుపు, ప్రేగులపై ఒత్తిడిని కలిగించదు. ఇది నిద్రకు కూడా సహాయపడుతుంది. కానీ జాగ్రత్తగా ఉండండి. వడ్డించే పరిమాణాలను అదుపులో ఉంచండి. ఎల్లప్పుడూ పప్పుధాన్యాలు, కూరగాయలను పక్కన పెట్టుకోండి. బ్రెడ్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ముఖ్యంగా గోధుమ, జొన్న లేదా మల్టీగ్రెయిన్ పిండి అయితే. రాత్రిపూట రోటీ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులకు, బరువును నియంత్రించుకోవాలనుకునే వారికి రోటీ మంచిదని నిపుణులు భావిస్తున్నారు. ఇక రోటీలో ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల మిమ్మల్ని ఎక్కువసేపు కడుపు నిండి ఉండేలా చేస్తుంది. అన్నం త్వరగా జీర్ణమవుతుంది. అందుకే రాత్రిపూట ఆకలిగా ఉన్నవారికి 1-2 రోటీలు మంచి ఎంపిక. బియ్యంలో ఉండే ట్రిప్టోఫాన్ తేలికపాటి విశ్రాంతినిస్తుంది. అందువల్ల రాత్రిపూట తేలికపాటి భోజనాన్ని ఇష్టపడేవారు కొంచెం అన్నం తినవచ్చు. బరువు తగ్గాలనుకుంటున్నారా ? అయితే రాత్రిపూట రోటీ మంచిది. జీర్ణశక్తి బలహీనంగా ఉందా లేదా తేలికైన భోజనం కావాలనుకునేవారికి అన్నంమంచి ఎంపిక.నిపుణుల అభిప్రాయం ప్రకారం.. రోటీ- అన్నం రెండూ రాత్రిపూట మంచివి. అది మీ ఆరోగ్యం, అవసరాన్ని బట్టి ఉంటుంది.

## ఆహారాలు కుక్కర్‌లో ఉడికించి తింటే.. కిడ్నీలు మటాష్! జాగ్రత్త మరీ..




వంట ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని కుక్కర్‌లో అన్ని రకాల ఆహారాలను వండటం సరైనది కాదు. అవును.. కుక్కర్‌లో కొన్ని ఆహార పదార్థాలను వండటం వల్ల వాటి పోషకాలు నాశనమవుతాయి. అలాంటి ఆహారాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఉంటాయి. దాదాపు ప్రతి ఇంట్లోనూ ప్రెషర్ కుక్కర్లు వాడుతారు. అన్నం వండటం నుంచి సాంబారు తయారీ వరకు త్వరగా వంట పూర్తి చేయడానికి, సమయం, గ్యాస్ ఆదా చేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. కానీ వంట ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని కుక్కర్‌లో అన్ని రకాల ఆహారాలను వండటం సరైనది కాదు. అవును.. కుక్కర్‌లో కొన్ని ఆహార పదార్థాలను వండటం వల్ల వాటి పోషకాలు నాశనమవుతాయి. అలాంటి ఆహారాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఉంటాయి. అందువల్ల ఈ రకమైన ఆహారాలను ప్రెషర్ కుక్కర్‌లో వండకూడదు.సాధారణంగా చాలా మంది కుక్కర్‌లో బియ్యం వండుతారు. కానీ బియ్యాన్ని ఎప్పుడూ కుక్కర్‌లో వండకూడదు. ఎందుకంటే ఇలా కుక్కర్‌లో బియ్యం వండడం వల్ల ఆర్సెనిక్ అనే విష పదార్థం విడుదల అవుతుంది. ఇది మన ఆరోగ్యానికి హానికరం. కాబట్టి ఓపెన్ పాత్రలో మాత్రమే బియ్యం వండటం మంచిది. పాలకూర, మెంతులు, కొల్లార్డ్ ఆకుకూరలు వంటి ఆకుకూరలను ప్రెజర్ కుక్కర్‌లో ఉడికించడం వల్ల వాటి పోషకాలు నశించి, మూత్రపిండాల్లో రాళ్లు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. కాబట్టి వాటిని సాధారణ పాన్‌లో తక్కువ వేడి మీద ఉడికించడం మంచిది. బీన్స్‌లో లెక్టిన్ అనే సహజంగా లభించే టాక్సిన్ ఉంటుంది. ఇది సరిగ్గా ఉడికించకపోతే జీర్ణ సమస్యలను కలిగిస్తుంది. ఫుడ్ పాయిజనింగ్‌కు కూడా కారణమవుతుంది. అలాగే, ప్రెషర్ కుకింగ్ బీన్స్‌లోని లెక్టిన్‌ను వేగంగా విచ్ఛిన్నం చేస్తుంది. ఇది జీర్ణ సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి ఈ కూరగాయలను ప్రెజర్ కుక్కర్‌లో ఉడికించడం మంచిది కాదు. ప్రెషర్ కుక్కర్‌లో పాలు మరిగించడం వల్ల దాని సహజ నిర్మాణం మారి అది పెరుగులా మారుతుంది. తద్వారా దాని పోషక విలువలు తగ్గుతాయి. పాలు మరిగించడానికి స్టీల్ లేదా నాన్-స్టిక్ పాన్ ఉత్తమం. టమోటాలు, చింతపండు లేదా పుల్లని పదార్థాలను ప్రెషర్ కుక్కర్‌లో ఉడికించడం వల్ల అవి ఆమ్లంగా మారతాయి. ఇది శరీరానికి హానికరం. కాబట్టి వాటిని స్టీల్ లేదా మట్టి పాత్రలో ఉడికించడం మంచిది. బీన్స్, కొన్ని ధాన్యాలు సహజ విష పదార్థాలను కలిగి ఉంటాయి. వీటిని ప్రెజర్ కుక్కర్‌లో పూర్తిగా తొలగించలేం. కాబట్టి, వాటిని రాత్రంతా నానబెట్టి ఆపై తక్కువ వేడి మీద ఓపెన్ పాత్రలో ఉడికించడం ఆరోగ్యకరమైనది.

## మటన్‌లోని ఈ పార్ట్ తింటే ఇక తిరుగుండదంతే



మేక మెదడు (మటన్ బ్రెయిన్) కూర బలహీనంగా ఉన్న పిల్లలకు, ఆపరేషన్ల నుండి కోలుకుంటున్న వారికి, కండరాల నిర్మాణానికి అద్భుతమైన పోషకాహారం. ఇందులో తక్కువ కార్బోహైడ్రేట్లు, ఎక్కువ ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, ఐరన్, ప్రోటీన్ ఉంటాయి. రక్తం గడ్డకట్టకుండా చేసి, జ్ఞాపకశక్తిని పెంచుతుంది. నాన్ వెజ్ ప్రియులు మటన్ (మేక మాంసం) ను ఎంతో ఇష్టంగా తింటారు.. అయితే.. మేకలోని పలు భాగాలు.. ఎన్నో ప్రత్యేకతలను కలిగి ఉంటాయి.. ఒక్కో పార్ట్.. ఒక్కో ప్రయోజనాన్ని కలిగి ఉంటుంది.. మటన్ తిల్లి, తలకాయ, లివర్, పాయా అన్ని స్పెషలే.. అయితే.. మేక మెదడు కూడా ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలను చేకూరుస్తుంది.. మేక మెదడులో ప్రోటీన్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ ః12, ఐరన్, భాస్వరం వంటి పోషకాలు అధికంగా ఉంటాయి.. ఇవి మెదడు ఆరోగ్యం, జ్ఞాపకశక్తి, రక్త ఉత్పత్తి, కండరాల బలానికి మేలు చేస్తాయి. కణాల మరమ్మత్తుకు సహాయపడటమే కాకుండా.. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. నాన్-వెజ్ ఆహారాన్ని ఇష్టపడేవారికి, ప్రత్యేకించి ఆరోగ్య ప్రయోజనాలను కోరుకునేవారికి మేక మెదడు కూర ఒక అద్భుతమైన ఎంపిక అని డైటీషియన్లు చెబుతున్నారు. ఈ వంటకం కేవలం రుచిని మాత్రమే కాకుండా, అనేక పోషక విలువలను కూడా అందిస్తుంది. ముఖ్యంగా, ఎదుగుతున్న పిల్లలకు, శారీరకంగా బలహీనంగా ఉన్నవారికి, ఇటీవల ఆపరేషన్ల నుండి లేదా గాయాల నుండి కోలుకుంటున్న వారికి, అలాగే కండరాల నిర్మాణాన్ని లక్ష్యంగా చేసుకుని వ్యాయామం చేసేవారికి ఈ కూర చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. మేక మెదడులో కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి. అయితే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, ఐరన్, ప్రోటీన్ వంటి ముఖ్యమైన పోషకాలు అధికంగా ఉంటాయి. ఈ పదార్థాలు శరీరానికి శక్తిని అందించి, రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ మెదడు ఆరోగ్యానికి, హృదయ ఆరోగ్యానికి ఎంతో అవసరం. ఐరన్ శరీరంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి తోడ్పడుతుంది. తద్వారా రక్తహీనతను నివారిస్తుంది. ప్రోటీన్ కండరాల మరమ్మత్తుకు, పెరుగుదలకు కీలకం. అంతేకాకుండా, మేక మెదడు రక్తం గడ్డకట్టకుండా చేసి, శరీరంలో రక్త ప్రవాహాన్ని సక్రమంగా నిర్వహించడానికి సహాయపడుతుంది. ఇది ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని కూడా పెంచుతుంది. తద్వారా ఆక్సిజన్ రవాణాను మెరుగుపరుస్తుంది. జ్ఞాపకశక్తిని పెంచే గుణాలు కూడా దీనిలో ఉన్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే కొలెస్ట్రాల్, కొవ్వు ఎక్కువగా ఉండటం వల్ల గుండె జబ్బులు ఉన్నవారు మితంగా తీసుకోవాలి. ఈ రుచికరమైన కూరను తయారుచేయడానికి, ముందుగా తాజా మేక మెదళ్లను పసుపు, ఉప్పు వేసిన నీటిలో 2-3 నిమిషాలు ఉడికించి, శుభ్రం చేసుకోవాలి. ఆ తర్వాత, నూనెలో ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, కరివేపాకు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి వేయించాలి. శుభ్రం చేసిన మెదళ్లను వేసి, పసుపు, ఉప్పు, కారం కలిపి నిదానంగా వేయించుకోవాలి. లవంగాలు, దాల్చినచెక్క, యాలకులు, మరాఠీ మొగ్గ, అనాస పువ్వు, జీలకర్ర, ధనియాలు, గసగసాలతో తయారుచేసిన మసాలా పేస్ట్‌ను వేసి, తగినంత నీళ్లు పోసి ఉడికించాలి. మెదళ్లు మెత్తబడిన తర్వాత ముక్కలుగా కట్ చేసి, మూతపెట్టి పది నిమిషాలు ఉడికించి, చివరగా కొత్తిమీరతో గార్నిష్ చేస్తే సరిపోతుంది..

## డ్రాగన్ కంట్రీలో జనాభా సంక్షోభం గణనీయంగా తగ్గిన సంతానోత్పత్తి



డ్రాగన్ కంట్రీ చైనాలో వరుసగా నాలుగో సంవత్సరం జననాల రేటు గణనీయంగా తగ్గింది. ఫలితంగా ఇది అక్కడ జనాభా సంక్షోభానికి దారితీస్తుందన్న ఆందోళన మొదలైంది. ఒకప్పుడు జనాభాలో ప్రపంచంలో అన్ని దేశాలకంటే చైనా టాప్ లో ఉండేది. కానీ గతేడాది జులై1 జనాభా లెక్కల ప్రకారం.. ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశాల లిస్టులో భారత్ ఫస్ట్ ప్లేస్ లో నిలిచింది. చైనా రెండోస్థానానికి పడిపోయింది. 2022లో చైనా మొదటి స్థానంలో ఉండగా.. మూడేళ్లుగా రెండోస్థానంలోనే కొనసాగుతోంది. 2024లో నమోదైన జనాభా సంఖ్యతో పోలిస్తే 2025లో జననాల సంఖ్య 17 శాతం తక్కువగా నమోదైందని అక్కడి గణాంకాలు చెబుతున్నాయి. గతేడాది అక్కడ జననాల సంఖ్య 79.2 లక్షలుగా నమోదయింది. ఆసియా ఖండంలో ఉన్న ఇతర దేశాలతో పోలిస్తే.. చైనాలో సంతానోత్పత్తి రేటు రోజురోజుకూ తగ్గుతోందని, ఇది దేశంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని చైనా ఆర్థిక రంగ నిపుణులు చెప్తున్నారు. చైనాలో పిల్లల్ని కనేందుకు జంటలు వెనుకాడుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం.. అక్కడి ప్రజల జీవన ఖర్చులు పెరగడమే. పిల్లల పెంపకం చాలా ఎక్స్పెన్సివ్ కావడంతో కనకపోవడమే మంచిదని భావిస్తున్నారు. పిల్లలు పుట్టినప్పటి నుంచి 18 ఏళ్ల వరకూ చదువుకి, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు సరాసరి 76 వేల డాలర్లు అంటే మన కరెన్సీలో రూ.69 లక్షలు ఖర్చవుతున్నట్లు ఒక అంచనా ఉంది. అందుకే పెళ్లిళ్లు చేసుకునేందుకు వెనుకాడుతున్నారు. పెళ్లయిన వాళ్లు పిల్లల్ని కనాలంటే ఖర్చు గురించి ఆలోచిస్తున్నారు. ఈ ఆలోచన ధోరణిని తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే కండ్రోమ్స్, గర్భనిరోధక మాత్రలపై 13 శాతం పన్ను విధించింది. నర్సరీ నుంచి కిండర్ గార్టెన్స్ వరకూ, వృద్ధుల సంరక్షణ, వికలాంగుల సేవలు, వివాహ సంబంధిత సేవలు.. వంటివాటిపై ఈ ఏడాది జనవరి 1 నుంచి పన్నును మినహాయించింది.


## ప్రజల్లో పెరుగుతున్న పొట్టతో దేశానికి తీవ్ర నష్టం తప్పదట?

మీరు ఆఫీసులో గంటల తరబడి కూర్చుంటున్నారా..? మీ బరువు పెరుగుతోందా..? చిన్న వయసులోనే షుగర్ వచ్చిందా..? అయితే అలర్ట్..! ఇది కేవలం మీ ఇంట్లో సమస్య కాదు.. దేశ ఆర్థిక వ్యవస్థకే ఒక పెద్ద ముప్పు! అదేంటని ఆశ్చర్యపోతున్నారా..? అసలు లావు వల్ల దేశానికి ఇంత నష్టమా? మనం తినే తిండికి, దేశం డెవలప్‌మెంట్‌కి లింక్ ఏంటి? ప్రపంచాన్ని ఇప్పుడు రెండు దెయ్యాలు పట్టి పీడిస్తున్నాయి. ఒకటి ఊబకాయం.. రెండు డయాబెటిస్! ఈ జబ్బుల వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాదీ ఏకంగా 5 కోట్ల 40 లక్షల మంది పనికి దూరమవుతున్నారు. అంటే ఒక రకంగా ఒక చిన్న దేశ జనాభా మాయమైపోతున్నట్టే! ఇదే స్పీడ్‌లో వెళ్తే.. 2035 నాటికి ప్రపంచంలో సగం మంది జనాభా.. అవును సగం మంది.. ఓవర్ వెయిట్‌తో బాధపడతారట. దీనివల్ల ప్రపంచానికి ఏటా 4 ట్రిలియన్ డాలర్ల నష్టం వస్తుందని హెచ్చరిస్తున్నారు నిపుణులు. ?ఇక మన భారతదేశ పరిస్థితి చూస్తే భయమేస్తుంది. డయాబెటిస్ వల్ల ఎక్కువ నష్టపోతున్న దేశాల్లో మనది రెండో స్థానం. మన దేశం మీద పడుతున్న భారం ఎంతో తెలుసా? 1.6 ట్రిలియన్ డాలర్లు! మన దగ్గర చాలామందికి చిన్న వయసులోనే షుగర్ రావడం, ఆఫీసులకు సెలవులు పెట్టడం, లేదా త్వరగా రిటైర్ అయిపోవడం వల్ల.. కంపెనీలకు, దేశానికి కోట్లలో నష్టం వస్తోంది. ?కానీ.. ఇప్పుడే మేల్కొంటే లాభం కూడా గట్టిగానే ఉంటుంది! ప్రజల ఆరోగ్యం మీద రూపాయి ఖర్చు పెడితే.. భవిష్యత్తులో అది వంద రెట్లు తిరిగి ఇస్తుంది. అందరూ ఫిట్‌గా ఉంటే 2050 నాటికి ప్రపంచ ఎకానమీకి 11 ట్రిలియన్ డాలర్లు అదనంగా వచ్చి చేరతాయట. ఇప్పటికే అమెరికాలో కొత్త రకం మందులు (ఉఒఖ-1) వాడి ఒబేసిటీని 2శాతం తగ్గించారు. మనం కూడా ఆ దిశగా వెళ్లాల్సిన టైం వచ్చింది. ఫైనల్‌గా చెప్పేది ఒక్కటే.. కంపెనీలు, గవర్నమెంట్లు.. జబ్బు వచ్చాక మందులకు డబ్బులు ఇవ్వడం కాదు.. అసలు జబ్బు రాకుండా ముందే జాగ్రత్త పడాలి. పోషకాహారం, రెగ్యులర్ చెకప్స్ ముఖ్యం. ఎందుకంటే.. వర్కర్ ఫిట్‌గా ఉంటేనే.. దేశం హిట్ అవుతుంది! ఇది మన ఆర్థిక నిపుణులు చెబుతున్న అంచనాలు.

## 30 ఏళ్ల తర్వాత అకస్మాత్తుగా బరువు ఎందుకు పెరుగుతారు

30 సంవత్సరాల వయస్సు తర్వాత.. చాలా మందికి అకస్మాత్తుగా బరువు పెరగడం.. అలాగే అలసట, నీరసం లాంటివి పెరుగుతాయి. దీనికి ప్రధాన కారణం అవసరమైన విటమిన్లు లేకపోవడం కావచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు. 30 ఏళ్ల తర్వాత చాలా మంది పురుషులు, మహిళలు అకస్మాత్తుగా బరువు పెరగడం.. నిరంతరం అలసటను అనుభవిస్తారు. గతంలో సులభంగా ఉండే పనులు ఇప్పుడు శ్రమతో కూడుకున్నవిగా.. అలసిపోయేలా చేసేవిగా అనిపిస్తాయి. ప్రజలు తరచుగా వృద్ధాప్యం, పని ఒత్తిడి లేదా మారుతున్న దినచర్యలు దీనికి కారణమని చెబుతారు. అయితే, చాలా సందర్భాలలో, ముఖ్యమైన విటమిన్లు లేకపోవడం ప్రధాన కారణం కావచ్చు.. దీనిని తరచుగా నిర్లక్ష్యం చేస్తారని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. శరీరానికి తగినంత విటమిన్లు అందనప్పుడు.. దాని ప్రభావాలు క్రమంగా కనిపిస్తాయి. బరువు పెరగడం, శక్తి లేకపోవడం, బద్ధకం దీనికి సంకేతాలు కావచ్చు. ఈ లక్షణాలు రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేయడం ప్రారంభిస్తాయి. కాబట్టి, ఈ మార్పులను తేలికగా తీసుకోవడం తెలివైనది కాదు. శరీరంలో ఏ విటమిన్ లోపాలు బరువు పెరగడానికి, అలసటకు దారితీస్తాయి..? ఇంతలో, విటమిన్ ః12 శరీరానికి శక్తిని అందించడంలో, ఆరోగ్యకరమైన నాడీ వ్యవస్థను నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ః12 లోపం శక్తి ఉత్పత్తి తగ్గడానికి దారితీస్తుంది.. అలసట, బలహీనత, కార్యాచరణ తగ్గడానికి దారితీస్తుంది. ఈ రెండు విటమిన్లలో దీర్ఘకాలిక లోపాలు బరువు నియంత్రణను కష్టతరం చేస్తాయి.. ఇంకా తీవ్ర అలసటకు దారితీస్తాయి. విటమిన్ డి లోపాన్ని అధిగమించడానికి, ప్రతిరోజూ కొంత సమయం ఎండలో గడపడం ప్రయోజనకరంగా ఉంటుంది. అదనంగా, మీ ఆహారంలో పాలు, పెరుగు, బలవర్ధకమైన ఆహారాలను చేర్చుకోండి. విటమిన్ బి 12 కోసం, పాలు, పెరుగు, జున్ను, పప్పుధాన్యాలు, ఆకుపచ్చ కూరగాయలు, చేపలు, చికెన్, గుడ్లు, బలవర్ధకమైన ఆహారాలను మీ ఆహారంలో చేర్చుకోండి. అవసరమైతే, వైద్యుడి సలహాతో సప్లిమెంట్లను తీసుకోవచ్చు.

## బెంచ్‌పై కూర్చోబెట్టి విసిగించారు?.. అసంతృప్తిలో వైభవ్.. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీతో కొత్త చర్చ!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్‌తో జరగబోయే రెండో టీ20 మ్యాచ్‌కు ముందు 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ పెట్టిన ఒక ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా హల్‌చల్ చేస్తోంది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు తొలిసారి ఇండియాకు ఎంపికైన వైభవ్.. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఇక ఈరోజు మాంచెస్టర్‌లో జరగబోయే రెండో మ్యాచ్‌కు ముందు వైభవ్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో కొత్త అధ్యాయం అంటూ ఒక క్యాప్షన్‌ను జోడించాడు. దీంతో అతని నిరీక్షణ ముగిసిందని, ఈ మ్యాచ్‌తో అతను అంతర్జాతీయ క్రికెట్లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నాడంటూ ఫ్యాన్స్ అనుకుంటున్నారు.

**ఇన్‌స్టా స్టోరీతో అరంగేట్రంపై క్లారిటీ:**
వైభవ్ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ అరంగేట్రంపై ఆశలు రేకెత్తిస్తున్నప్పటికీ.. మ్యాచ్‌కు ముందు జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ చేసిన వ్యాఖ్యలు మాత్రం అతడు మరికొంత కాలం వేచి చూడక తప్పదనే సంకేతాలు ఇచ్చాడు. ఇటీవల భారత్ గెలిచిన టీ20 ప్రపంచకప్‌లో అద్భుతంగా రాణించిన సీనియర్ ప్లేయర్స్ కు అండగా నిలవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కఠినమైన పరిస్థితుల్లో జట్టును గెలిపించిన ఆటగాళ్లను బ్యాక్ చేస్తూనే, ఇక్కడి కండిషన్స్‌కు తగ్గట్టుగా టాప్ ఆర్డర్‌ను పటిష్టం చేయడమే తమ ప్రస్తుత లక్ష్యమని మోర్కెల్ పేర్కొన్నారు.

**వరల్డ్ కప్ హీరోలకే మేనేజ్‌మెంట్ ఓటు:**
2026 టీ20 ప్రపంచకప్ టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించిన సంజు శాంసన్, అభిషేక్ శర్మల ఓపెనింగ్ జోడీనే రెండో టీ20లోనూ కొనసాగించేందుకు టీమ్ మేనేజ్‌మెంట్ ఇంట్రెస్ట్ చూపుతోంది.ద

గత మూడు మ్యాచ్‌ల్లో శాంసన్ కేవలం ఒకే ఒక్క పరుగు చేసి ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్నప్పటికీ.. వరల్డ్ కప్ నాకౌట్ దశలో అతను ఆడిన వరుస మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌ల ట్రాక్ రికార్డ్‌ను బట్టి కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అతనికి మరో ఛాన్స్ ఇవ్వాలని చూస్తున్నాడు. దీనివల్ల వైభవ్‌కు ఈ మ్యాచ్‌లోనూ నిరాశే ఎదురయ్యేలా కనిపిస్తోంది.

# సచిన్ రికార్డును బ్రేక్ చేసిన వైభవ్ సూర్యవంశీ..
# 15 ఏళ్లకే భారత జట్టులో చోటు



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయం స్టార్ట్ అయింది. బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాకు చెందిన 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ ఇంగ్లాండ్‌తో జరుగుతున్న రెండో టీ20 మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్ అరంగేట్రం చేశాడు. ఈ మ్యాచ్‌తో వైభవ్ తన అద్భుతమైన ప్రయాణాన్ని మొదలు పెట్టడమే కాకుండా, భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట దశాబ్దాలుగా ఉన్న అరుదైన రికార్డును బ్రేక్ చేసేశాడు.

**సచిన్ రికార్డు కనుమరుగు:**
వైభవ్ సూర్యవంశీ డెబ్యూతో భారత క్రికెట్ చరిత్ర పుస్తకాల్లో ఒక మార్పు చోటు చేసుకుంది. దశాబ్దాలుగా మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ రికార్డు ఇప్పుడు కనుమరుగైంది. ప్రస్తుతం వైభవ్ 15 సంవత్సరాల, 3 నెలల, 7 రోజుల వయస్సులో ఇంగ్లాండ్ గడ్డపై డెబ్యూ చేశాడు. ఇక సచిన్ టెండూల్కర్1989లో 16 సంవత్సరాల, 205 రోజుల వయసులో పాకిస్థాన్‌పై అరంగేట్రం చేశారు. కేవలం 15 ఏళ్ల ప్రాయంలోనే బ్లూ జెర్సీని ధరించి, ఇంటర్నేషనల్ క్రికెట్ లోకి అడుగుపెట్టిన వైభవ్, భారత పురుషుల క్రికెట్ జట్టు తరఫున ఆడిన అత్యంత పిన్న వయస్కుడైన ఆటగాడిగా 7శీబఅస్త్రవర్ ×అఎఖుఅ జతీఱఎిఎవివతీ) చరిత్ర పుటల్లో నిలిచాడు.

**ఐపీఎల్ నుంచి ఇంటర్నేషనల్ స్టేజీ వరకు:**
వైభవ్ సూర్యవంశీ ఈ స్థాయికి రావడానికి కారణం ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026లో అతను ప్రదర్శించిన అద్భుతమైన ఆటతీరు. రాజస్థాన్ రాయల్స్ తరఫున బరిలోకి దిగిన ఈ టీనేజర్, టోర్నీలోనే అత్యధిక పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. అసాధారణ స్ట్రైక్ రేట్‌తో బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టిన వైభవ్, భారత సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. ఐర్లాండ్ పర్యటనలో ఛాన్స్ రాకపోయినా, ఇంగ్లాండ్‌తో జరిగిన మొదటి టీ20లో బెంచ్‌కే పరిమితమైనా.. వైభవ్ తన శ్రమతో ఈరోజు తుది జట్టులో స్థానం సంపాదించుకున్నాడు.

**ఫ్యూచర్ స్టార్ క్రికెటర్:**
15 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్ ఒత్తిడిని ఎదుర్కొంటూ, దిగ్గజాల సరసన అరంగేట్రం చేయడం సాధారణ ముచ్చట కాదు. వైభవ్ సూర్యవంశీలోని ప్రతిభ, పోరాట పటిమ చూస్తుంటే, రాబోయే రోజుల్లో అతను భారత క్రికెట్‌లో మరెన్నో రికార్డులను సృష్టించడం ఖాయమని క్రీడా విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ వండర్ కిడ్ అరంగేట్రంతో కోట్లాది మంది భారత అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

## వరల్డ్‌కప్‌లో అసలైన వార్ స్టార్ట్.. ఒక్కో మ్యాచ్ ఫైనల్‌లా.. రౌండ్ ఆఫ్ 16 పూర్తి షెడ్యూల్ ఇదే!






**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిఫా ప్రపంచకప్ లో ఉత్కంఠభరితమైన రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లు ముగిశాయి. ఇప్పుడు అందరి దృష్టి రౌండ్ ఆఫ్ 16 పైకి మళ్లింది. ప్రపంచకప్ ట్రోఫీ రేసులో ప్రస్తుతం 16 జట్లు మిగిలి ఉన్నాయి. ఈ రౌండ్ ఆఫ్ 32లో నాలుగు సార్లు ఛాంపియన్‌గా నిలిచిన బలమైన జర్మనీని పరాగ్వే ఓడించడం, అలాగే నెదర్లాండ్స్‌పై మొరాకో పెనాల్టీ షూటౌట్‌లో విజయం సాధించడం ఈ టోర్నీలోనే హైలెట్ గా నిలిచాయి. ఇకపై ట్రోఫీని ముద్దాడటానికి జట్లు కేవలం నాలుగు విజయాల దూరంలో మాత్రమే ఉన్నాయి.

పోర్చుగల్ వర్సెస్ స్పెయిన్: జూలై 7న జరగబోయే ఈ మ్యాచ్ కోసం ఫుట్‌బాల్ ప్రపంచం మొత్తం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. పోర్చుగల్ ఇప్పటివరకు ఒక్క ప్రపంచకప్ కూడా గెలవలేదు. క్రిస్టియానో రొనాల్డోకు ఇది చివరి ప్రపంచకప్ అయ్యే అవకాశం ఉండటంతో, ఈ లెజెండ్ కోసం కప్పు గెలవాలని పోర్చుగల్ కసితో ఉంది. అయితే, ప్రస్తుత ఫామ్ ప్రకారం స్పెయిన్ హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది.

అర్జెంటీనా వర్సెస్ ఈజిప్ట్: డిఫెండింగ్ ఛాంపియన్ అయిన అర్జెంటీనా ఇప్పటి వరకు ఈ టోర్నీలో ఓటమి లేకుండా దూసుకుపోతోంది. రౌండ్ ఆఫ్ 32లో కేప్ వెర్డే జట్టు అర్జెంటీనాకు గట్టి పోటీ ఇచ్చినప్పటికీ, ఎలాగోలా బతికి బయటపడింది. ఇప్పుడు వారు మహ్మద్ సలాకు చెందిన ఈజిప్ట్ జట్టుతో తలపడనున్నారు.

ఇంగ్లాండ్ వర్సెస్ మెక్సికో: డీఆర్ కాంగోను ఓడించి ఇంగ్లాండ్, ఈక్వెడార్‌పై గెలిచి మెక్సికో ఈ రౌండ్‌కు క్వాలిఫై అయ్యాయి. 1966 తర్వాత రెండోసారి ప్రపంచకప్ గెలవాలని ఇంగ్లాండ్ చూస్తుండగా, మెక్సికో తన క్వార్టర్ ఫైనల్ రికార్డును (1970, 1986) తిరగరాయాలని భావిస్తోంది.

ఇతర మ్యాచ్‌లు: ఫ్రాన్స్ జట్టు పరాగ్వేతో, బ్రెజిల్ జట్టు ఎర్లింగ్ హాలాండ్‌కు చెందిన నార్వే జట్టుతో తలపడనున్నాయి.

# నేచురల్ గ్లామ్ ఓవర్‌లోడ్... అనంతికా లేటెస్ట్ ఫోటోలు ట్రెండింగ్!





సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలో తన సహజమైన నటనతో, క్యూట్ లుక్స్‌తో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది యంగ్ బ్యూటీ అనంతికా శనిల్‌కుమార్. ఇటీవల తెలుగులో వచ్చిన '8 వసంతాలు' సినిమాతో పాటు తమిళ చిత్రం 'పరిమళ అండ్ కో'తో అందరి దృష్టిని ఆకర్షించిన ఈ కేరళ కుట్టి, తాజాగా ప్రకృతి ఒడిలో చేసిన ఒక ఫోటోషూట్ నెట్టింట బాగా ట్రెండ్ అవుతోంది. సాంప్రదాయ ఆలివ్ గ్రీన్ చీరలో, ఎలాంటి హంగామా లేని నేచురల్ గ్లామ్‌తో అనంతికా ఒలికించిన హావభావాలు కుర్రకారు మనసులను దోచుకుంటున్నాయి.

**ప్రకృతి ఒడిలో అనంతికా సొగసులు:**
ఈ సరికొత్త ఔట్‌డోర్ ఫోటోషూట్‌లో అనంతికా చుట్టూ పచ్చటి చెట్లు, ప్రకృతి అందాల మధ్య ఎంతో ఆహ్లాదకరంగా కనిపిస్తోంది. ఇక ఒక అందమైన దారిపై నడుస్తూ, పెదవులపై చెరగని చిరునవ్వుతో ఆమె ఇచ్చిన పోజులు చూసేవారికి ఫుల్ పాజిటివ్ వైబ్స్ ఇస్తున్నాయి. ఈ ఫోటోలలో ఆమె సింప్లిసిటీనే అందరికీ బాగా నచ్చేస్తోంది.

**ఆలివ్ గ్రీన్ చీరలో మోడ్రన్ టచ్:**
ఈ షూట్ కోసం అనంతికా ఎంచుకున్న డ్రెస్సింగ్ స్టైల్ చాలా సింపుల్‌గా, క్లాసీగా ఉంది. ఆమె కట్టుకున్న ఆలివ్ గ్రీన్ కలర్ హ్యాండ్లూమ్ లేదా బ్లాక్-ప్రింటెడ్ కాటన్ చీరపై ఉన్న చిన్న చిన్న ఎత్నిక్ డిజైన్లు చాలా బాగున్నాయి. ఇక దీనికి కాంబినేషన్‌గా వేసుకున్న ప్లెయిన్ బ్లాక్ స్లీవ్‌లెస్ బ్లౌజ్, డీప్ స్కూప్ నెక్ లైన్ ఆమె లుక్‌కి ఒక మోడ్రన్ టచ్ ఇచ్చింది.

**నో-మేకప్ లుక్.. మురిపిస్తున్న నవ్వు:**
ఈ ఫోటోషూట్‌కి అసలైన హైలైట్ ఏంటంటే, అనంతికా అసలు భారీ మేకప్ జోలికే వెళ్లలేదు. చాలా మినిమల్ మేకప్, సింపుల్ హెయిర్‌స్టైల్ మరియు ఎలాంటి భారీ ఆభరణాలు లేకుండా కేవలం చిన్న చిన్న జ్యువెలరీతోనే మెరిసిపోయింది. "అచ్చమైన పల్లెటూరి పిల్లను చూసినట్టు ఉందంటూ" నెటిజన్లు ఈ ఫోటోలకు హార్ట్ ఎమోజీలతో లైకుల వర్షం కురిపిస్తున్నారు.



**మలయాళం టు టాలీవుడ్ జర్నీ:**
మలయాళ సినిమాతో కెరీర్ స్టార్ట్ చేసిన అనంతికా శనిల్‌కుమార్, చాలా తక్కువ టైమ్‌లోనే సౌత్ మేకర్స్ దృష్టిలో పడింది. ఇక తన ఎక్స్‌ప్రెసివ్ కళ్లతో, సహజమైన యాక్టింగ్‌తో ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. కథల ఎంపికలో వైవిధ్యం చూపిస్తూ, కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యం ఉన్న రోల్స్ ఎంచుకుంటూ ఇండస్ట్రీలో ప్రామిసింగ్ హీరోయిన్‌గా ఎదుగుతోంది .సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, సోషల్ మీడియా ద్వారా అభిమానులకు ఎప్పుడూ టచ్‌లో ఉంటుంది అనంతికా. ప్రకృతిని ఎంతగానో ప్రేమించే ఈ బ్యూటీ, తన మనసుకు నచ్చిన లొకేషన్లలో ఇలాంటి క్యూట్ ఫోటోషూట్స్ చేస్తూ నెటిజన్లను సర్ప్రైజ్ చేస్తోంది. మరిన్ని వైవిధ్యమైన ప్రాజెక్టులతో ఈ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ మున్ముందు మరెన్నో విజయాలు అందుకోవాలని ఆశిద్దాం..

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965